www.prajapakshams.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

7th ANNIVERSARY 22nd October, 2025

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 12 | సోమవారం | 08-12-2025 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

మావోయిస్టుల కంచుకోట... కొండపల్లిలో మొబైల్ టవర్

బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటింగ్‌కు.. ఎంపిలను అనుమతించాలి

## గొప్ప కార్యాలకు మహాసంకల్పం అవసరం

- జాతికోసం.. జనహితం కోసం కలలు కనాలంటే ధైర్యం ఉండాలి
- రెండేళ్ళ ప్రస్థానంలో అహర్నిశలూ అవనిపై తెలంగాణను శిఖరాగ్రాన నిలిపేందుకు తపనతో శ్రమించా
- కొన ఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో ఊపిరి పోశాం
- ప్రజాప్రభుత్వం రెండేళ్ళు పూర్తి సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు
- నిన్నటి వరకూ ఒక్క లెక్క... గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క అని వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్

రెండేళ్ల ప్రస్థానంలో అనునిత్యం అహర్నిశలూ అవనిపై తెలంగాణను శిఖరాగ్రాన నిలిపేందుకు తపనతో శ్రమించామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. గత పాలన శిథిలాల కింద కొన ఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోశామని, రుణ భారంతో వెన్ను విరిగిన రైతుకు దన్నుగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిపామని తెలిపారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, స మానత్వం అనే మూల సిద్ధాంతంగా ముందుకు సాగుతున్నామన్నారు. 'జాతి కోసం...జన హితం కోసం..గొప్ప కలలు కనాలంటే..

తరువాయి 2లో





## గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం

**నేడు లాంఛనంగా ప్రారంభించనున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

- భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లు
- సదస్సుకు 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు
- ఒక్క అమెరికా నుంచే వివిధ కంపెనీలకు చెందిన 46 మంది
- రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు
- హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీతో ప్రచార ఏర్పాట్లు
- లైటింగ్ ప్రొజెక్షన్, 3డి ప్రొజెక్షన్ మ్యాపింగ్‌తో ప్రదర్శనలు
- 6000 మంది పోలీసులతో బందోబస్తు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవ్యాప్తంగా పేరెన్నికగల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. ఒక్క అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు తరలివస్తున్నారు. సోమవారం మధ్నాహ్నం ఒకటిన్నరకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా సమ్మిట్‌ను ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభవేడుకకు హాజరవుతున్నారు. సమ్మిట్‌లో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియా టెక్నాలజీ గ్రూప్ సిఇఒ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సిఇఒ జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా, తదితరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజా పాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం వైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు,

తరువాయి 2లో







## 25 మంది మృత్యువాత

**ఆరుగురికి గాయాలు**

## అగ్ని కీలలో నైట్‌క్లబ్

- గోవాలోని బూబిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్‌లో భారీ అగ్ని ప్రమాదం
- మంటల ధాటికి ఊపిరి ఆడక పలువురు మృతి
- వారాంతపు వినోదంలో... భయంకరమైన విషాదం
- అనుమతిలేని నిర్మాణాల్లో క్లబ్ నిర్వహణ
- వివరణాత్మక మేజిస్ట్రేట్ విచారణకు సిఎం సావంత్ ఆదేశం
- యజమానులపై ఎఫ్ఐఆర్
- ఘటన పట్ల రాష్ట్రపతి, ప్రధాని, పలువురు ప్రతిపక్షనేతలు దిగ్భ్రాంతి

**పనాజి :** వారాంతపు వినోదం భయంకరమైన విషాదంగా మారింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఉత్తర గోవాలోని ఒక నైట్‌క్లబ్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 25 మంది ప్రాణాలు కోల్పోగా, ఆరుగురు గాయపడ్డారు. మృతులలో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బంది ఉన్నారు, మిగిలిన ఏడుగురి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. పనాజీ నుండి 25 కి.మీ దూరంలో అర్పోరా వద్ద ఉన్న బూబిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో బాధితులు చిక్కుకుపోయారు. దీంతో పలువురు ఊపిరాడక మరణించారని అగ్నిమాపక అధికారి ఒకరు తెలిపారు. నైట్‌క్లబ్ అక్రమ నిర్మాణమని, అయితే క్లబ్‌కు నోటీసును అందజేసిన అందజేయగా, దానిని ఉన్నతాధికారి నిలిపివేసారని గ్రామ అధికారి ఒకరు పేర్కొన్నారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించినప్పటికీ దానిని నిర్వహించడానికి అనుమతించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరి చొప్పున రూ. 5 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు విచారం వ్యక్తం చేశారు. కాగా, క్లబ్ మొదటి అంతస్తులో మంటలు ప్రారంభమయ్యాయని, ఇరుకైన, చిన్న తలుపులు

తరువాయి 2లో

## రోడ్లకు అంతర్జాతీయ కంపెనీల పేర్లు

ఒఆర్ఆర్ వద్ద రావిర్యాల నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ వరకు వంద మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ 'రతన్ టాటా'

అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'

03

## నేడు విత్తన ముసాయిదా బిల్లుల ప్రతులు దహనం

ప్రతి గ్రామంలో చేపట్టాలని ఎస్‌కెఎం పిలుపు

బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్

కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా రైతులు ఐక్యంగా పోరాటానికి సూచన



## ఓట్లు నోట్ల చుట్టూ రాజకీయాలు

- ప్రశ్నించే గొంతుకలను అంతమొందిస్తామనడం సిగ్గు చేటు
- మనషుల్లా చూడనివాళ్లు గద్దె దిగాల్సిందే
- సమస్యలపై స్పందన లేకుండా సాహిత్య సృష్టి జరగదు
- నిఖిలేశ్వర్ రచనల ఆవిష్కరణ కార్యక్రమంలో జస్టిస్ బి.సుదర్శనరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓట్లు, నోట్లు, ఎన్నికలు, పార్టీలు, ఎలక్టొరల్ బాండ్స్ చుట్టూ రాజకీయాలు జరుగుతున్నాయని, ప్రజలను పట్టించుకునేవారు లేరని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి విమర్శించారు. గత మూడు రోజులుగా ఇండిగో విమానయాల సంస్థ గొడవపై కేంద్ర ప్రభుత్వం 3 రోజులు గడిచిన తర్వాత స్పందించడం వెనక రహస్యం ఏమిటో బయటపెట్టాలన్నారు. రాజకీయ దృక్పథం, సమస్యలపై స్పందన లేకుండా ఉత్తమ సాహిత్య సృష్టి ఏనాడూ జరగలేదని విశ్వసించే 'దిగంబర విప్లవ కవి నిఖిలేశ్వర్' అన్నారు. అగ్ని శ్వాసలతో కాలాన్ని అధిగమించడంతో పాటు తన రచనలతో యుగ స్వరాన్ని వినిపిస్తున్నారని అభినందించారు. రచనా రంగంలో దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా క్రియాశీలకంగా

తరువాయి 2లో

## సూడాన్‌లో ఆర్ఎస్ఎఫ్ డ్రోన్‌దాడి

**33 మంది పిల్లలు సహా 50 మంది మృతి**



**ఖార్టూమ్:** అంతర్యుద్ధం జరుగుతున్న సూడాన్ కోర్డోఫాన్ ప్రాంతంలోని కలోగీ పట్టణంలో శిశు పాఠశాలపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో 33 మంది పిల్లలతోపాటు మొత్తం 50 మంది మరణించారు. ఈ ప్రాంతానికి తక్షణం తరలివచ్చిన వైద్యబృందాలు, పౌరులపై కూడా దాడులు జరిగాయి. సైన్యంతో జరుగుతున్న యుద్ధంలో ఆర్ఎస్ఎఫ్ (ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్) చేసిన దాడిలో ఈ విషాద ఘటన జరిగింది. ఐక్యరాజ్యసమితి యూనిసెఫ్ సంస్థ ఈ దాడి ఘటనను తీవ్రంగా ఖండించింది. శిశుపాఠశాలపై దాడి చేయడం, పిల్లలను చంపడం అత్యంత దారుణమైన హింసాకాండ, హక్కు ల ఉల్లంఘనగా యూనిసెఫ్ పేర్కొంది. ఈ విధమైన అంతర్యుద్ధాలలో పిల్లలను

తరువాయి 12లో

## 'ఇండిగో' రీఫండ్

- రూ.610 కోట్ల మేర చెల్లింపులు
- సర్వీసుల పునరుద్ధరణ
- చర్యలకు సిఎంజి ఏర్పాటుకు నిర్ణయం





**న్యూఢిల్లీ :** రద్దయిన, ఆలస్యమైన ఇండిగో విమానాల టికెట్ల రీఫండ్‌కు సంబంధించి ఇప్పటివరకు రూ.610కోట్ల మేర చెల్లింపులు జరిగినట్లు పౌర విమానయానశాఖ ప్రకటించింది. ప్రయాణికులకు సంబంధించి శనివారం నాటికి ఆ సంస్థ దేశవ్యాప్తంగా 3,000 లగేజీలను డెలివరీ చేసిందని వెల్లడించింది. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణాలను రీషెడ్యూల్ చేసేందుకు ఎటువంటి అదనపు ఫీజులు వసూలు చేయొద్దని తెలిపింది. పరిస్థితులు వేగంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నట్లు పేర్కొంది. టికెట్ల రీఫండ్ ప్రక్రియను ఆదివారం

తరువాయి 12లో

**150 ఏళ్ల 'వందేమాతరం'**

## నేడు పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ





- పది గంటల సమయం కేటాయింపు
- చర్చను ప్రారంభించనున్న ప్రధాని నరేంద్రమోదీ
- కాంగ్రెస్ తరపున 8 మంది ఎంపిలు ప్రసంగం

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా నేడు (సోమవారం) లోక్‌సభలో జాతీయ గేయం వందేమాతరంపై ప్రత్యేక చర్చ జరగనుంది. వందేమాతరం 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఈ చర్చను మధ్యాహ్నం 12 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఈ అంశంపై సభను ఉద్దేశించి ఆయన సుదీర్ఘ ప్రసంగం

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఉక్రేన్–రష్యా పరస్పర దాడులు

**కీవ్:** ఉక్రేన్‌పై రష్యా వరుస దాడులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా తమ భూభాగాలపై ఉక్రేన్ డ్రోన్ల దాడులు చేస్తోందని రష్యా సైన్యం ప్రకటనలు చేస్తోంది.సెంట్రల్ ఉక్రేన్‌లోని మేజర్ ఇండస్ట్రియల్ హబ్‌పై ఆదివారం తెల్లారకముందే మళ్ళీ డ్రోన్లు,క్షిపణి దాడులు జరిగాయనీ, మృతులసంఖ్య తెలియరాలేదనీక్రెమెన్‌చుక్ మేయర్ విటాలీ మాలెట్స్కీ చెప్పారు. ఈ ప్రాంతంపై రష్యాపదేపదే సామూహిక దాడులు చేస్తోందని అయినాగానీ తమ ప్రాంతం వాటిని తట్టుకుని నిలబడుతోందని అన్నారు. ఎంత నష్టం జరిగిందో ఇంకా తెలియలేదని, విద్యుత్, నీటి సరఫరా సమస్యలు బాగా పెరిగిపోయాయనీ చెప్పారు. కాగా సరిహద్దుల్లోని రష్యా భూభాగాలపై ఉక్రేన్ అనేక ప్రాంతాల్లో దాడులు చేసిందని, 77 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేశామని రష్యాసైన్యం ప్రకటించింది. ఒకవైపు సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ మరోవైపు ఇరు దేశాలమధ్యా గగనతల దాడులు విరామంలేకుండా కొనసాగుతున్నాయి.

### విషాదఛాయల మధ్య

# హాంగ్‌కాంగ్ రీజియన్‌లో పోలింగ్

**తమర్:** ప్రపంచాన్ని కలవరపెట్టిన భయంకరమైన అగ్ని ప్రమాద ఘటన జరిగిన రెండు వారాల తర్వాత హాంగ్‌కాంగ్ రీజియన్ (చైనా ప్రత్యేక పరిపాలనాప్రాంతం) చట్టసభకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. శాసనమండలి సభ్యులను ఎన్నుకోవడానికి నిన్నటివరకూ జరిగిన ప్రచారంలో అభ్యర్థులందరూ తాము చైనాపట్ల ఎంతో విధేయతతో ఉంటామని పోటాపోటీగా ప్రచారం చేశారు. ఐతే అగ్ని ప్రమాద ఘటన జరిగిన తర్వాత మృతులకు సంతాపసూచకంగా, సంతాప దినాలు పాటిస్తూ అభ్యర్థులు ప్రచార కార్యక్రమాలను నిలిపివేశారు. చాలామంది ప్రజలు ఈ అగ్నిప్రమాద ఘటన తర్వాత ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వం ఈ ఘటనకు జవాబుదారీ వహించాలని ప్రజలు గట్టిగా కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నాటికి 20 శాతం పోలింగ్ మాత్రమే జరిగింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 11.30 గంటల వరకూ పోలింగ్ కొనసాగదుతుంది. హాంగ్‌కాంగ్ రీజియన్ శాసనమండలిలో మొత్తం 90 స్థానాలు ఉండగా, 161 మంది




పైగా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 2021 తర్వాత రెండో సారి హాంగ్‌కాంగ్ రీజియన్ ప్రజలు కొత్త శాసనమండలి ఎన్నికకు పోలింగ్ పూర్తి చేశారు. 2021లో 30 శాతం ఓటింగ్ జరిగింది. ''ఒక బాధ్యతగల పౌరుడుగా నా విధి నేను నిర్వహించాను, ఓటు వేశాను, ఎవరు గెలుస్తారో, ఎవరు సమర్థవంతంగా పనిచేశారో చెప్పలేనుగానీ, వృద్ధులకోసం పాటుపడే అభ్యర్థికే నేను ఓటు వేశా'' అని పోలింగ్ కేంద్రం వ ద్ద ఓటరు–పదవీ విరమణ చేసిన క్వాన్ లామ్ చెప్పారు. కాగా ఒక అరుదైన ఘటన ఏమిటంటే ఈ ఎన్నికలకు ము ందుగా చైనా ప్ర భుత్వం స్థానిక జ ర్నలిస్టులను, విదేశీ జర్నలిస్టులను స మావేశపరచి చట్టాలకు లోబడి వ్యవహరించాలని ముం దస్తు హెచ్చరిక చేసింది. చైనాకు విధేయులైన అభ్యర్థులు మాత్రమే ఈ ఎన్నికల్లో దాదాపు పోటీ చేశారు. 2019లో హాంగ్‌కాంగ్‌లో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. దీంతో తీవ్ర అణచివేత చర్యలు జరిగాయి. అప్పటినుండీ ప్రజాస్వామ్య అనుకూల మద్దతుదారులు ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంటున్నారు. నగరంలో 40.10 లక్షలమంది ఓటర్లు ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2021లో ఎన్నికల వ్యవస్థలో మార్పులు చేసిన తర్వాత మొత్తం 90 శాసనమండలి స్థానాలకుగాను 40 మమందిని చైనా అనుకూల ఎన్నికలకమిటీ ఎన్నుకుంటుంది. 20 మంది సభ్యులను ప్రజలు ఎన్నుకుంటారు. మరో 30 మంది వివిధ గ్రూపులనుండి ప్రాతినిధ్యం వహిస్తారు. వీరిలో పరిశ్రమలు,ఫైనాన్స్, హెల్త్‌కేర్,రియల్ ఎస్టేట్ రంగాలకు చెందినవారు ఉంటారు. గతనెలలో థాయ్ పో జిల్లాలో ఏడు ఆకాశహర్మ్యాలు మంటల్లో దగ్ధమైన 161 మంది సజీవ దహనమైన ఘటనలో ప్రజలు ఇప్పటికీ మృతులకు నివాళులు అర్పిస్తూ ఆవేదన చెందుతున్న తరుణంలో ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ ఘటన తర్వాత అధికారులు ఈ ఆకాశహర్మ్యాల నుండి బ్రతికి బయటపడినవారికి సకల సదుపాయాలు సమకూర్చి వారి మెప్పు పొందేందుకు ప్రయత్నాలు చేశారు.అనేకమందిడవలపర్స్‌ను, అనుమానితులను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

## బెనిన్‌లో సైనిక తిరుగుబాటు యత్నం విఫలం



**బెనిన్:**పశ్చిమ ఆఫ్రికాదేశం బెనిన్(పూర్వపు దహోమీ రా జ్యం) లో సైనిక తిరుగుబాటు జరిగిందని వార్తలు వెలువడ్డా యి. కానీ ప్రభుత్వం దానిని ఖండించింది. దేశాధ్యక్షుడు ప్యా ట్రిస్ టాలోన్‌ను పదవీచ్యుతుణ్ణి చేసి అధికారం చేజిక్కించుకున్నట్లు సైన్యం జాతీయ టెలివిజన్‌లో ఆదివారం మధ్యాహ్నం ప్రకటించింది. రాజ్యాంగాన్ని స్తంభింపజేశామని, సరిహద్దులు, గగనతలం మూసివేశామనిసైన్యంప్రకటించింది. ఐతే ఈ విషయంలో వివాదాస్పదమైన వార్తలు వెలువడ్డాయి. ఆదివారం ఉదయమే సైన్యం తిరుగుబాటు ప్రయత్నం చేసిందని, కానీ ఈ తిరుగుబాటు విఫలమైందని, దేశాధ్యక్షుడు టాలోన్ సురక్షితంగాఉన్నారని, తిరుగుబాటు చేసిన చిన్న సైనిక బృందానికి సాధారణ సైన్యం మద్దతు లేదని, తిరిగి దేశాన్ని సైన్యం నుండి విముక్తిచేసి స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోందని వార్తలు వెలువడ్డాయి. కానీ దేశాధ్యక్షుడు ఎక్కడ ఉన్నదీ ఆచూకీ తెలియరాలేదు. ''పరిస్థితిఅదుపులోఉంది,మెజారిటీసైన్యం,సాధారణ సైన్యం ప్రభుత్వ అధీనంలో ఉంది, దేశాధ్యక్షుడు సురక్షితంగా ఉన్నారు, పరిస్థితులను తిరిగి అదుపులోకి తెచ్చుకుంటున్నాం'' అని విదేశీమంత్రి షగన్ అడ్జాబీ బకరీ రాయిటర్స్ వార్తా సంస్థకు చెప్పారు. కానీ సైనిక నాయకులు జాతీయ టెలివిజన్‌లో ప్రత్యక్షమై దేశాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. కాగా బెనిన్‌లో ఉన్న ఫ్రాన్స్ దేశ రాయబార కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, అధ్యక్ష భవనం సమీపంలో సైనికులు కాల్పులు జరిపారు. కోటోనౌ ప్రధాన నగరంలో అధ్యక్షుడి భవంతి ఉంది. కాగా పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక అధికారి ఎఎఫ్‌పి న్యూస్ ఏజన్సీతో మాట్లాడుతూ ''ఈ సైనికబృందం చాలా చిన్న గ్రూపు, ఒక్క టెలివిజన్ మాత్రమే వారి అధీనంలోకి వెళ్ళింది, మిగిలిన దేశం, అధ్యక్ష భవనం అన్నీ సురక్షితంగా ఉన్నాయి'' అని చెప్పారు.

## వలస బోటు బోల్తా : 18 మంది మృతి



**ఏథెన్స్:**గ్రీసు తీరంలో వలస ప్రజలతో వెళుతున్న బోటు మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 18 మంది మరణించినట్లు ప్రాథమిక సమాచారం. ఈ మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. రక్షించినవారిలో ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. మధ్యధరా సముద్రంలో క్రీట్ ద్వీపం వద్ద ఈ దుర్ఘటన జరిగిందని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. తీర ప్రాంత గస్తీ దళాలకు చెందిన నౌకలు జాడతెలియనివారికోసం తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ బోటు కిక్కిరిసిపోయి ప్రయాణం చేస్తున్నందువల్ల బరువువల్ల బోటు మునిగిపోయింది. యూరోపియన్ యూనియన్ బోర్డరు ఏజన్సీ కూడా హెలికాప్టర్లను రంగంలోకి దింపింది. 2023 జూన్‌లో దక్షిణ గ్రీస్‌లో ఒక చేపల పడవ మునిగిపోయిన ఘటనలో వందలమంది మరణించారు. ఆ తర్వాత ఇంతపెద్దస్థాయిలో వలసబోటు ప్రమాదం జరగడం ఈ ప్రాంతంలో మళ్ళీ ఇదే.

# ఎన్నికలవేళ బంగ్లాదేశ్ జర్నలిస్టుల్లో భయాందోళన

## లైంగిక దాడుల భయం : కొత్త నివేదిక వెల్లడి

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ప్రతిష్ఠాత్మకంగా సార్వత్రిక ఎన్నికలకు సన్నాహాలు, బహిరంగసభలు, రాజకీయపార్టీ ప్రచార కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ఆ దేశ జర్నలిస్టులలో భయాందోళన పెరుగుతోంది. 13వ జాతీయ పార్లమెంటుకు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వార్తల కవరేజ్‌లో అన్ని విధాలుగానూ తమపై దాడులు పెరుగుతాయని 89 శాతం జర్నలిస్టులు ఆందోళన చెందుతున్నారని ఒక అధ్యయన నివేదిక వెల్లడించింది. 90 శాతం వేధింపులు, హింస, బెదిరింపులు రాజకీయ వర్గాల నుండే వస్తాయని అధ్యయనంలో జర్నలిస్టులు తెలియజేశారు. చట్టపరమైన భద్రతా సంస్థలనుండి, మతఛాంధసవాద శక్తుల నుండి కూడా ఈ బెదిరింపులు వస్తాయని జర్నలిస్టులు తెలియజేశారు.''ఎక్కువ అపాయం,తక్కువ సన్నద్ధతఃబంగ్లాదేశ్–2026ఎన్నికల్లో జర్నలిస్టుల భద్రత''అనేఅంశంపై ఈఅధ్యయనం చేశారు. ''సాంకేతిక యుగంలో జర్నలిస్టుల భద్రత,సాంకేతికపరమైన భద్రత'' అనే పేరుగల సంస్థ స్వీడన్ ఫోజో మీడియా సంస్థ,స్వీడిష్ ఇంటర్నేషనల్ డవలప్‌మెంట్ కో–అపరేషన్ ఏజన్సీల సంయుక్త సహకారంతో ఈ అధ్యయనం చేసి శనివారం నివేదిక విడుదల చేసింది. ''డైలీ స్టార్'' పత్రిక కార్యాలయంలో ఈ నివేదికను విడుదల చేసిన సందర్భంగా జరిగిన సభలో పలువురు సంపాదకులు, సీనియర్ మేనేజర్లు ప్రసంగించారు. ''డిజిటల్లీ రైట్'' సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మిరాజ్ అహ్మద్ చౌధురి ఈ సందర్భంగా మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లోని 19 జిల్లాలలో 201మంది సీనియర్ జర్నలిస్టులను చాలా లోతుగా ఇంటర్వ్యూ చేసినప్పుడు ఈ విషయాలు వెల్లడయ్యాయన్నారు.దేశ రాజకీయాలలో చాలా తీవ్రమైన విభజన ఏర్పడిందని,ఈ పరిస్థితుల్లో జర్నలిస్టులపై భౌతికదాడులకు అ తీతంగా అనేక రకాలుగా దాడులు జరుగుతాయన్న భయాందోళన వ్యక్తం చేసినట్లు చౌధురి చెప్పారు. తీవ్రమైన,పరుషమైనపదజాలంతో తిట్లు ఎదుర్కొనే ప్ర మాదం ఉందని 76శాతం జర్నలిస్టులు అధ్యయనంలో పేర్కొన్నా రు. 71 శాతం జర్నలిస్టులు తమను భయపెట్టి బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ఐతే ఈ అధ్యయనంలో ప్రత్యేకాంశం ఏమిటంటే యాభైశాతం మహిళా జర్నలిస్టులు తమను లైంగికంగా బెదిరించి భ యపెట్టే ప్రమాదం ఉందని చెప్పగా, 40 శాతం మహిళా జర్నలిస్టులు తమపై లైంగిక దాడులు జరిగే ప్రమాదం ఉండవచ్చునని ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ వేధింపులపై ఈ అధ్యయనం ముందస్తు హెచ్చరిక చేసింది. త మను తమ న్యూస్ రూమ్‌లను లక్ష్యంగా చేసుకుని డిజిటల్ మార్గాలలో దుష్ప్రచారం చేసే అవకాశాలు ఉన్నాయిని 75శాతంజర్నలిస్టులు అభిప్రాయంవ్యక్తం చేయగా, తమ వార్తలను హ్యాకింగ్ చేసే ప్రమాదం ఉందని 65 శాతంజర్నలిస్టులుఅధ్యయనబృందాలకు తెలియజేశారు.

**అనర్హులు జర్నలిస్టులుగా తిరుగుతున్నారు**

అనేకమంది అనర్హులు జర్నలిస్టులమని చెప్పుకుంటూ తిరుగుతున్నారని, పత్రికలు నడుపుతున్నారని ''ఢాకా ట్రిబ్యునల్'' సంపాదకుడు రియాజ్ అహ్మద్ విమర్శించారు. జర్నలిస్టులకు బెదిరింపులపై అధ్యయన నివేదికను విడుదల సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, జర్నలిజం తెలియనివారు, అనర్హులు టివి స్టేషన్లు నడుపుతున్నారని, పత్రికలు పెట్టి వార్తలు ప్రచురిస్తూ జర్నలిస్టులుగాచలామణీఅవుతున్నారనివిమర్శించారు.చాలామంది మీడియా యజమానులు జర్నలిస్టుల భద్రత గురించి ఎక్కడా ఆరా తీయడంలేదనీ, సమస్యను పట్టించుకోవడం లేదని, అధ్యయనం చేయడం లేదని విమర్శించారు. జర్నలిస్టులు తమను తాము సంస్కరించుకోవాలని, ఇందుకోసం ఒక స్వీయ విప్లవం సాధించాలని సూచించారు.

## జమాతే ఇస్లామీ సంఘ వ్యతిరేక శక్తి : విజయన్

**కోఝికోడ్:** జమాతే ఇస్లామీ (జమాత్–ఎ–ఇస్లామీ) సంస్థపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ సంస్థకు చెందిన యువజన విభాగం ''సాలిడారిటీ యూత్ మూమెంట్'ను అతిపెద్ద సంఘ వ్యతిరేకశక్తిగా పేర్కొన్నారు. ఒకప్పుడు సిపిఐ(ఎం) కార్యాలయంలో జమాతే ఇస్లామీ సంస్థ నాయకులు తనను కలిసిన మాట నిజమేనని నిర్ధారిస్తూ, వారు సంఘ వ్యతిరేక శక్తులని వారి మొఖంమీదే నిక్కచ్చిగా తెలియజేశానని చెప్పారు. కోఝికోడ్‌లో పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. ఎల్‌డిఎఫ్–సిపిఐ(ఎం) కలిసి సమావేశాలు నిర్వహించాయని, ఈ ఎన్నికల్లో వారికి జమాతే ఇస్లామీ మద్దతు ఇస్తోందని యుడిఎఫ్ విమర్శించడంతో దీనిపై విజయన్ వివరణ ఇచ్చారు. జమాతే సంస్థ నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు గతంలో తాను సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో కలిసిన మాట నిజమేనని ముఖ్యమంత్రి నిర్ధారించారు. ఐతే వారికి ప్రవర్తనను తాను సమర్థించలేదని, వారి ప్రవర్తన మంచిదని వారికి ఎలాంటి యోగ్యతాపత్రం ఇవ్వలేదన్నారు. ''వారు నన్ను కలుసుకునే అవకాశం ఇవ్వమని అడిగారు, అందువల్ల వారు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. కానీ నేను వారి ప్రవర్తనను సమర్థించలేదు, తనతో జరిపిన సమావేశంలో ఆ నాయకులు తమ వైఖరిని వివరించేందుకు, నచ్చజెప్పేందుకు ప్రయత్నం చేశారు, ఈ సమావేశంలో సాలిడారిటీ యూత్ మూమెంట్ నాయకులు కూడా హాజరయ్యారు. ఆ నాయకులను వారు నాకు పరిచయం చేసినప్పుడు నేను వారి ముఖం మీదే ఖచ్చితంగా చెప్పాను,'వారుఇప్పుడుఅతిపెద్దసంఘ వ్యతిరేకశక్తులు' అని చెప్పాను, అందుకు ఆ నాయకులు నివ్వెరపోయారు'' అని విజయన్ వివరణ ఇచ్చారు. జమాతే ఇస్లామీని ముఖ్యమంత్రి ఎప్పుడూ ఒక మతోన్మాద గ్రూపుగా విమర్శిస్తారు.

## మహాసంకల్పం అవసరం

(మొదటి పేజీ తరువాయి)

ధైర్యం ఉండాలి...గొప్ప కార్యాలు చేయాలంటే....మహా సంకల్పం కావాలి... సరిగ్గా రెండేళ్ల క్రితం నాకు ఆ ధైర్యం ఇచ్చి...తమ ఓటుతో గెలుపు సంకల్పాన్ని ఇచ్చి...నిండు మనస్సుతో ఆశీర్వదించిన తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలకు' సిఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక ధన్య వాదాలు తెలిపారు. ఆదివారం సిఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటనలో రెండేళ్ల ప్రజా పాలన విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థిక మద్దతు ఇచ్చి అదానీ, అంబానీల తరహా వ్యాపార రంగంలో నిలిపామని, బలహీనవర్గాల వందేళ్ల ఆకాంక్షలను కుల లెక్కలతో కొత్త మలుపులు తిప్పామని,వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమానికి నిజమైన సార్థకత చేశామని వివరించారు. విద్య ఒక్కటే బతుకు దెరువుకు బ్రహ్మాస్త్రమని, అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణ యజ్ఞానికి పునాదులు వేశామని,స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టామని సిఎం వివరించారు. 'జయ జయహే తెలంగాణ' అన్న ప్రజాకవి అందెశ్రీ గేయానికి, జన ఆకాంక్షల మేరకు అధికారిక గుర్తింపు నిచ్చామన్నారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం, రూ.500లకే గ్యాస్, సన్న ధాన్యానికి రూ.500 బోనస్, కోటి మంది ఆడ బిడ్డలను కోటీ శ్వరులను చేసే గొప్ప పథకాలన్నీ తమ రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాలు అని సిఎం అన్నారు.

నేటి అవసరాలను తీర్చి, పేదల సంక్షేమాన్ని కూర్చి ,ఇదే అద్భుతమని, తాము సరిపెట్ట లేదని, స్వతంత్ర్య భారత ప్రయాణం వందేళ్ల మైలురాయికి చేరే సందర్భం 2047 నాటికి తెలంగాణ లా ఉండాలి?, ఎక్కడ ఉండాలో లోతైన మథనంతో మార్గదర్శక పత్రం సిద్ధం చేశామన్నారు.

**భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క**

భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్కలాంటిదని సిఎం అభివర్ణించారు. 'నిన్నటి వరకు ఒక లెక్క, రేపటి తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క' అని అన్నారు. ఇందుకు ప్రజల ఆశీర్వాదమే తన ఆయుధమని,ప్రజల ప్రేమాభిమానాలే తనకు సర్వం అని, ప్రజల సహకారమే తనకు సమస్తమని, తెలంగాణ తనకు తోడుగా ఉన్నంత వరకు, తన గొంతులో ఊపిరి ఉన్నంత వరకు తెలంగాణ రైజింగ్‌కు తిరుగు లేదని సిఎం స్పష్టం చేశారు. గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు తాము ప్రాణం పోశామని, ప్రపంచ వేదిక పై తెలంగాణ రైజింగ్ రీ సౌండ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, భారత దేశ గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణను మార్చేందుకు సర్వం సిద్ధం చేశామని సిఎం అన్నారు.

## రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

రాణిస్తున్నారని కొనియాడారు. నిఖిలేశ్వర్ రచనల ఆవిష్కరణ కార్యక్రమం అంబర్‌పేట్‌లోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ బి.సుదర్శనరెడ్డి 'నిఖిలేశ్వర్ రచించిన 'ఎక్కడికీ గమనం? ఎంత దూరమీ గమ్యం?, ఎవరిదీ ప్రజాస్వామ్యం? ఏ విలువలకీ ప్రస్థానం?, గోడల వెనక(జైలు జ్ఞాపకాలు)' అనే మూడు రచనలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నిఖిలేశ్వర్ తన రచనల్లో స్ఫూర్తిదాయకమైన సాహిత్య సృజన కొనసాగిస్తూ ఉండటం చాలా అభినందనీయమని, ముఖ్యంగా తాను ఏర్పరుచుకున్న ప్రజానుకూల సాహితీ సాంస్కృతికోద్యమ లక్ష్యాలకు అనుగుణంగా సుదీర్ఘకాలం ఆ కలం కవితాయానం కొనసాగిస్తున్నదని, కవిగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానం సంపాదించుకున్నారని ప్రశంసించారు. 25 సంవత్సరాల క్రితం తాను హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో ఎవరిదీ ప్రజాస్వామ్యం? ఏ విలువలకీ ప్రస్థానం? అనే పుస్తకాన్ని ఆవిష్కరించానని గుర్తు చేశా రు. ప్రస్తుత రాజకీయాలను ఉద్దేశించి నేటి కాలంలో 'పిఎం నుంచి సర్పంచ్ వరకు అందరూ చేస్తున్నది వ్యాపారమే' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు చేసి దేశాన్ని ఆక్రమించిన బ్రిటిషర్లను తరిమికొట్టి, స్వాతం త్ర్యం సాధించుకున్న నేటి భారతదేశంలో మళ్లీ వారికి రెడ్ కార్పెట్ పరిచి పెట్టుబడులను ఆహ్వానించడంతో పాటు వారికి సకల సౌకర్యాలు కల్పించడం దారుణమన్నారు. భవిష్యత్తులో కార్మికులను బానిసలుగా చేసి, వారి చట్టాలను అమలు చేస్తే ప్రశ్నించేవారు ఎవరు?, వారిని ఎదురించే దమ్ము ఈ ప్రభుత్వాలకు ఉంటుందా? అని ప్రశ్నించారు. నిస్సిగ్గుగా ప్రభుత్వం ఎంతో కొంత జరిమానాలు విధించి చేతులు దులుపుకోవడం తప్ప చేసేదేమి లేదన్నారు.'ప్రశ్నించే గొంతుకలపై తుపాకి పెట్టి, పలానా తేదీ లోపు వారిని అంతమొందిస్తామని చెప్పడం సిగ్గుచేటు, ఎన్‌కౌంటర్ అన్నది కాలం చెల్లిన మాట, 'మీకు రాజ్యం ఇచ్చింది మేము కాదా? మనుషులను మనుషుల్లాగా చూడని నాయకులు ఎనాడైనా గద్దె దిగాల్సిందే' అని హెచ్చరించారు.

నక్సలిజం విలువలతో ఉన్న కూడా చంపేస్తామని అనడం ప్రజాస్వామ్యమా? 1930 నుంచి చూస్తునే ఉన్నాం, తమ దాకా రాలేదని అనుకోకుండా ప్రతి విషయంపై స్పందించినప్పుడే మార్పు వస్తుందన్నారు. విద్య అనేది ఒక విలువైన ఆయుధం, ప్రఖ్యాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే 1600 మంది ఉపాధ్యాయులకి కేవలం 300 మంది మాత్రమే ఉన్నారంటే ప్రభుత్వాల పని తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డా.జతిన్ కుమార్, డి.చంద్రశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ కల్పనా కన్నబిరాన్, ప్రొఫెసర్ కట్టా ముత్యం రెడ్డి, నందిని సిధారెడ్డి, తెలకపల్లి రవి తదితరులు హాజరయ్యారు.

## సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఆహుతులకు వివరిస్తారు. రెండు రోజుల్లో మొత్తం 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి. ఇందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. వచ్చిన అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామాగ్రిని సిద్ధం చేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీతో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు జరిగాయి. లైటింగ్ ప్రొజెక్షన్, త్రిడి ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్‌లో ఎల్ఇడి స్క్రీన్స్‌తో ఈ విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిధులను అలరించనుంది. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సదస్సు జరిగే రెండు రోజు ల పాటు హాజరైన అందరికీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటలతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి. ఇక అతిధులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపో



యేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని ప్రభుత్వం తరపున అందించనున్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగోతో పాటు, పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈసావనీర్‌లోపొందుపరుస్తారు.అలాగే తెలంగాణకే ప్రత్యేకమైన వంటలైన ఇప్ప పువ్వు లడ్డు,సకినాలు,చెక్కలు,బాదంకీజాలి, నువ్వుల ఉండలు, మక్క పేలాలతో కూడిన మరో ప్రత్యేకబాస్కెట్‌నుఅతిధులకుఅందించనున్నారు

**నిఘా నీడలో భారత్ ఫ్యూచర్ సిటీ 6000 మందితో భారీ బందోబస్తు**

గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ మొత్తం నిఘా నీడలో ఉంది. ఈ ప్రాంతం చుట్టూ వందలాది సిసిటీవిలను ఏర్పాటు చేశారు. గ్లోబల్ సమ్మిట్‌కు ఎలాంటి అవాంతరాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు డిజిపి బి.శివధర్‌రెడ్డి వెల్లడించారు. సుమారు 6000 మంది పోలీసులు ఈ బందోబస్తులో పాల్గొంటున్నార న్నారు. ఇప్పటికే భారత్ ఫ్యూచర్ సిటీలోని నాలుగు వేదికలతో పాటు మిగతా ప్రదేశాలను బాంబ్ స్క్వాడ్ బృందాలు జల్లెడ పట్టాయి. బందోబస్తు కోసం డిజిపి కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సమ్మిట్ ప్రాంతానికి వచ్చిపోయే మార్గాలపై ముందు జాగ్రత్త చర్యగా ఆంక్షలు విధించారు. సమ్మిట్‌కు 20 కిలోమీటర్ల పరిధిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



## నైట్‌క్లబ్

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా వినియోగదారులు బయటకు రాలేకపోయారని, వారిలో కొందరు గ్రౌండ్ ఫ్లోర్‌కు పరిగెత్తుకుంటూ వెళ్లి అక్కడ చిక్కుకుపోయిట్లు ప్రాథమిక దర్యాప్తు తేలినట్లు సిఎం సావంత్ తెలిపారు. క్లబ్ యాజమాన్యంపై, భద్రతా నిబంధనలను ఉల్లంఘించినప్పటికీ దానిని నిర్వహించడానికి అనుమతించిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నైట్‌క్లబ్ యజమాని, జనరల్ మేనేజర్‌పై ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేశామని, వారిని అరెస్టు చేస్తామని ఆయన చెప్పారు. కోస్తా తీరప్రాంత రాష్ట్రంలో పర్యాటకుల సీజన్ ఎక్కువగా ఉన్న సమయంలో ఈ ఘటన జరగడం దురదృష్టకరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వివరణాత్మక మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించామని, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిలిండర్ పేలుడు కారణంగా మంటలు సంభవించాయని రాష్ట్ర పోలీసులు మొదట చెప్పినప్పటికీ, పర్యాటకులు డ్యాన్స్ చేస్తున్న క్లబ్ మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయని కొందరు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. మంటలు చెలరేగినప్పుడు కనీసం 100 మంది డ్యాన్స్ ఫ్లోర్‌లో ఉన్నారని, తప్పించుకునే ప్రయత్నంలో వారిలో కొందరు సిబ్బందితో పాటు వంటగదిలోకి పరిగెత్తగా, అక్కడ వారు చిక్కుకుపోయారని హైదరాబాద్‌కు చెందిన పర్యాటకురాలు ఫాతిమా షేక్ పిటిఐకి తెలిపారు. 'మంటలు చెలరేగడంతో అకస్మాత్తుగా గందరగోళం నెలకొంది. క్లబ్ నుండి బయటకు పరిగెత్తేసరికి మొత్తం నిర్మాణం మంటల్లో చిక్కుకున్నట్లు కనిపించిందని ఆమె చెప్పారు. వారాంతపు సెలవు కావడంతో నైట్‌క్లబ్ నిండిపోయిందన్నారు. మంటలు చెలరేగిన కొద్దిసేపటికే క్లబ్ మొత్తం మంటల్లో చిక్కుకుందని, క్బల్ నిర్మాణమంతా తాటి ఆకులతో నిర్మించినందున వెంటనే మంటలు విస్తరించాయని షేక్ అన్నారు. ఈ నైట్‌క్లబ్ అర్పోరా నది వెనుక భాగంలో ఇరుకైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాన్ని కలిగి ఉంది. ఇరుకైన లేన్‌ల కారణంగా క్లబ్‌కు అగ్నిమాపక దళాలకు ప్రవేశం, శకటాలను ఘటనా స్థలం నుండి 400 మీటర్ల దూరంలో నిలిపి ఉంచాల్సి వచ్చింది. అగ్నిమాపక, అత్యవసర సేవలకు చెందిన ఒక సీనియర్ అధికారి పిటిఐతో మాట్లాడుతూ ఇరుకైన మార్గం కారణంగా ఘటనా స్థలానికి చేరుకోవడం కష్టమైందని, దీనివల్ల మంటలను నియంత్రించడం ఒక సవాలుతో కూడిన పనిగా మారిందని అన్నారు. చాలా మంది మరణాలు ఊపిరాడక గ్రౌండ్ ఫ్లోర్‌లో చిక్కుకుపోవడం వల్ల సంభవించాయన్నారు. అర్పోరా–నాగోవా పంచాయతీ సర్పంచ్ రోషన్ రెడ్కర్ మాట్లాడుతూ ఈ క్లబ్‌ను సౌరవ్ లూత్రా నడుపుతున్నాడని, అతనికి తన భాగస్వామితో వివాదం ఉందని అన్నారు. వారి మధ్య వివాదం జరిగిందని, వారు పంచాయతీతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారని చెప్పారు. తాము ఆ స్థలాన్ని తనిఖీ చేసామని, వారికి క్లబ్ నిర్మించడానికి అనుమతి లేదని గుర్తించామన్నారు. దీంతో పంచాయతీ కూల్చివేత నోటీసు జారీ చేయగా, దానిని పంచాయతీల డైరెక్టరేట్ అధికారులు నిలిపివేసినట్లు రెడ్కర్ చెప్పారు. బాధితుల బంధువులు, స్నేహితులు గోవా మెడికల్ కాలేజ్, హాస్పిటల్ మార్చురీకి చేరుకుని తమ ప్రియమైనవారి గురించి సమాచారం కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. జార్ఖండ్‌లోని ఒక గ్రామానికి చెందిన వారిలో కొందరు మృతదేహాలను స్వాధీనం చేసుకోబోమని, నైట్‌క్లబ్ యజమాని తిగినట్లు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. వారి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నైట్‌క్లబ్‌లో సహాయకులు, వంటవారుగా పనిచేస్తున్నారని వారు తెలిపారు. అసోం నుండి ఐదుగురు వ్యక్తులతో కూడిన మరో బృందం కూడా మార్చురీ వెలుపల కూర్చుని కనిపించింది. వారు మీడియాతో మాట్లాడటానికి నిరాకరించగా, వారిలో ఒకరు అగ్నిప్రమాద బాధితుల్లో కొందరు తమ స్నేహితులని పేర్కొన్నారు. అందరి మృతదేహాలను గుర్తించి పోస్టుమార్టం నిర్వహించడానికి ఒక రోజు పడుతుందని, ఆ తర్వాతే మృతదేహాలను వారి బంధువులకు అప్పగిస్తామని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ సంఘటనలో ప్రాణాలు కోల్పోవడం పట్ల గోవా చర్చి విచారం వ్యక్తం చేసింది. సావంత్ ప్రభుత్వం పరిపాలనను నియంత్రించడంలో విఫలమైనందున అధికారంలో ఉండే 'నైతిక హక్కు'ను కోల్పోయిందని రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ యూనిట్ పేర్కొంది.

**యజమానులపై ఎఫ్ఐఆర్**

గోవాలోని బిర్చ్ నైట్ క్లబ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోవడంపై పోలీసులు తక్షణ చర్యలకు దిగారు. నైట్‌క్లబ్ యజమానులు సౌరభ్ లూత్రా, గౌరవ్ లూత్రాలపై భారతీయ న్యాయసంహిత లోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అర్పోరానాగోవా సర్పంచ్ రోషన్ రెడ్కర్‌ను నిర్బంధంలోకి తీసుకున్నారు.

క్లబ్ మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లపై కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. 2013లో ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేసిన రోషన్ రెడ్కార్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అపూర్వ గ్రామంలో నైట్‌క్లబ్ నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారని, ఇరుకైన ప్రవేశం మార్గం, తప్పించుకునే మార్గాలు లేకపోవడం, నిర్మాణంలో మండేస్వభావం కలిగిన సామగ్రిని వాడటం వంటివి ప్రమాద కారణాలుగా ప్రాథమిక విచారణలో వెల్లడికావడంతో పోలీసులు తాజా చర్యలకు దిగారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

‘ప్రజా విజయోత్సవాలు’ వేడుకల్లో కలెక్టరేట్ల ముందు

## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ‘ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు’ వేడుకల్లో భాగంగా మంగళవారం 10 గంటలకు అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణకు కావాల్సిన ఏర్పాట్లను చేయడంతోపాటు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు సంబంధించి ఫోటోలతో కూడిన నివేదికను అంజేయాలని ఆదేశించారు. అయితే ఈ ఉత్తర్వుల్లో ములుగు, నారాయణపేట, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర, నల్గొండ జిల్లాలను ఈ కార్యక్రమం నుంచి మినహాయించారు.

13న ఉప్పల్ స్టేడియంలో

## లియోనల్ మెస్సి ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్

ఏర్పాట్లను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఈనెల 13న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీంతో జరగనున్న లియోనల్ మెస్సి ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు దేశం నలుమూలల నుంచి అభిమానులు రాబోతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనల్ మెస్సికి ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ ఉన్న మ్యాచ్‌కు భారీ అభిమానులు తరలిరానుండడంతో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 13న మ్యాచ్ నేపథ్యంలో ఆదివారం ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉప్పల్ స్టేడియాన్ని పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సిఎం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారని తెలిపారు. లియోనల్ మెస్సికి ప్రత్యేక భద్రత వ్యవస్థ ఉంటుందని, ఫ్రెండ్లీ మ్యాచ్ నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు లియోనల్ మెస్సి సైతం ఆసక్తి చూపారని డిప్యూటీ సీఎం తెలిపారు. దేశం నలుమూలల నుంచి వేలాది మంది ఫుట్‌బాల్ క్రీడాభిమానులు మ్యాచ్‌కు తరలిస్తున్న నేపథ్యంలో భద్రత, సౌకర్యం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని నిర్దేశించిన సమయం కంటే ముందే అభిమానులు స్టేడియంలోకి చేరుకొని వారి వారి సీట్లలో కూర్చోవాలని డిప్యూటీ సిఎంకోరారు..ఫ్రెండ్లీ మ్యాచ్ సందర్భంగా ఫుట్‌బాల్ క్రీడా అభిమానులకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లను రాచకొండ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్లు ప్రత్యేకంగా దృష్టి పెట్టి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పోలీస్, హెచ్‌సిఎ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. మెస్సి ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం వచ్చి, వెళ్లే మార్గాలు, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర విఐపి లు వచ్చి వెళ్లే మార్గాలను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పరిశీలించారు. మొత్తంగా హాజరవుతున్న అభిమానుల సంఖ్య, సులభంగా వచ్చి వెళ్ళేందుకు ఏర్పాటుచేసిన గేట్ల సంఖ్య, పార్కింగ్ ఫుట్‌బాల్‌క్రీడా అభిమానుల కోసం మెట్రో,ఆర్‌టిసితో పాటు రవాణా సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తున్న రవాణా సౌకర్యాలను డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిజి విజయ్ కుమార్, రాచకొండ సి పి సుధీర్ బాబు, రోహన్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు

## అంతర్జాతీయ కంపెనీల పేర్ల నామకరణం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ‘‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్’ నేపథ్యంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన హైదరాబాద్‌లోని పలు రహదారులకు అంతర్జాతీయ కంపెనీల పేర్లను నామకరణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన పలు రహదారులకు పేర్లను మారుస్తూ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. హైదరాబాద్‌కు మరింతగా గ్లోబల్ మ్యాప్‌లో చోటు కల్పించేందుకు వీలుగా హైదరాబాద్‌లోని ప్రధాన రహదారులకు ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు, కంపెనీల పేర్లను పెట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) వద్ద రావిర్యాలను నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేసే వంద మీటర్ల గ్రీన్‌ఫీల్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టాలని ప్రతిపాదనలను సిద్ధం చేసింది. రావిర్యాల ఇంటర్‌చేంజ్‌కు ఇప్పటికే టాటా ఇంటర్‌చేంజ్ అని పేరు పెట్టారు. ప్రపంచంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో ‘డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ’ అని నామకరణం చేయాలన్న ప్రతిపాదించింది. దీనికి సంబంధించి కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయనుంది.

ఢిల్లీలో ఇటీవల జరిగిన యూఎస్‌ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరమ్ (యుఎస్ఐఎస్‌పిఎఫ్) వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన మేరకు హైదరాబాద్‌లోని ముఖ్య రహదారులకు ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల పేర్లు పెట్టాలన్న దృష్టిలో భాగంగా మరిన్ని ప్రతిపాదనలు చేశారు. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సేవలను గుర్తిస్తూ ఒక ముఖ్య రహదారిని గూగుల్ స్ట్రీట్ అని ప్రకటించేందుకుప్రణాళికను రూపొందించారు. మైక్రో సాఫ్ట్ రోడ్, విప్రో జంక్షన్ పేర్లను కూడా పరిశీలిస్తున్నారు.ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితవ్యక్తులు, ప్రముఖ కంపెనీల పేర్లను రహదారులకు నామకరణం చేయడం ద్వారా వారికి సముచిత గౌరవం ఇవ్వడంతో పాటు, హైదరాబాద్ కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని సిఎం భావిస్తున్నారు. అలాగే ఆ రోడ్లపై ప్రయాణించివారికి కూడా స్ఫూర్తివంతంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ప్రతిపాదన సిద్ధం చేశారు.










## తెలంగాణ దిశా దశను మార్చనున్న గ్లోబల్ సమ్మిట్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ తో తెలంగాణ రాష్ట్రం దిశ దిశ మారుతుందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీర్ ఖాన్‌పేట్‌లో జరుగుతున్న సమ్మిట్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఈ ప్రపంచ స్థాయి సమ్మేళనంతో ప్రపంచ నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ చేరుతుందని అన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వం రెండేళ్ల పాలన, 2047 లక్ష్యంగా సాగుతున్న ప్రణాళికలు తదితరాలకు ఊతమిచ్చే విధంగా పెట్టుబడులు రానున్నాయని అన్నారు ఇప్పటికే దేశ విదేశాలకు చెందిన 150 మంది అత్యంత ప్రముఖులు ఈ సమ్మిట్ లో పాల్గొనబోతున్నారని చెప్పారు రెండు రోజుల పాటు జరిగే ఈ సమ్మేళనం కోసం విశేష రీతిలో ఏర్పాట్లు జరిగాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

మీడియా సెంటర్ ఏర్పాటును సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్ ప్రియాంక పరిశీలించారు.

ఎన్నికల్లో ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టినా ...

## బిఆర్ఎస్ నాయకులకు బుద్ధి రావడం లేదు

మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి ఎన్నికలో ప్రజలు కర్ర కాల్చి వాత పెడుతున్నా బిఆర్ఎస్ నాయకులకు బుద్ధి రావడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను ఓడించండి అంటూ ప్రకటనలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. నాడు వరి వేస్తే ఉరి అన్న బిఆర్ఎస్ నేతలు ఈ రోజు బోనస్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వారి హాయంలో లక్ష ఋణమాఫీ చేయడానికే ఆపసోపాలు పడి వాయిదాల పద్ధతిలో ఒకసారి, ఆఖరి సంవత్సరంలో సగం మందికి కూడా చేయలేక చేతులేత్తేసిన వారు మొదటి సంవత్సరంలోనే ఒకే విడతలో రూ.2లక్షల రుణాన్ని మాఫీ చేసిన మాకా రైతుల సంక్షేమం గురించి చెప్పేది అన్నారు . గత రెండేళ్లలో రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష కోట్లకుపైగా నిధులను చేసిందని, కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని రైతులకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాదే అన్నారు. పంట పెట్టుబడి సహాయం కింద ఏడాదికి ఎకరాకు రూ.12వేలు అందించి రైతులకు భరోసా కల్పించడమే కాకుండ దేశంలో ఎక్కడలేని విధంగా ప్రధాన పంటలన్నిటిని ఎలాంటి సీలింగ్‌లు లేకుండా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న మన్నారు. అంతే కాకుండా సన్న వడ్లకు రూ.500 రూపాయల బోనస్‌ను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. పత్తి కొనుగోళ్లలో రాష్ట్రం పాత్ర ఎంతమాత్రం ఉండదనే విషయం తెలిసి కూడా, కొనుగోళ్లలో ప్రభుత్వంపై బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు కళ్లు మూస్కొని గుడ్డి లెక్కలేసిన చందంగా ఉందన్నారు.ఎఫ్‌సిఐ వరి కొనడం లేదని, దీంతో వరి సాగు వద్దని చెప్పినది కూడా బిఆర్ఎస్ కాదా, ఆవిషయాన్ని ఇప్పుడు మర్చిపోయారా అని ప్రశ్నించారు. మా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతుల సంక్షేమం కోసం ఆలోచిస్తూ, అందుకు అనుగుణంగా అటు కేంద్రంతో, ఇటు అధికారులతో సమన్వయం చేసుకుంటు పనిచేస్తున్నామని తెలిపారు. గత రెండేళ్ల లో తమ ప్రభుత్వం అందిస్తున్న మద్ధతు తో రైతులు ఆయిల్ పామ్ సాగులో దేశానికే ఆదర్శంగా నిలిచారు. వరి ఉత్పత్తిలో దేశములోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టారని తెలిపారు. ఇదే తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా ఇవ్వాలి : ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా కల్పించాలని బిసి జెఎసి ఛైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆకాశంలో సగభాగమైనా మహిళలకు రాజకీయంతోపాటు విద్య, ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి మహిళా సంఘాల కోర్ కమిటీ సమావేశంజరిగింది. ఈ సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. మహిళా వ్యక్తిత్వ వికాసానికి విద్య ప్రధానమన్నారు. కనుక, మరో బిసి అమ్మాయిలకు మరో 100 కాలేజీలు, గురుకులాలు స్థాపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలుగా గంగాపురం పద్మను నియమించారు. బిసి సంక్షేమం సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి ర్యాగ అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు గవ్వల భరత్‌కుమార్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, మోదీ రాందేవ్, సి.రాజేందర్, మహిళా నేతలు అనురాధమ్మ, దివ్య యాదవ్, దీప, సిహెచ్.పద్మ, వసంతమ్మ, జ్యోతి, అపర్ణ పాల్గొన్నారు.

సోమవారం సమ్మిట్‌లో కార్యక్రమాలు ఇలా..

## మధ్యాహ్నం సెషన్లతో వేడుకలు ఆరంభం

3 గంటల నుంచి 4గంటల తొలి సాంకేతిక సెషన్లు. నాలుగు హాల్స్‌లో పరస్పరం భిన్నమైన అజెండాలు చర్చకు వస్తాయి.

**హాల్ 1 –** భవిష్యత్ ఎనర్జీ ట్రాన్సిషన్‌పై నిపుణుల చర్చ. పునరుత్పాదక శక్తి వనరులు, 2047 లక్ష్యాలు ప్రధాన అంశాలు ఉంటాయి.
**హాల్ 2 –** గ్రీన్ మొబిలిటి 2047 జీరో ఎమిషన్ వాహనాల భవిష్యత్‌పై విస్తృత విశ్లేషణ. పర్యావరణం–రవాణా రెండింటికీ లాభదాయకంగా ఎలా మార్చుకోవాలి అనే అంశంపైన చర్చ..
**హాల్ 3 –** సెమీకండక్టర్ల రంగంలో తెలంగాణ స్థానాన్ని ప్రపంచ స్థాయికి ఎలా చేర్చాలన్న దానిపై నిపుణుల ప్రసంగాలు.
**హాల్ 4 –** విద్యను ప్రపంచానికి అందించే కేంద్రంగా తెలంగాణను నిర్మించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చ.
**ఆ తర్వాత –15 నిమిషాల విరామం**
సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15గంటల వరకు వ్యూహాత్మక సెషన్ల వేగం
**హాల్ 1 –** విమానయాన–రక్షణ రంగాల్లో తెలంగాణ అడుగులు దేశ దృష్టిని ఆకర్షించేందుకు నిపుణుల చర్చ.
**హాల్ 2 –** టాలెంట్ గ్లోబల్ మొబిలిటీ, ఉద్యోగ అవకాశాలు, భారత నైపుణ్య శక్తి అంతర్జాతీయీకరణపై చర్చ.
**హాల్ 3 –** సర్వ జనులకు అందుబాటులో ఉన్న, సమానమైన హెల్త్ కేర్ పథకాలపై దృష్టి.
**హాల్ 4 –** కొరియా–ఆస్ట్రేలియా దేశాలతో ఇండస్ట్రీ–ఇన్నోవేషన్ భాగస్వామ్యాలపై ప్రత్యేక సమావేశం.
**ఆ తర్వాత 15 నిమిషాల విరామం**
సాయంత్రం 5:30 గంటల నుంచి 6:30 గంటల వరకు : ప్రపంచ భాగస్వామ్యాలపై చర్చలు
**హాల్ 1 –** ఆసియన్ టైగర్స్ దేశాలతో తెలంగాణ భాగస్వామ్య అవకాశాలపై చర్చ.
**హాల్ 2 –** గిగ్ వర్క్‌ఫోర్స్ ఎదుగుదల, ఉద్యోగాల మార్పు, భవిష్యత్ ఉపాధిపై విశ్లేషణ.
హాల్ 3 రేర్ స్ట్రాటజీ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాలను నిపుణులు వివరిస్తారు.
**హాల్ 4 –** కెనడాతో టెక్–ఇన్నోవేషన్ భాగస్వామ్యాలు, మహిళా వ్యాపార శక్తిని పెంపొందించే చర్చలు కేంద్రంగా నిలిచాయి.
అనంతరం అతిథులకు ప్రత్యేక ఆతిథ్య విందు, సాంస్కృతిక కార్యక్రమాలతో మొదటి రోజు సమ్మిట్ ముగుస్తుంది.
**9న (మంగళవారం ) రెండో రోజు ...**
ఉదయం 10గంటల నుంచి 11:30 గంటల వరకు భవిష్యత్ తెలంగాణపై సమగ్ర చర్చలకు వేదిక.
**హాల్ 1 –** జీనోమ్ వ్యాలీని ప్రపంచంలోనే అతిపెద్ద బయో–హబ్‌గా మార్చేందుకు వ్యూహాలపై చర్చ.
**హాల్ 2 –** భవిష్యత్ ఒలింపిక్స్ కోసం తెలంగాణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహంపై చర్చ.
**హాల్ 3 –** సాంస్కృతిక వారసత్వాన్ని ఆధునిక పర్యాటక రంగంతో ఎలా మిళితం చేయాలి అనేది ప్రధాన అంశం.
**హాల్ 4 –** మూడు రెట్ల ఆర్థిక వృద్ధికి పెట్టుబడి అవకాశాల విశ్లేషణ.
**15 నిమిషాల విరామం..**
ఉదయం 11:45 గంటల నుంచి 1:15 గంటల వరకు
**హాల్ 1 –** సర్వసామాన్యులకు అందుబాటులో ఉన్న గృహాలపై పెట్టుబడులు, ప్రణాళికలు.
**హాల్ 2 –** మూసీ నది పునరుద్ధరణపై బ్లూ–గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రణాళికలు.
**హాల్ 3 –** గ్రామీణ–పట్టణ రవాణా అనుసంధానంపైన సమగ్ర వ్యూహాలు.
**హాల్ 4 –** స్టాండ్ బై సేషన్
**మధ్యాహ్నం 1:15 గంటల నుంచి 2:15 గంటల వరకు భోజన సమయం ...**
**మధ్యాహ్నం 2:15 గంటల నుంచి 3:45గంటల వరకు**
**హాల్ 1 –** భారత్ ఫ్యూచర్ సిటీ ట్రిలియన్ డాలర్లపై చర్చ
**హాల్ 2 –** వ్యాపారం చేయడంలో సౌలభ్యం2పై చర్చ
**హాల్ 3 –** గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు
**హాల్ 4 –** ప్రజా వస్తువుల కోసం వినూత్నమైన పిపిపిలు
**అనంతరం 15 నిమిషాల పాటు విరామం**
**సాయంత్రం 4:గంటల నుంచి 5:30 గంటల వరకు రెండో రోజు కీలక సెషన్లు**
**హాల్ 1 –** ఎంటర్‌టైన్‌మెంట్, క్రియేటివ్ ఇండస్ట్రీల భవిష్యత్‌పై నిపుణుల విశ్లేషణ.
**హాల్ 2 –** ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించే విధానాలు.
హాల్ 3 పెట్టుబడులు, ఫైనాన్షియల్ హబ్ నిర్మాణం, హైఇంపాక్ట్ సెక్టర్లపై చర్చ.
**హాల్ 4 –** స్టార్టప్ పరిసరాల అభివృద్ధికి ప్రణాళికలు.
**సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు**
సాయంత్రం 6 గంటలకు – తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ
7:00 గంటలకు – డ్రోన్ షో.
7:30 నుండి – విందు సాంస్కృతిక ప్రదర్శనలు.

అన్ని గ్రామాలలో ‘విత్తన బిల్లు- 2025’

## విద్యుత్ సవరణబిల్లు దహనం చేయాలి



ఎస్‌కెఎం పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాఖ్య హక్కులను ఖూనీ చేసే విధంగా, ఆహార భద్రత విత్తన స్వావలంబనను దెబ్బతీసే ‘కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన విత్తనాల ముసాయిదా బిల్లు 2025’ ప్రతులను దేశ వ్యాప్తంగా సోమవారం అన్ని గ్రామాల్లో దహనం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం) రైతులకు పిలు పునిచ్చింది. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో విత్తన బిల్లు 2025ను, విద్యుత్ సవరణబిల్లు’ను దహనం చేయాలని ఎస్‌కెఎం నాయకులు పశ్యపద్మ, టి.సాగర్, విస్సాకిరణ్, ప్రభాకర్,మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, వి.మట్టయ్య, బి రాము, విజయ్ రైతులను కోరారు. భారత విత్తన రంగంపై బహుళ జాతి సంస్థల ఆధిపత్యాన్ని పెంచి, ఆహార భద్రత, విత్తన స్వావలంబన, రాష్ట్రాల సమాఖ్య హక్కులను బలహీనపరుస్తుందని, అందుకే విత్తన బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేటీ కరణకు వ్యతిరేకంగా రైతులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ బిల్లు అమలులోనికి వస్తే బేయర్, బిఎఎస్ఎఫ్, సిన్జంట అద్వాంత ఇండియా, కార్తెవా డిగ్రీ సైన్స్ ఇండియా, మైకో లాంటి కంపెనీలు దేశీయ విత్తన రంగాన్ని ఆధీనపరచుకుని, రైతు వ్యవసాయాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. విత్తనాల చట్టం 1966’ను రద్దు చేసి, కఠినమైన నాణ్యత నియంత్రణ, ప్రధాన తప్పులకు మాత్రమే శిక్షలతో విత్తన నియంత్రణ వ్యవస్థను ఆధునీకీకరించాలనుకుంటున్న ప్రస్తుత విత్తన ముసాయిదా బిల్లును వారు ఖండించారు. ముసాయిదా బిల్లు విత్తన సరఫరాపై నియంత్రణను ఎంఎన్‌సి,కార్పొరేట్ల చేతిలో కేంద్రీకరించే ప్రమాదం ఉందని, కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టం సాధించాలనుకున్న లక్ష్యాన్నే ఇది మరో మార్గంలో సాధిస్తుందన్నారు. పంటల నమూనాలను కార్పొరేట్ మార్కెట్ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే అవకాశం ఉన్నదని, మార్కెట్‌లో చవకగా, నాణ్యమైన విత్తనాలు సమయానికి లభిస్తాయనే హామీనిచ్చే నిబంధనలు కూడా ఇందులో పొందుపర్చలేదని, ఆహార ,రైతుల ఆర్థిక భద్రత, లాభదాయక వ్యవసాయానికి కీలకమైన అంశాన్ని ప్రభుత్వం దురదృష్టవశాత్తూ పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఈ బిల్లు అధికంగా కేంద్రీకృతమైన,కార్పొరేట్ ఆధారిత నియంత్రణ వ్యవస్థను తీసుకొస్తుందని, రైతుకేంద్రిత రక్షణలను బలహీనపరచి, జీవ వైవిధ్య పరిరక్షణ,రైతుల హక్కుల ప్రస్తుత చట్టపరమైన నిర్మాణాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉన్నదని తెలిపారు. పారంపర్య విత్తనాలు, ప్రభుత్వ సంస్థలు, సాంప్రదాయ విత్తన వ్యవస్థలు పక్కన పడే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

సెక్షన్ 17(8) ప్రకారం మెరిట్ ఆధారిత, పారదర్శక కేంద్ర అక్రెడిటేషన్ వ్యవస్థ ఏర్పడుతుందని, ఒకసారి కంపెనీకి కేంద్ర గుర్తింపు లభిస్తే, అది అన్ని రాష్ట్రాలలో ఆటోమేటిక్‌గా నమోదవుతుందన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చిన సందర్భాలు తప్ప రాష్ట్రాలు ఆ కంపెనీని తిరస్కరించలేవని వివరించారు. తద్వారా బహుళ రాష్ట్రాల్లో పనిచేసే ప్రైవేట్ కంపెనీలకు వేగవంతమైన మార్గం లభిస్తుందని, కానీ ప్రభుత్వ సంస్థలకు అలాంటి ప్రయోజనం లేదని, ఇది రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను బలహీనపరుస్తూ సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని అన్నారు.

సెక్షన్ 33(2) నమోదు కాని జాతులను ప్రయోగాల కోసం దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తుందని, సెక్షన్ 16(3) విదేశీ విత్తన నాణ్యత,గుణగణాల గుర్తింపు(విసియు) పరీక్షా కేంద్రాలను అంగీకరించి గుర్తిస్తుందని, తద్వారా విదేశీ కంపెనీలు తమ కొత్త విత్తనాలను భారతీయ పరీక్షా వ్యవస్థను తప్పించుకుని వేగంగా తీసుకురావచ్చని వివరించారు.

**అత్యవసర పరిస్థితుల్లోనే ధరల నియంత్రణ**

క్లాజ్ 22 ప్రకారం కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ధరలను నియంత్రించవచ్చని, అయితే అత్యవసర పరిస్థితి, అసాధారణ ధర పెరుగుదల, వంటి పదాలకు ఖచ్చితమైన నిర్వచనాలు లేవని, దీంతో ప్రైవేట్ కంపెనీల అధిక ధరలు నియంత్రణలోకి రాకపోవచ్చని ఎస్‌కెఎం నాయకులు పశ్యపద్మ, టి.సాగర్, విస్సాకిరణ్, ప్రభాకర్, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, వి.మట్టయ్య, బి రాము, విజయ్ తెలిపారు. ప్రతి విత్తన జాతి మాత్రమే కాకుండా క్లోన్లు, కట్టింగ్స్, ట్యూబర్లు, బల్బులు, టిష్యూకల్చర్ మొక్కలు, నర్సరీ మొక్కలు అన్నీ తప్పనిసరి రిజిస్ట్రేషన్ పరిధిలోకి తీసుకొస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యాన శాఖ వద్ద దీని కోసం అవసరమైన ప్రయోగశాలలు, ప్రమాణీకృత పరీక్షా విధానాలు, మౌలిక సదుపాయాలు లేవని, కానీ ప్రైవేట్ నర్సరీలు, పెద్ద కంపెనీలకు ఈ వనరులు కలిగి ఉండటంతో మార్కెట్‌ను ఆధిపత్యం చేసే అవకాశం ఉన్నదని, ఇదే సమయంలో, విదేశీ మొక్కల జాతులు అక్రమంగా దేశంలోకి రావడం పెరుగుతోందని, తద్వారా క్వారంటైన్ సమస్యలకు దారితీస్తుందని అన్నారు. జీవ వైవిధ్యం, మొక్కల రకాలు రైతుల రక్షణకు సంబంధించి, డిజిటల్ సీక్వెన్స్ సమాచారం పై అంతర్జాతీయ వేదికల్లో భారత్ జీవ వైవిధ్య వనరులపై న్యాయమైన లాభం కోసం కీలక చర్చలలో పాల్గొంటుందని, అలాంటి సమయంలో దేశీయ జన్యు వనరులపై హక్కులను బలహీనపరచే ఏ చట్టం కూడా భారతదేశ అంతర్జాతీయ చర్చా శక్తిని తగ్గిస్తుందని, అందుకే ప్రజా రంగ సంస్థల ద్వారా బలమైన, బాధ్యతాయుతమైన వనరుల పరిపాలన అవసరమని వివరించారు. సమాఖ్య హక్కులు,విత్తన స్వావలంబనను కాపాడేందుకు గ్రామాల్లో బిల్లు ప్రతులను దహనం చేయాలని పిలుపునిచ్చింది.

## ప్రమాదకరంగా టీక్యాతండ రోడ్డు

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండల పరిధిలోని టీక్యా తండ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉండడంతో ఆ రోడ్డు గుండా ప్రయాణించే ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీటికోతకు గురై నడిరోడ్డు వరకు పెద్దగుంట ఏర్పడి ప్రయాణికులకు అత్యంత ప్రమాదకరంగా మారింది. అయినప్పటికి అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ రోడ్డు అలానే ఉండిపోవడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఆందోళనలకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు



చొరవ తీసుకొని ప్రమాదకరంగా ఉన్న రోడ్డు గుంటను పూడిపించే ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## ఎన్నికల ఏర్పాట్లలో లోపాలు జరగొద్దు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల కేంద్రంలోని 17 గ్రామ పంచాయితీ పరిధిలో ఈనెల 11న జరిగే గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు మండల ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయితీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లు ఎక్కడ ఎటువంటి లోపాలు జరగకూడదని సూచించారు. ఆయన వెంట



మండల తహశీల్దార్ బి శ్రీకాంత్, ఎంపిడిఓ ఝాన్సీ, ఎంపిఓ గోపి, ఎస్ఐ సైదులు, ఇతర అధికారులు ఉన్నారు.


## విధిగా ఓటు హక్కు వినియోగం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల విధులకు కేటాయించబడిన ఉద్యోగులు ఈనెల 6 నుండి 9 వరకు సంబంధిత మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలలో హాజరై విధిగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ కోరారు. గ్రామ పంచాయితీ ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు గాను రాష్ట్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. అందువల్ల ఈనెల 11న మొదటి విడత ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు ముందస్తుగానే పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఆత్మకూర్(ఎస్), జాజిరెడ్డిగూడెం, నాగారం, నూతనకల్, మద్దిరాల, సూర్యాపేట, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు నియమించబడిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

## బడుగు వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాల:** తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన దిశలో అనేక సంక్షేమ పథకాలతో ముందుకెళ్తుందని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. ఆదివారం రోజున మండలంలోని గుండ్రాంపల్లి, సుంకెనపల్లి, పేరేపల్లి, వెలిమినేడు, తాళ్ళవెల్లంల, పిట్టంపల్లి, ఎలికట్టె తదితర గ్రామాలలో సర్పంచ్ ఎన్నికల ప్రచార సభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 11న జరుగనున్న సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. బడుగు, బలహీన ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండి అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సన్నబియ్యం పంపిణీ, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు లాంటి పథకాలు ప్రజల మన్ననలను పొందాయన్నారు. డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్‌నేత మాట్లాడుతూ బడుగు జీవుల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, వారి సమస్యల సాధన ఆ పార్టీకే సాధ్యమౌతుందని, కాంగ్రెస్ పార్టీని ఓటర్లు బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మినర్సింహ్మా, పిఏసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారేయొద్దు

### పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి- ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో పారిశుద్ధ్యానికి కార్మికులు, రైతులు, ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాగర్‌రోడ్డును, కూరగాయల మార్కెట్ పరిసరాలను సందర్శించి పారిశుద్ధ్య చర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్య కార్మికులతో, మార్కెట్ రైతులతో మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణానికి నిత్యం వేలాది మంది వచ్చి వెళ్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖంగా వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలన్నారు. పట్టణంలో మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ శానిటేషన్ చేయాలన్నారు. అదేవిధంగా మార్కెట్ పరిసరాల్లోని రహదారిపై ఆకుకూరలు విక్రయించే రైతులు, చిరువ్యాపారులు వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ దాటకుండా విక్రయాలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## గడ్డివాముల దగ్ధం...

### రూ.2లక్షల ఆస్తి నష్టం...



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని కూచిపూడి గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఆయన అంత్యక్రియలను ఆదివారం నిర్వహించేందుకు ఊరేగింపుగా వెళ్తూ వారి కుటుంబ సభ్యులు, బంధువులు టపాసులు పేల్చడంతో ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు లేచి గడ్డివాములపై పడడంతో అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో గ్రామ శివారులో ఉన్న మెట్టు శ్రీనివాస్, రామిశెట్టి మొగిలి, పసుపులేటి శ్రీనివాసరావు, శెట్టి గోవిందరావులకు చెందిన గడ్డివాములు ఒక్కసారిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2లక్షల విలువైన గడ్డి దగ్ధమైనట్లు బాధిత రైతులు చెప్పారు. మంటలను ఆర్పేందుకు గ్రామస్తులు నీళ్ళు, మట్టి పోసే ప్రయత్నం చేసినా మంటలు అదుపులోకి రాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటల వ్యాప్తిని చల్లార్చారు. అప్పటికే గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి.

## నేడు జరిగే ప్రజావాణి రద్దు


**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామ పంచాయితీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులో ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. డిసెంబర్ 17 వరకు గ్రామ పంచాయితీ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని అప్పటి వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని ప్రకటించారు. అందువలన జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులు సమర్పించేందుకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# కనిపించని 'జోష్'!

### ఖర్చుకు వెనకడుగు...

### గత ఎన్నికల్లో పోటీచేసిన వారి పరిస్థితుల దృష్ట్యా..

### ఆచితూచి అడుగేస్తున్న అభ్యర్థులు




**ప్రజాపక్షం/సూర్యాపేట :** స్థానిక సంస్థల ఎన్నికల్లో జోష్ ఏ మాత్రం కనిపించడంలేదు. ఎన్నికల్లో డబ్బు ఖర్చుపెట్టేందుకు అభ్యర్థులు వెనకడుగు వేస్తున్నారు. గత ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన వారే కాకుండా... గెలిచిన వారు కూడా అప్పుల పాలవ్వడం... పలువురు ఆత్మహత్యలు చేసుకోవడం లాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా చోటుచేసుకోవడంతో గత సంఘటనల దృష్ట్యా డబ్బును ఖర్చు చేసేందుకు ఆచూతూచి అడుగులు వేస్తున్నారు.

సూర్యాపేట జిల్లాలో మొత్తం 486 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్‌ల ప్రకారం ఎస్‌సిలకు 91, ఎస్‌టిలకు 111, బిసిలకు 68, జనరల్ కేటగిరికి 216 స్థానాలు కేటాయించింది. వీటిలోనే మహిళలకు 202 స్థానాలను రిజర్వేషన్ కల్పిస్తూ ఖరారు చేయగా రాష్ట్ర ఎన్నికల కమీషన్ మూడు విడుతలుగా ఈనెల 11 (తొలి విడుత), 14 (రెండవ విడుత), 17 (మూడవ విడుత) ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే జిల్లాలో మూడు విడుతలుగా జరిగే ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ పూర్తి అయ్యింది. మొదటి విడతలో ఆత్మకూర్(ఎస్), జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నాగారం, నూతనకల్, తిరుమలగిరి, తుంగతుర్తి, సూర్యాపేట మండలాల్లో 159 గ్రామ పంచాయితీలకు 1442 వార్డులకు ఎన్నికలు జరగనుండగా ఇప్పటికే స్క్రూటిని, విత్‌డ్రాలు పూర్తి కాగా సర్పంచ్ బరిలో 473 మంది, వార్డుల్లో 2911 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రెండవ విడతలో అనంతగిరి, చిలూకురు, చివ్వెంల, కోదాడ, మోతె, మునగాల, నడిగూడెం, పెన్‌పహాడ్, మండలాల పరిధిలో 181 గ్రామ పంచాయితీలకు 1628 వార్డులకు ఎన్నికలు జరగనుండగా నామినేషన్ల ప్రక్రియ పూర్తియి స్క్రూటిని, విత్‌డ్రాలు పూర్తి కావడంతో సర్పంచ్ బరిలో 1447 మంది, వార్డుల్లో 4378 మంది బరిలో ఉన్నారు. మూడవ విడత చింతలపాలెం, గరిడేపల్లి, హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్ళచెర్వు, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లోని 146 గ్రామ పంచాయితీలకు 1318 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ గ్రామ పంచాయితీలలో నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటి వరకు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సర్పంచ్ బరిలో 1052 మంది, వార్డులకు 3493 మంది నామినేషన్లు దాఖలు చేశారు. స్క్రూటిని, విత్‌డ్రాలు పూర్తికాకపోవడంతో ఎన్నికల బరిలో ఎంత మంది నిలుస్తారన్నది తెలియాల్సి ఉంది. ఇందులో 10కి పైగా గ్రామ పంచాయితీలు ఏకగ్రీవమైనట్లు తెలిసింది. ఈ వివరాలను అధికారులు నేటికి అధికారికంగా ప్రకటించలేదు. మూడు విడతల్లో జరిగే ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ పూర్తైన తరువాత ప్రచారానికి ఎన్నికల కమీషన్ 10 రోజుల గడువు ఇచ్చింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమకు ఓటు వేయాలని ఇంటింటికి వెళ్ళి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కానీ ప్రచారంలో ఏ మాత్రం జోష్ కనపడడం లేదు. ఎన్నికలు వచ్చాయంటేనే మొదటి నుండి ఓటర్లకు పండుగ వాతావరణమే ఉంటుంది. వారిని తమవైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు మందు, విందుతోపాటు ఇతర తాయిలాలు ఇచ్చి మచ్చిక చేసుకునేవారు. నేడు ఆ పరిస్థితి జిల్లాలో ఎక్కడా కనపడడం లేదు. తమ గుర్తుకు ఓటు వేయాలంటూ రెండు చేతులు జోడించి దండాలు పెద్తున్నారే తప్ప వారికి ఏమి ఇవ్వని పరిస్థితి నెలకొంది.

**ఖర్చుకు వెనకడుగు...**

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఖర్చుకు వెనకడుగు వేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో జరిగే ఎన్నికలలాగా ప్రతిరోజు గ్రామాలలో ర్యాలీలు తీసి మందు, విందులు ఇచ్చేవారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు నుంచి ఓటుకు రూ. 3 వేల నుండి రూ. 5 వేల వరకు పంపిణీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో గతంలా అభ్యర్థులు డబ్బులను ఖర్చు పెట్టేందుకు సాహసించడంలేదు. గత ఎన్నికల్లో పోటీచేసిన వారి పరిస్థితుల దృష్ట్యా నేడు ఎన్నికలబరిలో నిలిచిన అభ్యర్థులు దూకుడుగా వ్యవహరించకుండా ఆచూతూచి అడుగులు వేస్తున్నారు. పంచాయితీ ఎన్నికల్లో గతంలో పోటీచేసి ఓడిపోయిన, గెలుపొందిన అభ్యర్థులు అనేకమంది అప్పులపాలు కావడం, కొంతమంది చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా అనేకం ఉండడంతో డబ్బును ఖర్చు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. గతంలో పని చేసిన సర్పంచ్‌లు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు లక్షల్లో ప్రభుత్వం ఇవాల్సి ఉంది. నేటికి ప్రభుత్వం వాటిని విడుదల చేయకపోవడంతో అప్పుల పాలైన పరిస్థితి. దీనిని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల్లో డబ్బులను నీళ్ళలా ఖర్చు చేయకుండా పొదుపు చేస్తున్నారు. దీంతో ఎన్నికల్లో జోష్ కనపడడంలేదు.

## పోస్టల్ బ్యాలెట్లు రహస్యంగా ఉంచాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయు లు, పోలీసులు ఉపయోగించుకునే పోస్టల్ బ్యాలెట్లు రహస్యంగా ఉంచాలని, స్వస్తిక్ గుర్తుతో ఓటు వేయించి అన్ని ఓట్ల వలే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించాలని బంజా రా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్ కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్‌లను ప్రత్యేకంగా దశరద్‌నాయక్ కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్‌లను ప్రత్యేకంగా రైట్ టిక్ గుర్తు వేసి లెక్కించడం వల్ల గ్రామాల్లో ఉద్యోగులు తమకు ఓటు వేయలేదనే భావన అభ్యర్థుల్లో కలిగి మనస్పర్ధలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

## బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు అక్కా చెల్లెళ్లు





**ప్రజాపక్షం/మిర్యాలగూడ (త్రిపురారం) :** నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం సత్యం పహడ్ గ్రామపంచాయితీ తండా పరిధిలోని నడిమి తండాకు చెందిన లావుడి హరినాయక్, నీల దంపతుల కుమార్తెలు లావుడి గాయత్రి, ప్రియాంకలు చదువుతోపాటు బాస్కెట్ బాల్ క్రీడలలో స్కూల్ గేమ్స్ స్థాయి నుంచి మండల డివిజన్ జిల్లా స్థాయి వరకు తమ ప్రతిభను కనబరిచారు. ఇటీవల మహబూబాద్ జిల్లా గార్ల లోని నిర్మల హైస్కూల్లో జరిగిన అండర్ 19 బాలికల బాస్కెట్బాల్ స్టేట్ లెవెల్ లో సెలెక్ట్ అయి తమ ప్రతిభను కనబరిచారు. జనవరిలో జరగబోయే జాతీయ స్థాయి బాస్కెట్బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. ఒక తాండలోనీ నిరుపేద కుటుంబంలో జన్మించిన ఈ ఇద్దరు కుమార్తెలు నేషనల్ స్థాయి బాయ్ బాస్కెట్ బాల్ క్రీడలలో సెలెక్ట్ అయినందుకు వీరి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్దకూతురు లావుడి గాయత్రి సూర్యాపేట లోని విద్యానగర్ లో గల శ్రీ లక్ష్మి వెంకట సాయి వోకేషనల్ జూనియర్ కళాశాలలో ఎం పి హెచ్ డబ్ల్యు, ఫిమేల్ సెకండ్ ఇయర్ చదువుతుంది, అదేవిధంగా చిన్న కూతురు పెన్ పహాడ్ మండలం అనాజిపురం గ్రామంలోని తెలంగాణ మోడల్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతుంది వీరు చిన్ననాటి నుండి బాస్కెట్బాల్ లో ప్రతిభను కనబరిచి నేడు నే షనల్ స్థాయిలో ఎంపిక కావడం గర్వ కారణం గా ఉందని తల్లిదండ్రులు వర్షం వ్యక్తం చేస్తున్నారు.



## గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తుంగతుర్తి మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన అన్నారం గ్రామంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సిఐ నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసులు గ్రామంలోని ప్రధాన రహదారులపై కవాతు నిర్వహిస్తూ ప్రజలకు నమ్మకాన్ని కల్పించారు. ఈ సందర్భంగా సిఐ నరసింహారావు మాట్లాడుతూ ఎన్నికలను పూర్తిగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం తమ లక్ష్యమని తెలిపారు. ప్రచార సమయంలో కాని, పోలింగ్ సమయంలో కాని ఎలాంటి అల్లర్లు, అశాంతి సృష్టించే చర్యలు సహించబోమని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు అడ్డంకులు కలిగించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ రోజున కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి గ్రామంలో ప్రశాంతంగా ఎన్నిక జరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఎస్ఐ క్రాంతికుమార్, నూతనకల్ ఎస్ఐ నాగరాజు, సర్కిల్ పరిధిలోని మూడు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

# అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**ప్రజాపక్షం/నూతనకల్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అలాంటప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెదనెమిల గ్రామంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి మాతృమూర్తి జెన్నారెడ్డి గీతారెడ్డి ఇటీవల మృతి చెందగా అన్న సమర్పణ కార్యక్రమానికి హాజరై గీతారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు, సర్పంచ్‌ల స్థానాలన్నింటిని కైవసం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, ఉచిత బస్సు, రైతులకు రుణమాఫీ వంటి పథకాల అభివృద్ధి పనులను ప్రజలకు చేరువేయాలన్నారు. అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు



మస్కాపురం వెంకన్న, యాస యల్లారెడ్డి, కాసోజు మదనాచారి, అనుపమ్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, సోమి రెడ్డి, గుర్రం సత్యనారాయణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉపేంద్రాచారికి శ్రీశ్రీ కళావేదిక పురస్కారం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన సొల్లేటి ఉపేంద్రాచారికి శ్రీశ్రీ కళావేదిక కవితా పురస్కారం లభించింది. జిల్లా కేంద్రంలో శ్రీశ్రీ కళావేదిక సూర్యాపేట జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో సాహితీ వసంతోత్సవంలో భాగంగా 159వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కవితా గానంలో ఉపేంద్రాచారి త్యాగాల మాగాణి అమ్మ అనే శీర్షికన ఆలపించిన కవితకు ఈ పురస్కారం లభించింది. సంస్థ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పోతుగంటి వీరాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రాచారిని శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమంటో, మెడల్, ప్రశంసా పత్రం అందజేశారు.

## ఇద్దరు నేత్రాలు... నలుగురికి కంటిచూపు

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** నల్లగొండ పట్టణ పరిధిలోని మర్రిగూడ ప్రాంతానికి చెందిన, సిరిప్రగడ లక్ష్మణరావు, అదేవిధంగా పట్టణంలోని మిర్యాలగూడ రోడ్, హైటెక్ కాలనీ ప్రాంతానికి చెందిన,వైద్యం చంద్రకళ ఆదివారం మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యుల అనుమతితో వారి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా ఐ డొనేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ వీరి మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా నలుగురు కార్నియల్ అంధులకు కంటివెలుగు ప్రసాదించడానికి సాక్ష్యాలైన ఘనతతో నిలిచారని, మానవతా విలువలు ఇంకా జీవించి ఉన్నాయని చాటిచెప్పిన ఈ కుటుంబానికి సమాజం తరపున హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాం అన్నారు.నేత్రదానం పట్ల కుటుంబ సభ్యులు చూపిన అంకితభావం ఎంతో ప్రశంసనీయము అని వీరి నిర్ణయంతో మరణానంతరం కూడా వారి సేవ కొనసాగుతుందని, శరీరం నశించినా, మన కళ్ల వెలుగు మరొకరి జీవితాన్ని వెలిగిస్తుంది అనే మహోన్నత భావాన్ని వీరు నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ ప్రెసిడెంట్ లయన్ నిమ్మల పిచ్చయ్య, కార్యదర్శి అశోక్ ఎర్రమాద, కోశాధికారి ఆదినారాయణ,కోఆర్డినేటర్లు కోట సరిత , కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్ చంద్రశేఖర్ చిరునోముల ఉన్నారు.



## స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

### డిఎస్‌పి రాజశేఖర్‌రాజు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. ఆదివారం గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకోని మండలంలో సమస్యాత్మక గ్రామాలైన తడకమళ్ల, తక్కెళ్లపాడు, యాద్గార్‌పల్లితోపాటు ఇతర గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు, భయానికి లోను కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ఎన్నికల సమయంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రలోభాలకు గురిచేసినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.




## టెండర్ల నిర్వహణలో అవకతవకలు?


### టెండర్ల అన్నింటికీ ఒకే గడువు ఉండదా?

### ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన ఒక్కటే కానీ.. తేదీలు వేరు ఇదేమి చోద్యం?

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విచిత్రంగా ఉంది. ఇటీవల సివిల్, ఎలక్ట్రికల్, విభాగానికి యాదగిరిగుట్ట దేవస్థానం వారిచే ఈ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన విడుదల చేసింది. మొత్తం 23 రకాల విభాగాలకు ఆన్లైన్ దరఖాస్తులు దేవస్థానం ఆహ్వానించింది. బిడ్డు సమర్పించుటకు చివరి తేదీ డిసెంబర్ 1 అని, టెక్నికల్ బిడ్డు తెరచు సమయం 2వ తేదీ సాయంత్రం 4:00 గంటలకు అని తాటికాయంత అక్షరాలతో నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ గడువు మించిపోయినప్పటికీ టెండర్ నిర్వహించక అధికారులు గడువును పొడిగిస్తూ వస్తున్నారు. ఔత్సాహితుల వ్యక్తిగత ప్రయోజనాలకు అధికారులు గడువును పొడిగిస్తున్నారని స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక కొంతమంది కాంట్రాక్టర్లు అధికారులతో కుమ్మక్కై టెండర్లను నిర్వహించకుండా అడ్డుపడుతున్నారని పట్టణంలో గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఎలక్ట్రికల్ విభాగానికి డిసెంబర్ 4 నాడు ముగిసిందని, సివిల్ విభాగానికి డిసెంబర్ 8 వరకు గడువు ఉందని



సంబంధిత అధికారులే రెండు రకాలుగా మాట్లాడడం విడ్డూరంగా ఉంది. నిజానికి తేదీలు పెంచినట్లయితే ప్రోత్సాహితులకు అధికారులు సమాచారం ఇవ్వాల్సింది ఉండగా నేటికీ ఇవ్వకపోవడంపై అనుమానాలకు దారితీస్తున్నాయి. ఒకసారి టెండర్ ప్రకటన విడుదలయితే ఏది ఏమైనా చివరి తేదీ తప్పనిసరిగా పాటించాల్సిందే. కానీ అధికారులు తీరు అనుమానాలకు దారితీస్తున్నాయి. టెండరు ప్రకటన విడుదలపై, ముగింపు తేదీలపై సదరు అధికారి ఈఈ దయాకర్ రెడ్డిని వివరణ కోరగా నిబంధనల మేరకే పొడిగించామని, గతంలో కూడా పదిసార్లు తేదీలను పొడిగించడం జరిగిందని ఆయన అన్నారు. మరి అలాంటప్పుడు దేవస్థానం విడుదల చేసిన టెండర్ ప్రకటనకు విలువ లేదా? ఉంటే అధికారులు పాటించనవసరం లేదా? అనే అనుమానాలు అనేకంగా వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన మరోసారి విడుదల చేసి భక్తులలో ఉన్న అనుమానాలను పోగొట్టవలసిన బాధ్యత అధికారుల పైన ఎంతైనా ఉంది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కారు టైర్ పేలి ముగ్గురు మృతి : ఇద్దరికి గాయాలు

**గోండా (ఉత్తరప్రదేశ్):** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోండాలో కారు టైర్ పేలి జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానిక చెందిన ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బాధితులు గోండాలో జరిగిన ఓ వివాహానికి హాజరై అయోధ్య విమానాశ్రయానికి తిరిగి వస్తుండగా వజీర్గంజ్ ప్రాంతంలోని అన్నులా మలుపు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఆవాస్ వికాస్ కాలనీ నివాసి ప్రమోద్ గుప్తా మాట్లాడుతూ తన కుమార్తె నేహా (28), అల్లుడు అక్షత్ అగర్వాల్ (35), మనవరాలు అనయ(3), అక్షత్ తల్లి నీతా అగర్వాల్ (55), బంధువు అషు అగర్వాల్(34) డిసెంబర్ 4న తన కుమారుడు నితిన్ వివాహానికి హాజరయ్యేందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమం తర్వాత, నితిన్ వారిని బెంగళూరుకు తిరుగు ప్రయాణం కోసం అయోధ్య విమానాశ్రయానికి కారులో తీసుకెళ్తున్నాడు. కారు అన్నులా మలుపు వద్దకు చేరుకోగానే టైర్లలో ఒకటి అకస్మాత్తుగా పగిలిపోవడంతో ఎదురుగా వస్తున్న ఉత్తరాఖండ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ బస్సును ఢీకొట్టింది.

## చివరకు సర్కార్ మేల్కొంది..

### విమాన టికెట్ల పరిమితులపై చిదంబరం చురకలు



**న్యూఢిల్లీ :** ఇండిగో విమాన సేవలకు గత కొద్ది రోజులుగా తీవ్ర అంతరాయం కలిగిన నేపథ్యంలో, మోదీ సర్కార్ విమాన ఛార్జీలపై పరిమితులు విధించింది. దీనిపై కాంగ్రెస్ నేత పి.చిదంబరం ఆదివారం తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. మోదీ సర్కార్ ఆలస్యంగా మేల్కొందని అన్నారు. విమానయాన రంగం కేవలం రెండు సంస్థల గుత్తాధిపత్యంలో కొనసాగినంత కాలం ఈ ధరల నియంత్రణ అమలులో ఉండాలని ఆయన డిమాండ చేశారు. గత కొద్ది రోజులుగా ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వందలాది విమానాలు రద్దు అయ్యాయి. వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతోంది. బహుశా డిసెంబర్ 10 నాటికి అంతా సెట్ కావచ్చని ఇండిగో చెబుతోంది. ఈ నేపథ్యంలోనే మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. గత కొద్ది రోజులుగా ఇండిగో విమాన సర్వీసులు స్తంభించిపోవడం అనేది ఆ సంస్థ యాజమాన్యం, విమానయాన మంత్రిత్వ శాఖ, డిజిసిఎతో సహా మోదీ ప్రభుత్వపు వైఫల్యాన్ని ఎత్తి చూపుతోందని చిదంబరం వ్యాఖ్యానించారు. 'కొత్త పైలట్ డ్యూటీ టైమ్ రూల్స్ జనవరి 2024లో నోటిఫై అయ్యాయి. కానీ విమానయాన సంస్థలు ఆ నిబంధనలకు అనుగుణంగా తమ కార్యకలాపాలను మార్చుకునేలా ప్రభుత్వం మార్గనిర్దేశం చేయడంలో పూర్తిగా విఫలమైంది. దీనికి విమానయాన మంత్రిత్వ శాఖ, డిజిసిఎ పూర్తిగా బాధ్యత వహించాలి' అని చిదంబరం ఆరోపించారు. 'సంక్షోభం మొదలై తీవ్రరూపం దాల్చినప్పుడు, ప్రభుత్వం దిశానిర్దేశం చేయలేకపోయింది. పూర్తిగా నిస్సహాయంగా ఉండిపోయింది. చివరికి చేతులెత్తేసింది' అని చిదంబరం విమర్శించారు

## 1650 ఇండిగో విమానాలు రాకపోకలు

**ముంబయి:** గత ఐదు రోజుల్లో భారీ అంతరాయాల తర్వాత ఎయిర్‌లైన్ కార్యకలాపాలు క్ర మంగా స్థిరీకరించబడుతున్నాయి. ఇండిగో ఆదివారం నాడు 2,300 రోజువారీ దేశీయ, అంతర్జాతీయ విమానాల రాకపోకలను సాగించింది. అ యితే 650 విమానాలను రద్దు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్ తెలిపింది, డిసెంబర్ 10–15 తేదీల షె డ్యూల్‌కు బదులుగా డిసెంబర్ 10 నాటికి నెట్‌వర్క్‌ను స్థిరీకరించాలని భావిస్తున్నట్లు ఇండిగో తెలిపింది. కాగా, పౌర విమానయాన మంత్రిత్వ శా ఖ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఆరు మెట్రో విమానాశ్రయాల నుండి ఎయిర్‌లైన్ తన సకాలం లో పనితీరు 20.7 శాతానికి మెరుగుపడింది. శనివారం దాదాపు 800 రద్దులకు వ్యతిరేకంగా 1,5 00 విమానాలను నడిపింది. గ దీని వ లన వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ప డ్డారు. ఇటీవలి అంతరాయాల తర్వాత, తమ నె ట్‌వర్క్‌లో మరింత ముఖ్యమైన, స్థిరమైన మెరుగుదలలను ఏర్పాటు చేస్తున్నామని ఇండిగో ధృవీకరి ంచింది. ఆదివారం, 1,650కి పైగా విమానాల ను నడపడానికి ప్రయత్నిస్తున్నామని, శుక్రవారం దాదాపు 1,500 విమానాలు మాత్రమే నడిపిన ట్లు ఇండిగో ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది కొరత కారణంగా శుక్రవారం దాదాపు 1,600 విమానాలను రద్దు చేయడంతో ఎయిర్‌లై న్ చరిత్రలో అత్యంత పేలవ ప్రదర్శనగా నిలిచిం ది. ఎయిర్‌లైన్ తన విమాన షెడ్యూల్‌లను పునరుద్ధరించడంలో, కస్టమర్ సపోర్ట్ సిస్టమ్‌లను బ లోపేతం చేయడంలో 'చాలా ముఖ్యమైన' పురోగతిని సాధిస్తోందని ప్రతినిధి తెలిపారు.

# ఇజ్జత్ కోల్పోయిన ఇండిగో

## అన్నీ తప్పుడు అంచనాలే–అంతా దురాశే

**న్యూఢిల్లీ:** తప్పుడు అంచనాలు, నిబంధనల ఉల్లంఘనలే 'ఇండిగో సంక్షోభం' అని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో ఇటు కేంద్ర ప్రభుత్వం, డిజిసిఎ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఎవియేషన్), అటు ఇండిగో సంస్థ ఆలస్యంగా నిద్ర మేల్కొన్నాయి. తక్కువరేట్ల పేరుతో ఎయిర్ ఇండియాతో కలిసి గుత్తాధిపత్యం (91 శాతం రవాణావాటా) చెలాయిస్తున్న ఇండిగో సంస్థ 140 కోట్ల జనాభాగల దేశంలో నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా సీజన్లవారీ అవసరాలు గుర్తించలేక నిర్వహణా లోపంతో ఎలాంటి ముందస్తు ప్రణాళికలను ఏర్పాటు చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. విలువైన మానవ వనరుల సంపదను కాపాడుతూ, సురక్షతంగా వారని గమ్యాలకు చేర్చే సూపర్ హీరోలైన పైలట్లను తగినంత సంఖ్యలో ప్రణాళికాబద్ధంగా సమకూర్చుకోవడంలో విఫలమైంది. పైలట్ డ్యూటీలను నియంత్రించడంలో, వారికి తగిన విశ్రాంతి కల్పించి తక్ష ణం రంగంలోకి దిగేవిధంగా 'వేచిఉండే పైలట్ల'ను ప్రత్యేకంగా సిద్ధంగా ఉంచడంలో విఫలమైంది. తప్పుడు అంచనాలు, డిజిసిఎ ప్రవేశపెట్టిన నిబంధనల ఉల్లంఘన, దురాశ వీటన్నింటికీ మూలకారణమని సాధారణ ప్రయాణికులు చేసిన విశ్లేషణ 'ఇండిగోకు ముందుగానే తెలియదా?' అనేది మిలియన్ డాలరు ప్రశ్నగా మిగిలింది. మూడు రోజుల తర్వాత ఇండిగో అధికారికంగా క్షమాపణ చెప్పినప్పటికీ, దేశ గగన ప్రయాణ రంగం ప్రపంచవ్యాప్తంగా అభాసుపాలైన ఆరు రోజులకు కూడా ఒక స్పష్టత ఇవ్వలేకపోయింది. తీరిగ్గా కళ్ళు తెరచి 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్న రీతి'లో ఆదివారం బోర్డు సమావేశం నిర్వహించి సంక్షోభ నియంత్రణ బృందాన్ని ఏర్పాటు చేస్తామని, ప్రయాణికుల ఛార్జీలను తిరిగి చెల్లించేందుకు ఏర్పాటు చేస్తామని, డిసెంబరు 10–15 తేదీల నాటికి సర్వీసులను సాధారణీకరిస్తామని చెప్పడం ద్వారా మరింత నవ్వులపాలైంది. ఒకప్పుడు సమయపాలనకు, దేశం వెలుపల, లోపల విస్తారమైన కార్యకలాపాలకు పునర్నిర్వచనం చెప్పింది ఇండిగో. కాలక్రమేణా తననే నమ్ముకున్న లక్షలమంది ప్రయాణికులను కష్టాలకు, కన్నీళ్ళకు గురిచేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టి ఇప్పుడు ఇజ్జత్ కోల్పోయింది ఇండిగో. తర్వాత ఇక డిజిసిఎ విచారణకు ఆదేశించింది. ప్రతీ పక్షంరోజులకూ తన పురోగతి నివేదిక సమర్పించాల



ని ఆదేశించింది. పైలట్ల సమస్య పరిష్కారానికి ఒక బృహత్తర ప్రణాళిక సమర్పించాలని కోరింది. పైలట్లు తగినంత మంది అందుబాటులో లేరనే పేరుతో డిసెంబరు రెండో తేదీ నుండీ ఇండిగో సంస్థ విమానాలను రద్దు చేయడం ప్రారంభించింది. క్రమంగాఈ సంక్షోభం ముదిరింది. తీవ్రమైన ఆరోగ్య సమస్యల రీత్యా ఆసుపత్రులకు వెళ్ళేవారు, అర్జంటు ఆర్థిక కార్యకలాపాల నిమిత్తం వెళ్ళేవారు, ఆపద మొక్కులు తీర్చుకోవడానికి పుణ్యక్షేత్రాలకు వెళ్ళే భక్తజనులు...ఇలా ఒకరేమిటి అనేక వర్గాల ప్రజలు దేశవ్యాప్తంగా విమానాశ్రయాలలో ఎక్కడివారు అక్కడే స్తంభించిపోయి ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. కన్నీళ్ళు పెట్టుకున్నారు. కనీస సమాచారమైనా చెప్పమని బ్రతిమిలాడారు. తమ సమయం వృథా అవుతోందని ఆందోళన చెందారు. చివరకు ఉన్నచోటనే నినాదాలు, ప్రదర్శనలు చేసే వరకూ పరిస్థితులు దారితీశాయి. ఇప్పుడు తీరికగా తలవాల్చి ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులకు అండగా ఉంటామని, రీఫండింగ్ చేస్తామని, రీషెడ్యూలింగ్ ఏర్పాట్లు చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నది. వారం రోజులుగావందల విమానాలను రద్దుచేయడంవల్ల అనేకమంది ముఖ్యులు వ్యాపార కీలకమైన సమావేశాలకు, వివాహాలకుహాజరు కాలేకపోయారు. ఇండిగో ప్రతిరోజూ నడుపుతున్న 2,300 విమానాలలో 650 విమానాలు ఒక్క ఆదివారంనాడే గాలిలోకి లేవకుండా నిద్రపోయాయి. దేశీయ మార్కెట్లో ఇండిగోకు 65 శాతంపైగా వాటా ఉంది. మూడో తేదీన 150 విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, ముంబై మార్గాల్లో సంక్షోభం వచ్చింది. వేలాదిమంది ప్రయాణాలు ఆగిపోయాయి. ఒక్కసారిగా అది కుప్పకూలడంతో దానికి పోటీగా ఉన్న ఇతర ఎయిర్‌లైన్స్ కూడా తట్టుకుని భరించలేనంత ట్రాఫిక్‌ను సృష్టించింది. ఈ మార్గాలలో అందరూ విపరీతంగా ధరలు పెంచేశారు. ఢిల్లీ–బెంగళూరు మధ్య ధర రూ.40 వేల నుండి రూ.80 వేలకు, ఢిల్లీ–ముంబై మధ్య ధర రూ.36 వేల నుండి 56 వేలకు, ఢిల్లీ–చెన్నై మధ్య టిక్కెట్టు ధర రూ.62 వేల నుండి రూ.82 వేలకు ఇతర సంస్థలు పెంచేశాయి. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసి ధరలను నియంత్రించాల్సి వచ్చింది.

**పైలట్లసంఖ్యపై అంచనా ఏది?**

గుత్తాధిపత్యం చెలాయిస్తున్నప్పుడు ఎంతమంది పైలట్లు కావాలి? అనే విషయాలలో ఇండిగో తప్పుడు అంచనాలు వేసింది. ఎంతమందిని అత్యవసర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలి, ఎంతమంది పైలట్లకు సెలవులు ఇవ్వాలి, ఎన్ని గంటలు విశ్రాంతి ఇవ్వాలి, ఎన్ని గంటలు వారికి డ్యూటీ వేయాలి? పైలట్లకు రాత్రిపూట, పగటిపూట ఎన్నెన్ని ఇవ్వాలి? ఎన్ని ల్యాండింగ్‌లు ఇవ్వాలి? అనే విషయంలో డిజిసిఎ రూపొందించిన కొత్త నిబంధనలను ఇండిగో బేఖాతరు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం స్తవానికి ప్రతి పైలట్‌కు వారానికి 36 గంటల నుండి 48 గంటలు విశ్రాంతి ఉండాలి. అర్ధరాత్రి నుండి తెల్లారేవరకూ పైలట్‌కు గతంలో ఆరురు, ల్యాండింగ్‌లు ఉండేవి. కొత్త నిబంధనల ప్రకారం ఈ సంఖ్యను రెండు తగ్గించారు. పైలట్ గరిష్ఠస్థాయిలో పది గంటలు డ్యూటీకి తగ్గించారు. వరుగా రెండు రాత్రులు మినహా డ్యూటీ ఇవ్వకూడదు. డిజిసిఎ రూపొందించిన ఈ నిబంధనలను వాస్తవానికి 2024 జనవరి నుండి అమలులోకి రావాలి. కానీ కొంత గడువు ఇచ్చేందుకు వీటి అమలు ఆలస్యం చేశారు. దశలవారీగా అమలు చేశారు. ఈ ఏడాది జులై ఒకటో తేదీ నుండి ప్రారంభించి ఐదునెలలపాటు నవంబరు ఒకటో తేదీ వరకూ మార్పులు చేసిన ఒక్కొక్క నిబంధనను ప్రవేశపెడుతూ వచ్చారు. కానీ ఎంతమంది పైలట్లు కావాలనే విషయాన్ని ఇండిగో అర్థం చేసుకోలేకపోయింది. ఇండిగో ఎయిర్‌బస్ ఎ 320లు సజావుగా నడవాలంటే 2,422 మంది పైలట్లు కావాలి. కానీ వారివద్ద 2,357 మంది మాత్రమే ఉన్నారు. ఇండిగో ఇప్పుడు చివరకు ఆలోచవనలో పడింది.

## విమానాల రద్దుపై కార్యనిర్వాహకులకు పార్లమెంటరీ ప్యానల్ పిలుపు?

**న్యూఢిల్లీ :** ఇండిగో విమానాల రద్దుపై పార్లమెంట్ ప్యానెల్ చర్యలకు పూనుకోనుంది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాలలో వేలాది మంది ప్రయాణికులను చిక్కుకుపోయేలా చేసిన ఇండిగో విమానాల భారీ రద్దుపై ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ అగ్ర కార్యనిర్వాహకులను, పౌర విమానయాన నియంత్రణ సంస్థను పిలిపించే అవకాశం ఉంది. జెడి (యు) నాయకుడు సంజయ్ ఝా అధ్యక్షతన ఉన్న రవాణా, పర్యాటక, సంస్కృతిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, విమాన సేవలలో అంతరాయం ఏర్పడటానికి గల కారణం, సాధ్యమైన పరిష్కారాల గురించి విమానయాన సంస్థల ఉన్నత కార్యనిర్వాహకులు, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ), పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారుల నుండి వివరణ కోరే అవకాశం ఉంది. విమాన సేవలలో అంతరాయం కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్యానెల్ తీవ్రంగా పరిగణించిందని ఒక సభ్యుడు చెప్పారు. శీతాకాల సమావేశాల కోసం దేశ రాజధానిలో ఉన్న పార్లమెంటు సభ్యులు కూడా ఇండిగో విమానాల రద్దు, ఇతర విమానయాన సంస్థల జాప్యాల భారాన్ని ఎదుర్కొన్నారని ప్యానెల్ సభ్యుడు చెప్పారు. ఈ పరిస్థితి కారణంగా విమాన ఛార్జీలు పెరుగుతున్నాయని అనేక మంది ఎంపిలకు ప్రజల నుండి ఫిర్యాదులు కూడా అందాయి. కాగా, రవాణాపై స్టాండింగ్ కమిటీలో భాగం కాని సిపిఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్, విమానాల రాకపోకలకు పెద్ద ఎత్తున అంతరాయం ఏర్పడటంపై ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ లేదా న్యాయ విచారణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యకలాపాలను సాధారణీకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ అంతరాయాలు ఆరో రోజుకు చేరడంతో, ఇండిగో ఆదివారం ఢిల్లీ, ముంబై విమానాశ్రయాలలో 220కి పైగా విమానాలను రద్దు చేసింది. విమానయాన నియంత్రణ సంస్థ, డిజిసిఎ, శనివారం ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్, సిఒఒ, అకౌంటబుల్ మేనేజర్ పోర్కెరాస్‌లకు వివరణ కోరుతూ నోటీసులు పంపింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ బోర్డు, దాని మాతృ సంస్థ, సంక్షోభ నిర్వహణ సమూహాన్ని ఏర్పాటు చేసిందని, ఇది పరిస్థితిని పర్యవేక్షించడానికి క్రమం తప్పకుండా సమావేశమవుతుందని ఇండిగో ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

## వాహనం ఢీకొని మగ చిరుతపిల్ల మృతి

**గ్వాలియర్ :** గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఒక మగ చిరుతపిల్ల మృతిచెందింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ జిల్లాలో ఒక జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సంఘటన ఆగ్రా ముంబయ్ జాతీయ రహదారిపై ఘటిగావ్ ప్రాంతంలో శివపురి జిల్లా సరిహద్దుకు సమీపంలో ఇక్కడ నుండి 35 నుండి 40 కి.మీ.ల దూరంలో జరిగిందని గ్వాలియర్ జోన్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజి) అర్‌విండ్ సక్సేనా 'పిటిఐ'కి ఫోన్ కాల్‌లో తెలిపారు. దాదాపు 20మాసాల వయసున్న మగ చిరుతపిల్ల కె.ఎన్.పి నుండి దారితప్పి తల్లి నుంచి విడిపోయిందని, ఒక గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అది చనిపోయిందని ఐజి సక్సేనా చెప్పారు. ఇదిలాఉంటే చిరుతను ఢీకొట్టినట్లు అనుమానిస్తున్న కారు గురించి ఆధారాలు లభ్యమయ్యాయని పోలీస్ దర్యాప్తు బృందంలోని ఒక సభ్యుడు చెప్పారు. 'అదే తల్లి నుండి వేరుచేయబడిన మరొక మగచిరుత పిల్ల ఇప్పటికీ చుట్టూ ఉండవచ్చు.కాబట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి మేం ట్రాఫిక్‌ను నియంత్రించాం. జాతీయ రహదారిపై వేగాన్ని తగ్గించాం. రెండూ గతంలో కలిసి కనిపించాయి' అని ఐజి అర్‌విండ్ సక్సేనా చెప్పారు. 'మరో చిరుత పిల్ల సురక్షితంగా ఉంది'అని స్టేట్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (వైల్డ్ లైఫ్) శుభరాజన్ సేన్ 'పిటిఐ'కి చెప్పారు.

## మావోయిస్టుల కంచుకోట...

# కొండపల్లిలో మొబైల్ టవర్

**న్యూఢిల్లీ :** మావోయిస్టుల కంచుకోట అయిన ఛత్తీస్‌గఢ్ బిజాపుర్ జిల్లాలోని కొండపల్లిలో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఉషోదయం మొదలైంది. గ్రామంలో మొబైల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని తెలిసిన వెంటనే ఊరుఊరంతా వెళ్లి సంబరాలు చేసుకున్నారు. కొండపల్లి మావోయిస్టుల కంచుకోట. ఇది ఛత్తీస్‌గఢ్ బిజాపుర్ జిల్లాలోని మారుమూల గ్రామం. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న కొండపల్లిలో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఉషోదయం మొదలైంది. గ్రామంలో తొలిసారిగా మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చింది. గ్రామానికి తొలిసారిగా మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ రావడంతో స్థానికుల ఆనందంలో మునిగిపోయారు. గ్రామంలో మొబైల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని తెలిసిన వెంటనే ఊరుఊరంతా వెళ్లి సంబరాలు చేసుకున్నారు. ఈ ఘటన డిసెంబర్ 5ను ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బిజాపూర్ జిల్లా కేంద్రం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతంలో కొండపల్లి ఉంది. ఈ గ్రామానికి దశాబ్దాలుగా సంవత్సరాలుగా రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో లేవు. ఇలాంటి ప్రాంతంలో మొట్టమొదటి



సారిగా మొబైల్ టవర్ వస్తుందని తెలిసిన ప్రజలు ఆనందంలో మునిగిపోయారు. టవర్ ప్రారంభిస్తున్నామని అధికారులు ప్రకటించిన వెంటనే గ్రామంలోని పెద్దలు, మహిళలు, యువకులు, పిల్లలు అందరూ డబ్బులు, వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలతో ర్యాలీగా టవర్ వద్దకు చేరుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి టవర్ ప్రారంభించారు. అధికారులు టవర్‌ను పూర్తిగా యాక్టివేట్ చేసినప్పుడు గ్రామస్థులు మొబైల్ ఫోన్లలో మొదటిసారి సిగ్నల్ బార్లు కనిపించడంతో ఆనందోత్సాహంలో మునిగిపోయారు. నృత్యాలు చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. దండకారణ్యంలోని మారుమూల గ్రామానికి మొబైల్ నెట్‌వర్క్ చేరుకోవడం కేవలం సాంకేతిక ప్రగతి మాత్రమే కాదు, గ్రామాన్ని బయటి ప్రపంచంతో అనుసంధానించే కీలక అడుగుగా భావిస్తున్నారు. 'నియద్ నెల్లానార్' పథకంలో భాగంగా తీసుకున్న ఈ చర్యతో కొండపల్లి అభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని అధికారులు తెలిపారు. 2024 లో 'నియద్ నెల్లానార్' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం ద్వారానే కొండపల్లిలో మొబైల్ టవర్‌ను ఏర్పాటు చేశారు. ఈ పథకం చొరవతో ఈ ప్రాంతంలో గణనీయమైన మార్పులు వస్తున్నాయి. ఈ పథకం కింద 403 గ్రామాలకు సేవలు అందుతున్నాయి. తొమ్మిది ప్రభుత్వ విభాగాలు సామాజిక సేవలను అందిస్తుండగా, 11 విభాగాలు నేరుగా కుటుంబాలకు వ్యక్తిగత ప్రయోజన పథకాలను అందిస్తున్నాయి. ఈ స్కీమ్ కింద గత రెండేళ్లలో ఈ ప్రాంతంలో 728 కొత్త మొబైల్ టవర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 69 కొత్త భద్రతా క్యాంపులను స్థాపించారు. కొండపల్లిలో చాలా సంవత్సరాలుగా కమ్యూనికేషన్, రవాణా, ప్రజా సేవలు పొందడంలో తీవ్ర సవాళ్లను ఎదుర్కొంది. కఠినమైన భౌగోళిక పరిస్థితులు, నక్సల్స్ అడ్డంకుల కారణంగా పరిపాలన బృందాలు ఈ ప్రాంతానికి చేరుకోవడం కష్టంగా ఉండేది. అయినప్పటికీ ప్రభుత్వం నిరంతర భద్రతా కార్యకలాపాలు, మెరుగైన పరిపాలనను అందించేందుకు ముందుకొచ్చింది. దీంతో కొంత పరిస్థితి మెరుగుపడింది. కానీ 'నియద్ నెల్లానార్' పథకాన్ని ప్రారంభించిన తర్వాత గణనీయమైన మార్పులు బిజాపూర్‌లో వస్తున్నాయి.

## సమగ్ర దర్యాప్తు చేయాలి : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** గోవాలోని నైట్‌క్లబ్‌లో 25 మంది మృతి చెందిన విషాదకరమైన అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని, కఠినమైన జవాబుదారీతనం ఉండాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. భద్రత లోపం, నేరపూరిత పాలనా వైఫల్యమని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఉత్తర గోవాలోని అర్పోరా గ్రామంలోని ప్రసిద్ధ నైట్‌క్లబ్ బిర్చ్ బై రోమియో లేన్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బందితో సహా 25 మంది మరణించారు మరియు మరో ఆరుగురు గాయపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అగ్నిప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ నివారించదగిన విషాద సంఘటన కోలుకోలేని నష్టాన్ని మిగిల్చిందని, గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఇలాంటి విషాదాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, కఠినమైన జవాబుదారీతనం, అన్ని అగ్నిమాపక భద్రతా నిబంధనలు అమలు చేయబడతాయని నిర్ధారించుకోవడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా ఇటువంటి విధ్వంసకర ఘటనలు ఎప్పుడూ పునరావృతం కాకుండా చూసుకోవాలని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. తీరప్రాంతంలోని కాంగ్రెస్ కార్యకర్తలందరూ బాధిత కుటుంబాలకు సాధ్యమైన సహాయాన్ని అందించాలని, ఈ దుఃఖ సమయంలో వారితో నిలబడాలని విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అర్పోరాలో జరిగిన విషాద అగ్నిప్రమాదం తనను తీవ్రంగా



బాధపెట్టిందని అన్నారు. మృతులను కోల్పోయిన కుటుంబాలకు హృదయపూర్వక సంతాపం, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాని చెప్పారు. 'ఇది కేవలం ప్రమాదం కాదు; ఇది భద్రత, నేరపూరిత పాలన వైఫల్యం. సమగ్రమైన, పారదర్శకమైన దర్యాప్తు ద్వారా జవాబుదారీతనం నిర్ధారించబడాలి. ఇలాంటి నివారించదగిన విషాదాలు మళ్ళీ జరగకుండా చూసుకోవాలి' అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ స్పందిస్తూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విషాదకరమైన అగ్నిప్రమాదానికి జవాబుదారీతనం నిర్ణయించాలని కోరారు. అగ్నిప్రమాదం దిగ్భ్రాంతికరమైనదిదని, ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. అగ్నిమాపక భద్రతా నిబంధనలను అమలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ విషాదం జరిగిందని, బాధ్యులను గుర్తించడానికి, జవాబుదారీతనం నిర్ధారించడానికి సమగ్రమైన, నిష్పాక్షికమైన దర్యాప్తును డిమాండ్ చేస్తున్నామని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటింగ్‌కు..

# ఎంపిలను అనుమతించాలి

### లోక్‌సభలో 'ప్రైవేట్ బిల్లు' ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపి మనీష్‌తివారీ

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ స్థిరత్వాన్ని ప్రభావితం చేసే బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటింగ్‌కు పార్లమెంట్ సభ్యులను అనుమతించే బిల్లును కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ద్వారా ప్రభుత్వ స్థిరత్వాన్ని ప్రభావితం చేసే బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటు వేయడానికి వీలు కల్పిస్తూ, వారిని కొరడాతో నడిపే 'విప్ నిరంకుశత్వం' నుండి విడిపించడానికి, మంచి చట్టాల నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి వీలు కల్పించారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించడానికి గత శుక్రవారం 'ప్రైవేట్ సభ్యుల బిల్లు'ను ప్రవేశపెట్టిన మనీష్‌తివారీ తన ప్రతిపాదిత చట్టం ప్రజాస్వామ్యంలో ఎవరికి ప్రాధాన్యత ఉందో అతడి లేదా ఆమె ప్రతినిధిని ఎన్నుకోవడానికి గంటల తరబడి ఎండలో నిలబడి ఉన్న ఓటరును లేదా ప్రతినిధి ఎవరి విప్‌కు అధిపతిగా మారతారో గుర్తించాలని చూస్తున్నారని అన్నారు. 2010 మరియు 2021 తర్వాత మనీష్ తివారీ మూడవసారి లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు, ప్రభుత్వ స్థిరత్వాని ్న ప్రభావితం చేసే విశ్వాస తీర్మానం, అవిశ్వాస తీర్మానం, వాయిదా తీర్మాన, ద్రవ్యబిల్లులు, ఆర్థిక విషయాలు కాకుండా బిల్లులు, తీర్మానాలపై స్వతంత్రంగా ఓటు వేసే స్వేచ్ఛను పార్లమెంట్ సభ్యులకు కల్పించడానికి ప్రయత్నిస్తుంది. 'ఈ బిల్లు శాసనసభ యొక్క అంతరాత్మ, నియోజకవర్గం, సాధారణ జ్ఞానాన్ని తిరిగి ఇవ్వడానికి ప్రయత్నిస్తు ంది. తద్వారా ఎన్నికైన ప్రతినిధి వాస్తవానికి తన ను ఎన్నుకున్న ప్రజల ప్రతినిధిగా పనిచేస్తాడు. అ తడి పార్టీ జారీచేసిన విప్ సాధనంగా కాదు, శాసనసభ్యుడిని కేవలం లోబోటమైజ్డ్ సంఖ్యలుగా, వి భజన బెల్‌కు స్పందించే పిడివాద సంకేతాలుగా మారుస్తాడు' అని మనీష్ తివారీ 'పిటిఐ'కి చె ప్పారు. 'ఒక సభ్యుడు విశ్వాస తీర్మానం, ఈ బిల్లు గురించి మనీష్ తివారీ మాట్లాడుతూ ఈ బిల్లు జ ంట లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నిస్తుందని?, ప్రభుత్వ స్థిరత్వం ప్రభావితం కాదని, పార్లమెంటేరియన్లు, శాసనసభ్యులు శాసనసభ ఎంపికపై కసరత్తు నిర్వహిస్తారని చెప్పారు.




ఈ బిల్లు నిరంకుశత్వాన్ని తొలగించి మంచి చట్టాలను రూపొందించడాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుందా? అని తివారీని అడిగినప్పుడు 'కచ్చితంగా' అని ఆయన సమాధానం ఇచ్చారు. 10వ షెడ్యూల్ అమలులోకి వచ్చిన పావు శతాబ్దం గడిచిన తర్వాత, నేటి ప్రజాస్వామ్య ప్రక్రియకు మరింత సందర్భోచితంగా ఉండాలంటే దానికి కొన్ని అనుసరణలు, మరింత బలోపేతం అవసరమని బిల్లు లక్ష్యాలు, కారణాల ప్రకటన తెలిపింది. 10వ షెడ్యూల్‌లోని అంశాలను విచారించడానికి సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్‌తో కూడిన పార్లమెంట్ అధ్యక్షుడి వెలుపల జ్యుడీషియల్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని మనీష్ తివారీ పిలుపునిచ్చారు. ఏవైనా అప్పీళ్లు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి వెళ్తాయని, ఆ తర్వాత బహిరంగ కోర్టులో విచారణకు చట్టబద్ధమైన సమీక్ష ఏర్పాటు చేయబడుతుందని తివారీ చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్ సమయంలో 'సంయమనం' ఎంచుకోకుంటే...

# బలగాలు 'ఇంకా చాలా చేసేవి'

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి

**లేహ్ :** పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ సమయంలో సాయుధ దళాలు 'ఇంకా చాలా చేయగలిగేవి' అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా 'నియంత్రణ', 'క్రమాంకన' చేసిన ప్రతిస్పందనను ఎంచుకున్నారన్నారు. మే నెలలో జరిగిన ఈ ఆపరేషన్ భారత దళాల సామర్థ్యం, క్రమశిక్షణ రెండింటినీ నొక్కిచెప్పిందన్నారు. వారు ఉగ్రవాద ముప్పులను తీవ్రతరం చేయకుండా తటస్థీకరించారని రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ఇక్కడ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బ్రో) ద్వారా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పూర్తి అయిన 125 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సాయుధ దళాలు పౌర పరిపాలన, సరిహద్దు ప్రాంతాల పౌరుల మధ్య మేం చూసిన సమన్వయం అద్భుతమైనది. మన దళాలకు మద్దతు ఇచ్చినందుకు లడఖ్‌లోని ప్రతీ పౌరుడికీ, సరిహద్దు ప్రాంతాలకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని రక్షణమంత్రి అన్నారు. ఈ సమన్వయమే మన గుర్తింపును నిర్వచిస్తుందన్నారు. ప్రపంచంలోనే మనకు అత్యంత గుర్తింపును ఇచ్చేది మన పరస్పర బంధమేనన్నారు. ఏప్రిల్ 22న కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు మే 7న ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించాయి. పహల్గామ్ దాడిలో 26మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా అందులో అధిక సంఖ్యాకులు పర్యాటకులే ఉన్నారు. కొన్ని మాసాల క్రితం పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా మన సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్‌ను ఎలా నిర్వహించాయో మనందరం చూశామని, వారు ఉగ్రవాదులకు యావత్ ప్రపంచానికీ తెలుసని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. 'మన దళాలు శౌర్యాన్ని మాత్రమే కాకుండా సంయమనాన్ని కూడా ప్రదర్శించాయి. అవసరమైనది మాత్రమే చేశాయి' అని రక్షణ మంత్రి చెప్పారు. 'మోహరించబడిన సైనికుడికి ప్రతీనిమిషం, ప్రతీ సెకను చాలా ముఖ్యమైనదన్నారు. అందువల్ల కనెక్టివిటీ కేవలం నెట్‌వర్క్‌లు, ఆప్టికల్ ఫైబర్ డ్రోన్, రాడార్‌లకే పరిమితం కాకూడదు. ఇది భద్రతకు వెన్నెముక' అని సింగ్ అన్నారు. దేశంలోని ఏమూలనైనా కలవగలిగితే, అది పటిష్ఠమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, కనెక్టివిటీ వల్లనే సాధ్యమవుతుందని తెలియజేశారు. లడఖ్ సహా అన్ని సరిహద్దు ప్రాంతాలలో కమ్యూనికేషన్, కనెక్టివిటీని బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోందన్నారు. సరిహద్దు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఉత్సాహంతో పనిచేస్తున్నదని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. 'మా ప్రభుత్వం, మా సాయుధ దళాలు, బిఆర్‌ఓ సంస్థలు మీతో ఉన్నాయి. మా సంబంధం ఏ బాహ్య అంశాల వల్ల ప్రభావితం కాకుండా మనం బలోపేతం చేసుకోవాలి' అని రక్షణ మంత్రి పేర్కొన్నారు. మెరుగైన కనెక్టివిటీ భద్రత, మౌలిక సదుపాయాలను మాత్రమే బలోపేతం చేయడమే కాకుండా ఆర్థిక వృద్ధిని కూడా నడిపిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ జోడించారు.



# సాహితీ విహారి

## ఉద్యమ సాహిత్యంపై చెరగని సంతకం..

'అమరవీరుడా! అనన్యశూరుడా!
అమరజీవీ భగత్‌సింగ్!
అందుకో మా లాల్‌సలాం
అందుకో మా లాల్ సలాం

కండబలం గుండెబలం చూపినవాడా!
తెల్లదొరల గుండెల గురి చూసినవాడా!
ఇన్‌క్విలాబ్ నినాదమందించినవాడా!
ఉరికొయ్యలు ముద్దాడుతు
నినదించినవాడా!'



అన్న గీతంతో తెలుగునాట నలుమూలలా 'కరుణ వీరరసం' చిందిస్తున్న భగత్‌సింగ్ గీతాన్ని రాసిన కందిమళ్ల ప్రతాపరెడ్డి పేరు వినగానే స్ఫురించేది ఆయన రచించిన 'కామ్రేడ్ భగత్‌సింగ్' గ్రంథం. 'అఖిల భారత యువజన సమాఖ్య' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు నాయకత్వం వహిస్తున్న రోజుల్లో యువతరానికి ప్రేరణగా, ఉత్ప్రేరణగా నిలిచిన భగత్‌సింగ్ జీవితంపై ఒక ప్రామాణికమైన గ్రంథం రాయాలన్న పట్టుదలతో పృథ్వీసింగ్ ఆజాద్, విజయకుమార్ సిన్హా, అజయ్‌ఘోష్, శివవర్మ, యశ్‌పాల్, జయదేవ్ కపూర్, సోహన్‌సింగ్ భాక్నా, మన్మథనాథ్ గుప్తా మొదలైన విప్లవకారుల రచనలు చదివి, సోవియట్ చరిత్రకారుడు మిత్రాహన్ కృషిని పరిశీలించి, స్వాతంత్ర్యపోరాట ఘట్టాలలోని వాస్తవాల ఆధారంగా ప్రతాపరెడ్డి ఈ పుస్తకాన్ని రచించాడు. ఈ గ్రంథానికి లభించిన ఆదరణ స్ఫూర్తితో స్వాతంత్ర్య సమరవీరులు, గదర్‌వీరగాథ, చేగువేరా జీవితం ఉద్యమం: తెలంగాణ జనరణగర్జన రావి నారాయణరెడ్డి, విప్లవసేనాని ఆరుట్ల రామచంద్రారెడ్డి, తెలంగాణ పులిబిడ్డ బద్దం ఎల్లారెడ్డి, ధర్మబిక్షం జీవితచరిత్ర మొదలైన విలువైన గ్రంథాలను రచించాడు. జీవితచరిత్రల రచనలలో ఆయన కృషికి గుర్తింపుగా పొ.శ్రీ.తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్నిచ్చి గౌరవించింది. 1935 ఫిబ్రవరి 8న నల్లగొండ జిల్లాలోని జొన్నలగడ్డగూడెంలో ఎగువ మధ్య తరగతి రైతు దంపతులైన కందిమళ్ళ రంగారెడ్డి లింగమ్మల తొలి సంతానంగా ప్రతాపరెడ్డి జన్మించాడు. బాల్యం జొన్నలగడ్డగూడెంలోనే గడిచింది. దూదేకుల లాల్ మహమ్మద్ వద్ద అక్షరాలు నేర్చుకున్నాడు. ప్రాథమిక విద్య ఊళ్ళోని ఖాన్గీ బడిలో పూర్తయింది. 1947 నాటికి ఆంధ్రమహాసభ కార్యక్రమాలు జొన్నలగడ్డగూడానికి విస్తరించాయి. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా వున్న 'బాల సంఘం'లో సభ్యత్వం తీసుకున్న ప్రతాపరెడ్డి విద్యార్థి జీవితాన్ని గడుపుతూ అజ్ఞాతంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ నాయకులకు కొరియర్‌గా పని చేశాడు. 1948లో కాంచనపల్లి చినవెంకట రామారావుతో పరిచయం ఏర్పడడంవల్ల, చదువు కోసం నల్లగొండ పట్టణానికి చేరడంతో ఆయన కార్యస్థానం నల్లగొండకు మారింది. 1952లో 'భారత కమ్యూనిస్టు పార్టీ' సభ్యత్వం తీసుకున్న కందిమళ్ళ ప్రతాపరెడ్డి గత ఏడు దశాబ్దాలుగా ఒక నిబద్ధ కమ్యూనిస్టుగా, నిజాయితీకి నిలువెత్తు సంతకంగా, ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడుపుతున్నాడు. తెలంగాణా సాయుధపోరాట స్మృతులతో గంగినేని వెంకటేశ్వరరావు రచించిన 'ఎర్రజెండాలు' శుద్ధ ప్రతిని ప్రతాపరెడ్డి తయారు చేశాడు. ఉద్యమంలో కనుమూసిన వందలాది అమరవీరుల ఫోటోలు, వివరాలు సేకరించి 'రాలిన రత్నాలు' పేరిట ఒక బృహద్గ్రంథాన్ని రూపొందించాడు. 'వీరతెలంగాణ సాయుధ సమరం' ఒక ప్రామాణికమైన చరిత్ర గ్రంథం. అలాగే భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను కూడా గ్రంథస్థం చేశాడు. 1952 నాటికి కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నందున హైదరాబాద్ సంస్థానంలో 'పీపుల్స్ డెమోక్రటిక్ ఫోర్స్' (పి.డి.ఎఫ్.) పేరుతో పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేశారు. పార్టీ నాయకత్వం రహస్య జీవితంలో ఉంటూ, పి.డి.ఎఫ్ కార్యకర్తలు ప్రజల్లో పనిచేస్తూ ఉండేవారు. పార్టీపై నిషేధం తొలగించేదాకా ప్రతాపరెడ్డి 'కొరియర్'గా బాధ్యతలు నిర్వహించాడు. 1952 నాటి ఎన్నికల్లో పి.డి.ఎఫ్. అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొన్న కారణాన ఆయన్ని స్కూల్ నుండి తీసివేశారు. అప్పటికే ఆయన తల్లి మరణించడం వల్ల, ఆయన తండ్రి, పార్టీ కార్యక్రమాలు తగ్గించుకోమని ఒత్తిడి చేయడం వల్ల ప్రతాపరెడ్డి తమ స్వగ్రామానికి దూరంగా నల్లగొండ పట్టణంలో స్వతంత్ర జీవితాన్ని ప్రారంభించే నిర్ణయం తీసుకున్నాడు. ప్రముఖ న్యాయవాదులు కాంచనపల్లి చినవెంకట రామారావు, రాఘవరావుగార్ల వద్ద క్లర్క్‌గా పనిచేస్తూ, పార్టీ సాహిత్యాన్ని చదవడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం కొనసాగించాడు. 1952 ఎన్నికల ప్రచార సందర్భంగా పెద్దములుగు ఏరియా ప్రచారదళంలో ప్రతాపరెడ్డి, సుద్దాల హనుమంతు కలిసి పనిచేశారు. బుర్రకథలు చెప్పారు. తద్వారా సాహిత్య, సాంస్కృతిక రంగాలతో ప్రతాపరెడ్డికి సాన్నిహిత్యం ఏర్పడింది. 1954, 1957 ఎన్నికల దాకా నల్లగొండ జిల్లా పార్టీ ఆర్గనైజర్‌గా పనిచేసిన ప్రతాపరెడ్డి కొంతకాలం పాటు నల్లగొండ పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. 1958లో తమ కార్యస్థానాన్ని హైదరాబాద్‌కు మార్చుకొని, హైదరాబాద్ నగర కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. 1960 డిసెంబర్ 8న పార్టీ అగ్రనాయకుల సమక్షంలో ప్రతాపరెడ్డి సావిత్రిని కులాంతర, ప్రాంతాంతర, ఆదర్శ వివాహం చేసుకున్నారు. పిలారొట్టి చెంగమ్మ, మాదిరెడ్డి రంగనాధరావు దంపతులకు 1937 ఆగస్టు 17న ఐదవ సంతానంగా పుట్టిన సావిత్రికి నలుగురు అక్కలు, ఒక తమ్ముడు. మంగతాయారు (చిట్టి), గీత, లక్ష్మీ నర్సమ్మ, అమ్మణి నలుగురు అక్కలు. మాదిరెడ్డి సుబ్బారావు తమ్ముడు. ఈమె అక్క లక్ష్మీ, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి తమ్మారెడ్డి సత్యనారాయణ సతీమణి. వీరి మొత్తం కుటుంబం కులాతీత వివాహాలను చేసుకోవడమే కాకుండా, తమ కొడుకులకు, కూతుళ్ళకు, మనుమళ్ళకు, మనుమరాళ్ళకు కులాంతర, మతాంతర, ఖండాంతర వివాహాలు జరిపించి, ఒక ఆదర్శాన్ని నెలకొల్పారు. సావిత్రిప్రతాపరెడ్డి దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దమ్మాయి కందిమళ్ళ భారతి, కుమారులు అజయ్, విజయ్. ప్రతాపరెడ్డి రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలకు అంకితమై క్రియాశీలంగా బాధ్యతలు నిర్వహిస్తుండగా ఒంటిచేత్తో కుటుంబ బాధ్యతలు మోస్తూ తమ పిల్లలను విద్యాధికులుగా తీర్చిదిద్దిన ఉత్తమ ఇల్లాలు సావిత్రి. కందిమళ్ళ ప్రతాపరెడ్డి, పువ్వాడ నాగేశ్వరరావు, అడపా అప్పారావు మిత్రత్రయం అపూర్వ స్నేహానికి 70 ఏండ్లు దాటింది.

1971లో యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్ సమాధి (పంజాబ్) నుండి కేరళలోని కొచ్చిన్ దాకా యువజనుల జాతా (కాగడాల ఊరేగింపు) జరిగింది. అదే సందర్భంలో 'యువజన' పత్రిక ఇరవై సంచికలలో భగత్‌సింగ్ జీవిత కథను సీరియల్‌గా వెలువరించిన ప్రతాపరెడ్డి రచన, తరువాత గ్రంథస్థమై వేలాది మందికి ప్రేరణ కల్పిస్తున్నది. 'యువజనోద్యమ ఇతిహాసంలో...' శీర్షికన భారత స్వాతంత్ర్యోద్యమంలో అచంచల దీక్షతో త్యాగాలు చేసిన యువ దేశభక్తుల జీవితాలను పరిచయం చేస్తూ ఆయన వ్యాసాలు రాశాడు. ఈ వ్యాసాలే ఆయన తొలిరచనలు. 1974 నుండి వామపక్ష సాంస్కృతికోద్యమ నిర్మాణంలో భాగం పంచుకుంటూ 'ప్రజానాట్యమండలి' పునరుద్ధరణకు ప్రతాపరెడ్డి కృషి చేశాడు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి'ని పునరుద్ధరించి, తెలుగునేల నలువైపులా సంస్థ కార్యక్రమాలను విస్తరింపజేశాడు. వేలాదిమంది ప్రజా కళాకారులను రూపొందించడంలో నల్లూరి వెంకటేశ్వర్లుతో కలిసి కందిమళ్ళ ప్రతాపరెడ్డి చేసిన అవిశ్రాంతమైన కృషి ఒక ఇతిహాసం. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధానకార్యదర్శిగానూ, తరువాత అధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వహించిన ప్రతాపరెడ్డి ప్రస్తుతం ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ (ఇప్టా) ఉపాధ్యక్షుడిగానూ, తెలంగాణా అభ్యుదయ రచయితల సంఘం నాయకుడిగానూ, తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ కార్యదర్శిగానూ కొనసాగుతున్నాడు. తెలంగాణా సాయుధ పోరాటం ప్రేరణతో 1984లో 'వీర తెలంగాణ' (జనపదం) రచించాడు. ఇదొక జానపద ప్రజాకళారూపం. గొల్లసుద్దులు, ఒగ్గుకథ, బైండ్లవారి కథల బాణీల సమన్వయ సమ్మేళనంగా ప్రతాపరెడ్డి ఈ కళారూపాన్ని రూపొందించాడు. అనేక ప్రదర్శనలు పొందిన ఈ కళారూపం, నిజాం పరిపాలనా కాలం నాటి తెలంగాణా దుర్భర పరిస్థితులు, సంఘనిర్మాణం, సంఘ చైతన్యం మొదలుకొని సాయుధ పోరాటం దాకా ఇతివృత్తాన్ని తీసుకుని, తెలంగాణా మాండలిక భాషలో, చక్కని జానపద బాణీలతో సాగిన ఉత్తమ రచనగా ఇది ప్రశంసలు పొందింది. భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులతో, తెలంగాణ సాయుధపోరాట యోధులతో, ప్రగతిశీల రచయితలతో, ప్రజా కళాకారులతో, సినీరంగ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కలిగి వున్న ఉత్తమ కమ్యూనిస్టు, బహుగ్రంథకర్త ''కందిమళ్ళ ప్రతాపరెడ్డి జీవితంసాహిత్యం''పై తెలుగు అధ్యాపకురాలు వి.వింధ్యవాసినీదేవి చక్కని పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. 91 సంవత్సరాల వయస్సులోనూ 'భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం' మరియు 'విప్లవాల విప్లవం(గేయవాహిని)' అనే పుస్తకాలను వెలువరించారు. అలాగే 'రాలిన రత్నాలు' అన్న అపూరూపమైన గ్రంథాన్ని పునర్ముద్రించారు. సిపిఐ శతసంవత్సర ఉత్సవాల సందర్భంగా 'విప్లవవీరులు కమ్యూనిస్టు నాయకుల జీవన రేఖలు' గ్రంథాన్ని రూపొందించారు. అలాగే ప్రతాపరెడ్డి 'బందూక్' నవలానుశీలనం పేరుతో డా॥కొండపల్లి నిహారిని ఒక విశ్లేషణ గ్రంథాన్ని రూపొందించారు. 65 సంవత్సరాల వైవాహిక జీవితాన్ని ఆదర్శవంతంగా కొనసాగిస్తున్న కామ్రేడ్ ప్రతాపరెడ్డి సావిత్రి దంపతుల జీవితం, వ్యక్తిత్వం, కార్యకర్తృత్వం నేటి తరానికి, రానున్న తరాలకు స్ఫూర్తిదాయకం.

**– ఆచార్య ఎస్వీ సత్యనారాయణ**
**పూర్వ ఉపకులపతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**
**(సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం)**


> **"బహుముఖంగా విస్తరించిన సిసలైన కమ్యూనిస్టు, ఉద్యమ సాహిత్యంపై చెరగని సంతకం చేసిన కందిమళ్ల ప్రతాపరెడ్డి జీవన ప్రస్థానాన్ని ప్రస్తావించినప్పుడు, తప్పనిసరిగా ఆయన అర్ధాంగి సావిత్రి పేరును గుర్తు చేసుకొని తీరాలి. ఆయన కీర్తిసంపదలో ఆమె సహచరి మాత్రమే కాదు.. ముమ్మాటికీ 'సగభాగస్వామి' కూడా. ఎక్కడైనా... ఎప్పుడైనా ఒక రచయిత సాహిత్య జీవితంలో భార్య పాత్ర చాలా కీలకమైనది. ఆమె భూమిక వ్యక్తిగత జీవితం నుంచే కాకుండా సృజనాత్మక ప్రక్రియవరకు విస్తరించి ఉంటుంది. భర్త ఆరోగ్యాన్ని... పిల్లల సంక్షేమాన్ని కోరుకుంటూ, ఏకకాలంలో విభిన్న పాత్రను పోషించే అసాధారణ ప్రతిభ ప్రతి గృహిణికీ ఉంటుంది. అయితే, సామాజిక కార్యకర్త భర్తగా లభించినప్పుడు భారం రెట్టింపు అవుతుంది. ఆ కార్యకర్త రచయితగా మరో భిన్న రూపాన్ని ధరిస్తే, సదరు గృహిణి శారీరక, మానసిక శ్రమ వర్ణనాతీతం. అది, పది శతావధానాలకు, వంద సహస్రావధానాలకు సమానం. ఈ బాధ్యతను సావిత్రి అద్భుతంగా నిర్వహించారనడానికి ప్రతాపరెడ్డి తన జీవితాన్ని సాఫల్యం చేసుకున్న తీరే నిదర్శనం. సాహితీకారుడికి తన రచనలో ఎదుర్కొనే ఒత్తిడి, నిరాశ, విమర్శలను భరించే శక్తి భార్య నుంచే వస్తుంది. ఆమె ప్రోత్సాహం రచయితలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఈ రెండు ఆవిడలో ఉన్నాయి కాబట్టే, ప్రతాపరెడ్డి భిన్న రంగాల్లో విశ్వరూపాన్ని ప్రదర్శించగలి. రచనకు ప్రశాంతమైన వాతావరణం అవసరం. కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ, భర్తకు రచనపై దృష్టి పెట్టడానికి కావాల్సిన సమయాన్ని భార్య కల్పిస్తుంది. చాలా సార్లు భార్య స్వభావం, జీవన అనుభవాలు, సంభాషణలు రచయితకు సాహితీ వస్తువులుగా మారుతాయి. స్ఫూర్తినిస్తాయి.. కొన్ని సందర్భాల్లో భర్త రాసిన రచనలను మొదట చదివి, లోపాలు సూచించే తొలి విమర్శకురాలిగా కూడా భార్య వ్యవహరిస్తుంది. ఇది రచన నాణ్యతను మెరుగుపరచడానికి ఉపయోగపడే గీటురాయి. రచయిత తగినంత సమయాన్ని కేటాయించలేకపోయినప్పటికీ, కుటుంబాన్ని నడిపిస్తూ, సాహిత్యం సృష్టిపై దృష్టి కేంద్రీకరించేందుకు సహకరిస్తుంది. సూక్ష్మంగా చెప్పాలంటే, ఒక రచయిత సాహిత్య విజయానికి వెనుక అతని భార్య త్యాగం, సహనం, సహకారం ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఆమె లేకుండా అనేక గొప్ప సాహిత్య కృతులు పుట్టేవి కావని చెప్పవచ్చు. ఈ ఘనతను దక్కించుకున్న సావిత్రి ప్రశంసనీయురాలు... ఆమెను భర్తగా పొందిన ప్రతాపరెడ్డి ధన్యుడు. డిసెంబర్ 8న వారి 65వ వివాహ మహోత్సవ సందర్భంగా, వారి అల్లుడి రూపంలోని మిత్రుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ వ్యాసం.. మీ కోసం..**

## ఫాంటసీ రచనల చిరునామా 'హైకే'




జర్మనీలోని నాస్‌లో 1954 నవంబర్ 3న జన్మించిన హైకే ఫాంటసీ రచనలకు చిరునామాగా మారింది. భర్త ఊల్ఫ్ గాంగ్ హోల్బెయిన్‌తో కలిసి సహ రచయిత్రిగా పలు రచనలు చేసింది. బాల సాహిత్యం, ఫాంటసీ విభాగాల్లో ఆమె ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్, హారర్, యూత్ లిటరేచర్‌లో ప్రముఖ రచయిత్రిగా ఉన్న ఆమె, తన భర్తతో కలిసి రాసిన పుస్తకాలు కూడా భారీగా అమ్ముడవుతున్నాయి. చిన్నతనం నుంచి ఫాంటసీ భావాలపై ఆకర్షితురాలైన ఆమె రచనల్లో విభిన్న అంశాలు కదలాడుతూ ఉంటాయి. అయితే ఎక్కు వ శాతం బాలల రచనలకు, ఫాంటసీ కతలకు ప్రాధా న్యం ఇస్తున్నది. భర్త హోల్బెయిన్‌తవో కలిసి 1982లో రాసిన 'మ్యాజిక్ మూన్' విశేష ప్రజాదరణ పొందింది. ఈ దంపతుల ఫాంటసీ ప్రపంచంలో ఇది ఒక మైలురాయి. సహరచయిత్రిగానేగాక, హైకే స్వయంగా కూడా చాలా రనచలు చేసింది. జీవం లేని విషయాల్లో జీవితం, మాయాజాలం, కథానాయకుల ప్రయాణం వంటి అంశాలు హైకే రచనల్లో ప్రముఖంగా కనిపిస్తాయి. ఆమె భాషా శైలి సరళంగా ఉంటుంది. స్పష్టమైన మనోభావాలను ప్రకటిస్తాయి. సమకాలీన విజ్ఞాన శాస్త్ర విశేషాలను కూడా జోడించడం ఆమె ప్రత్యేకత. అందుకే, పిల్లలకు, యువతీయువకులను ఆమె రచనలు ఆకట్టుకుంటాయి. వారికి సులభంగా అర్థమవుతాయి. కాగా, భర్తతో కలిసి చేసిన రచనల్లో హైకే ఎక్కువగా కథా నేపథ్యానికి ప్రాధాన్యం ఇస్తుంది. తనకంటూ ఒక గుర్తింపు సంపాదించిన హైకే జర్మన్ ఫాంటసీ సాహిత్యంపై తనదైన ముద్ర వేసింది. ఆమె రచనలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. తద్వారా ప్రపంచ ఖ్యాతిని ఆర్జించాయి. ఆమె కథన ప్రపంచం మాయాజాలంతో కూడిన బలమైన శక్తిని కలిగి ఉందని విమర్శకులు అంటారు. ఆమె రచనలు ఎవరినైనా ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళతాయి. స్పష్టమైన భావప్రవాహంతో కానీ మాయాజాలంతో నిండిన కథలు విస్మయపరుస్తాయి.

## కొత్త భాష నేర్చుకొని.. చురుగ్గా..



ప్రతి ఒక్కరిలో, ప్రత్యేకించి యువతలో మానసిక యవ్వనం అత్యవసరం. 'కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులు' అని ఏనాడో చెప్పిన మహాకవి శ్రీశ్రీ మాటలను నిజం చేసేవాళ్లు సమాజంలో అడుగడుగునా కనిపిస్తారు. 'ఇప్పుడు ఇంకేమి నేర్చుకోగలుగుతాం' అంటూ నిరాశావాదాన్ని వినిపిస్తుంటారు. మారుతున్న కాలానికి అనువుగా తమను తాము మార్చుకోలేక, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేక వెనుకబడుతూ ఉంటారు. ఇక వయసు పెరుగుతున్న వారి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యాభై, అరవై సంవత్సరాలకు చేరుకున్న వెంటనే, సర్వం కోల్పోయినట్టు భావిస్తుంటారు. ఇక ఏమీ చేయలేమని ఒక నిర్ధారణకు వచ్చేస్తారు. అలాంటి వారు తాజా పరిశోధనలు చెప్తున్న విషయాలను ఆలకించి తీరాలి. జీవితంలో మార్పులు తెచ్చుకోవాలి. పరిశోధకుల వివరాల ప్రకారం, కొత్త భాషను నేర్చుకోవడం అనేది మానసిక యౌవనాన్ని కొనసాగించడానికి అత్యంత వేగవంతమైన మార్గం. మానవ మెదడు స్కాన్లు చూపించినట్లు పెద్దవారి మెదళ్లు కేవలం 30 రోజుల్లోనే కొత్త నాడీ సంబంధాలను ఏర్పరచి, తమను తాము తిరిగి నిర్మించుకోవడం ప్రారంభిస్తాయి. దీతో మానసిక చురుకుదనం పెరుగుతుంది. పజిల్స్ లేదా బ్రెయిన్–ట్రైనింగ్ యాప్‌లు లాగా ప్రత్యేక జ్ఞాపక నైపుణ్యాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా, భాషాభ్యాసం ఒకేసారి అనేక మెదడు ప్రాంతాలను పనిచేయిస్తుంది. పదజ్ఞానం, శబ్ద వివేకం, మనోనిబద్ధత, సమస్య పరిష్కార సామర్థ్యాలు అన్నీ కలిసి పనిచేస్తాయి. ఈ ఉద్రేకం నాడీ మార్గాలను బలపరచి, మెదడు యొక్క న్యూరో ప్లాస్టిసిటీని పెంచుతుంది. కొత్త భాష నేర్చుకుంటున్న పెద్దవారు మెరుగైన జ్ఞాపకశక్తి, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యం, అనేక పనులను ఒకేసారి నిర్వహించే ప్రతిభ చూపిస్తారు. నిరంతరంగా నెల రోజుల సాధన తర్వాత, ఎంఆర్‌ఐ స్కాన్లు మెదడులో ఎడమ, కుడి అర్ధగోళాల మధ్య సంబంధం పెరిగిందని సూచిస్తాయి. ఇది మెదడు కొత్త సమాచారాన్ని సమర్థవంతంగా ప్రాసెస్ చేయడానికి తనను తాను పునర్వ్యవస్థీకరిస్తోందని అర్థం. ఈ రీ–ఆర్గనైజేషన్ వయసుతో వచ్చే మానసిక క్షీణతను ఆలస్యం చేయడంలో సహాయపడుతుంది. భాషాభ్యాసం భావోద్రేక మేధస్సును, సామాజిక నైపుణ్యాలను కూడా పెంపొందిస్తుంది. భిన్న సంస్కృతి సందర్భాలు, భాషా సంకేతాలు, మానసిక న్యూనతలు అర్థం చేసుకోవడం ద్వారా, అభ్యాసకులు అభిమానం, వివరాలపై శ్రద్ధ, అనుకూలన శక్తిని పెంచుకుంటారు. ఈ జ్ఞాన, భావోద్రేక లాభాలు కలసి భాషాభ్యాసాన్ని జీవితాంతం మెదడు ఆరోగ్యానికి శక్తివంతమైన సాధనంగా మారుస్తాయి. మెదడు సవాళ్లు, కొత్తతనం, అభ్యాసం పట్ల వికసిస్తుంది. ఒక కొత్త భాషను నేర్చుకోవడం కేవలం విద్యా వ్యాయామం కాదు.. మనసుకు వ్యాయామం. ఇది నాడీ సంబంధాలను నిర్మించి, జ్ఞాపకశక్తిని బలపరచి, దృష్టి కేంద్రీకరణను పెంచుతుంది. కేవలం ముప్పై రోజుల పాటు నిరంతర సాధనతోనే మీ మెదడు యువ్వనంగా, చురుకుగా, ప్రతిస్పందనాత్మకంగా మారడం ప్రారంభిస్తుంది.

## చదవాల్సిన పుస్తకం

### తెలంగాణ ఆత్మను ఆవిష్కరించిన 'కందిమళ్ల'






కందిమళ్ల ప్రతాపరెడ్డిని, తెలంగాణ ఉద్యమాలను వేరువేరుగా చూడలేం. చూడకూడదు కూడా. తెలంగాణ సాయుధ పోరాటంలో సామాన్య ప్రజలు, రైతులు, దళితులు, అణచివేతకు గురైన కూలీల తరపున నిలబడి, దోపిడీదారులకు ఎదురెడ్డి పోరాటాలు జరిపిన వీరులు, అమరుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం నేటి తరానికి ఎంతైనా ఉంది. దీనికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందిస్తూ, కందిమళ్ల ప్రతాపరెడ్డి రాసిన వ్యాసాలను మాల కట్టి అందించిన పుస్తకమే 'మరవరాని మన చరిత్ర'. ఇందులోని 23 రాజకీయ, సాంస్కృతిక వ్యాసాలు తెలంగాణ ఆత్మను ఆవిష్కరిస్తాయి. తెలంగాణ సాయుధ పోరాట ఆవశ్యకతతో మొదలుపెట్టి, ప్రత్యేక తెలంగాణ వాదం ఎందుకు వచ్చింది? రాష్ట్రం ఎందుకు విడిపోయింది? అనే వివరాలతో ముగించిన మొదటి భాగంలో ఏడు వ్యాసాలు ఉన్నాయి. తెలంగాణ పోరాటం ఫ్యూడల్ దోపిడీ, దొరల అణచివేత, వెట్టిచాకిరి వంటి వ్యవస్థలకు వ్యతిరేకంగా జరిగిన సంఘటిత ప్రజా ఉద్యమం ఈ వ్యాసాలు కళ్లకు కడతాయి. దోపిడీ యంత్రాంగాలు ఎలా పనిచేశాయి? ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన కమ్యూనిస్టుల పోరాటాలు వంటి అంశాలపై లోతైన అవగాహన కలగాలంటే, వీటిని తప్పక చదవాలి. వామపక్ష దృక్కోణంలో చరిత్ర అంటే కేవలం సంఘటనల వివరాలు కాదనేది సత్యం. ఇది వర్గ సంబంధాలు, శ్రమ, దోపిడీ, అధికారం, ప్రజల అణచివేత మధ్య అంతర్లీన సంఘర్షణలు ఎలా ఉన్నాయన్నది అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతుంది. ప్రజాస్వామ్యం, హక్కుల కోసం పోరాటం పట్ల స్పృహను పెంచుతుంది. అందుకే, తెలంగాణ పోరాట చరిత్రను కమ్యూనిస్టుగా చూసిన 'కందిమళ్ల' గొప్పగా స్పందించారు. జమిందారీ నిర్మూలన, మహిళా విముక్తి, సామూహిక భూముల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలను కళ్లకుకట్టారు. ఈ వ్యాసాలు ప్రజాస్వామ్య విలువలు ఎంత కఠిన పోరాటాల ద్వారా వచ్చాయో నేటి తరం గ్రహించేందుకు దోహదపడతాయి. ప్రస్తుత సామాజిక, రాజకీయ వాస్తవాలు అర్థం కావాలన్నా, ప్రస్తుత తెలంగాణ, భారత రాజకీయాలపై అవగాహన ఏర్పడాలన్నా, ముందుగా అసమానతల గురించి తెలుసుకోవాలి. భూస్వామ్య విధానాన్ని తెలుసుకోవాలి. కుల, వర్గ సంబంధాల పరిణామాన్ని పరిశీలించాలి. అవి ఎలా ఏర్పడ్డాయో అర్థం చేసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే, ముందుగా, తెలంగాణ సాయుధ పోరాటాన్ని తెలుసుకోవాలి. నాటి పోరాటాన్ని, వీరుల త్యాగాలను చూశారుకాబట్టే 'కందిమళ్ల' తెలంగాణ సాయుధ పోరాటంపై అంత ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వగలి, ఇక రెండో భాగంలోని ఏడు వ్యాసాల్లో, విప్లవోద్యమాలకు, సాంస్కృతిక కళారూపాలు ఏ విధంగా తోడ్పాటు అందించిందీ వివరించారు. ప్రజానాట్యమండలి నుంచి శాటిలైట్ టెలివిజన్ ప్రభావం వరకూ ప్రజాకళలను, నాటకాలను, సాంస్కృతిక వికాసాన్ని ప్రస్తావించారు. తర్వాత వరుసగా, గద్దర్ విప్లవాన్ని గుర్తుచేశారు... శ్రమైక శక్తుల శంఖారావాన్ని వినిపించారు. కమ్యూనిస్టు ఉద్యమ అనుభవాలను, అవరోధాలను, అవకాశాలను వివరించారు. కమ్యూనిజాన్ని మహా విప్లవశక్తిగా ఎందుకు భాసిల్లుతున్నదో చెప్పారు. వామపక్ష భావాల వ్యాప్తిలో విద్యార్థి, యువజన సమాఖ్యలను ప్రస్తావించారు. గాంధీ, భగత్ సింగ్ వారసులెక్కడని ప్రశ్నించారు.

దార్శనికుడైన రచయిత కాబట్టే, 'నక్సల్స్ సమస్యకు చర్చల ద్వారానే పరిష్కారం' అని 1997లోనే 'కందిమళ్ల' సూచించారు. ఒకటిరెండు పర్యాయాలు జరిగిన ప్రయత్నాలు విఫలమైన వైనాన్ని మనం చూశాం. 'ఆపరేషన్ కగార్' దమనకాండను చూస్తునే ఉన్నాం. నక్సలైట్ ఉద్యమాలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) విధానాన్ని రచయిత నాటి వ్యాసంలోనే స్పష్టం చేశారు. దాదాపుగా ఇప్పటికీ పార్టీ అదే పంథాను అనుసరిస్తున్నది. 'నక్సలైట్ అంశాన్ని కేవలం శాంతి భద్రతల సమస్యగానే ఇన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం అనుకుంటున్నది. కానీ, దీనికి నాందిగా సిద్ధాంతం ఉంది. రాజకీయాలు ఉన్నాయి. ఆర్థిక సమస్యలు ఉన్నాయి. సామాజిక సమస్యలు ఉన్నాయి. ఈ నాలుగు అంశాలతో కూడుకున్నదే ఆ ఉద్యమం. అయితే, సైద్ధాంతికంగా వారు మార్క్సిజం–లెనినిజం అంటున్నారు. సమసమా జం అంటున్నారు. కనుక ఆ విషయంలో, వారితో సిపిఐకి విభేదం లేదు. రాజకీయంగా ఎత్తుగడల్లో, ఆచరణలో, అంచనా వేయడంలో మేము నక్సలైట్లతో విభేదిస్తున్నాం. ఆర్థిక, సామాజిక విషయంలో వారు చెప్పేదానితో విభేదం లేదుగానీ, వారు చెప్పే పరిష్కారాలు, ఆచరణకు సంబంధించిన విభేదాలు ఉన్నాయి' అంటారు. ఈ వివరణను అభ్యుదయ భావనలున్న మానవతావాదులంతా అంగీకరిస్తారు. అనుసరిస్తారు.

కమ్యూనిస్టుల ఐక్యతపై నేడు వామపక్ష పార్టీలన్నీ ఆలోచిస్తున్న ధోరణులు కనిపిస్తున్నాయి. ఈ అవసరాన్ని 'కందిమళ్ల' 2010లోనే 'కమ్యూనిస్టుల ఐక్యత.. నేటి కర్తవ్యం' అనే వ్యాసంలో ప్రస్తావించారు. 1952 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా వెలిగిన కమ్యూనిస్టు పార్టీ, 1957లో, దేశంలోనే మొట్టమొదటిసారి ఒక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఈ ఘనత కేరళకు దక్కుతుంది. 1962లోనూ బలంగానే ఉన్న పార్టీ 1964లో ఎందుకు చీలిపోయిందో రచయిత ఆ వ్యాసంలో వివరించారు. కనీసం 36 భాగాలుగా చీలిపోయిన వారు ఏం సాధించారని ప్రశ్నిస్తారు. ఐక్యత, విలీనానికి ఉన్న అవరోధాలను వివరిస్తారు. విలీనం ఒక్క రోజులో జరిగే ప్రక్రియ కాదని అంగీకరిస్తూనే, ఐక్యత అవసరాన్ని బలంగా చెప్తారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ఆత్మగౌరవ ఆరాటం వరకూ... విప్లవోద్యమాల ప్రస్థానం నుంచి కమ్యూనిస్టు భావజాలం వరకూ, ఎన్నో అంశాలను ప్రస్తావించిన 'కందిమళ్ల' ధన్యుడు. 'మరవరాని మన చరిత్ర' ఒక గొప్ప సమాచార భాండాగారంగా ఎప్పటికీ నిలిచిపోతుంది. తెలంగాణవాదులు... సమసమాజ ప్రేమికులు... అక్రమాలను నిరసించే మానవతావాదులు... వాస్తవ చరిత్రను తెలుసుకోవాలన్న కుతూహలం ఉన్నవారు... ఇలా, ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం ఇది.

**పుస్తకం పేరు**

మరవరాని మన చరిత్ర (రాజకీయ సాంస్కృతిక వ్యాసాలు)
రచయిత: కందిమళ్ల ప్రతాపరెడ్డి
వెల: రూ. 200

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

**ఈ వారం కవితలు**

## గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్..

ఎన్నికలోయ్ ఎన్నికలోయ్
గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్....
పద్దెనిమిదేళ్ళు నిండాయంటే
ఓటు హక్కును పొందాలోయ్
పనుల ఒత్తిడి ఉన్నా కానీ
ఓట్లు తప్పక వేయాలోయ్
ఎన్నికలోయ్ ఎన్నికలోయ్
గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్...
పార్టీ లెన్ని వచ్చిన గాని
పనిచేసే నాయకుడికీ ఓటు
వేయాలోయ్...
ఓటుకు నోటు ఎవరన్నరంటే
పొలిమేర అవతల తరమాలోయ్
ఎన్నికలోయ్ ఎన్నికలోయ్
గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్
మాటల గారడీ పడిపోకుండా
మహనీయుల మాటల వైపు
ఉండాలోయ్...
లాభనష్టా బేరిజు వేయాక
నిజాయితీపరులను గెలిపించాలోయ్
ఎన్నికలోయ్ ఎన్నికలోయ్
గ్రామ పంచాయతీ ఎన్నికలోయ్....



**– నరేష్ జాటోత్**
**8247887267**

## సర్పంచ్‌ల వేలం పాటలు

పల్లవి: సూడు చెల్లెమ్మా సూడు చెల్లెమ్మా
పంచాయతీ ఎన్నికలు సూడు చెల్లెమ్మా

పంచాయతీ ఎన్నికల్లో ఓటర్ల జాడలేదు
సంతలోన సరుకులాగ సర్పంచ్‌ల పదవులాయే
పోటీలోన నెగ్గినోడు సర్పంచ్ అయిపోయే
గ్రామ సర్పంచ్ అయిపోయే
పాంచ్ సాల్ సర్పంచ్ పదవి
ఏక్ బార్! దో బార్! తీన్ బార్ సర్పంచ్ బన్గయా!

వినాయకుడి లడ్డులా వేలమేస్తున్నరు
అవినీతిపరులంతా పోటీపడుతున్నరు
ఓటింగ్ లేకుండా నోట్లతో కొంటున్నరు
ప్రజాస్వామ్య పాలనను పాతరేస్తున్నరు

ఇక ముందు మన ముందు అంబానీ,
అదానీ ప్రధాని పదవినే కొంటరు
దేశ సంపదనంతా కొల్లగొడుతరు

చదువుకున్న యువతరం ఏమి జేస్తున్నది
ఊరిలోని ఓటర్లు ఎందుకు ఎదిరించరు?
ఎలక్షన్ కమిషన్ ఎక్కడ దాగున్నది
వేలంలో కొంటే ఇక ఎలక్షన్స్ ఎందుకు
ఓటు హక్కు ఎందుకు? ప్రజాస్వామ్యమెందుకు.?
ఓటు హక్కు కలిగినట్టి
ప్రతి పౌరుడు ప్రశ్నించి
ప్రజాస్వామ్య పాలనను
కాపాడగ కదలండి

**– గడ్డమీది చంద్రమోహన్ గౌడ్**
**9866510399**

## రాముల వారికి ఇప్పటికీ వనవాసం తప్పడం లేదు : మాధవీ లత

ప్రజాపక్షం/భద్రాచలం : రాజకీయ రణరంగంలో రామయ్యకు నేటికి కూడా వనవాసం తప్పడం లేదని తెలంగాణ రాష్ట్ర బిజేపి అధికార ప్రతినిధి మాధవీ లత ఆరోపించారు. ఆదివారం స్థానిక గోదావరి ఇన్ ఫంక్షన్ హాల్లో బిజేపి బలపరిచిన టిడిపి, జనసేన మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా భరిలో ఉన్న హరిచంద్ర నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ జరిగిన విలేకరుల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గత బిఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలాభివృద్ధిని గాలికి వదిలేశారని, ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర విడుదల చేసిన గ్రామపంచాయితీల అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. దేవాలయాలను అనుసందానం చేసే క్రమంలో బిజేపి ఒడిస్సా నుండి పాండురంగాపురం వరకు రైల్వే లైను నిర్మించేందుకు టెండర్లు పిలిచిందని చెప్పారు. కేంద్రంలో ఉన్న బిజేపి సర్కార్ శ్రీరాముడు నడయాడిని దక్షిణ అయోధ్య భద్రాచలాన్ని అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

## ములకలపల్లిలో ఎన్నికల వేడి

ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలంలో పంచాయతీ ఎన్నికల వేడి మొదలైంది. ములకలపల్లి మండలంలో మొత్తంగా 20 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో చాపరాలపల్లి గ్రామ పంచాయితీకి ఎన్నికలకు నిలుదల చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులను హైకోర్టు ఆదేశాల మేరకు జారీ చేశారు. కాగా ములకలపల్లి మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ 19 గ్రామ పంచాయితీలకు గాను 115 మంది సర్పంచ్ అభ్యర్థులుగా తమ నామినేషన్లను వేశారు. కాగా అందులో 46 మంది సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్‌లను విత్‌డ్రా చేసుకున్నారు. అయితే మండలంలోని పొగళ్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డులు ఏకగ్రీవంగా అయ్యాయి. ఈ క్రమంలో 18 గ్రామ పంచాయతీలకు గాను 68 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. అదే విధంగా 19 గ్రామ పంచాయతీలకు గాను 178 వార్డులకు గాను 467 మంది వార్డు అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. అయితే అందులో 65 మంది వార్డు సభ్యులుగా విత్‌డ్రా చేసుకొనగా, మరో 34 వార్డులు ఏకగ్రీవంగా అయ్యాయి. కాగా 368 మంది వార్డు అభ్యర్థులుగా పోటీలో ఉన్నారని ఎంపీడీవో రామారావు తెలిపారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న సిపిఐ



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆళ్లపల్లి గ్రామ పంచాయతీ సిపిఐ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మెస్సు మమత విజయమే లక్ష్యంగా ఆళ్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటర్‌తో మమేకమై ఆప్యాయంగా పలకరిస్తూ వారి ఆశీర్వాదాలు తీసుకుంటూ తమకు ఓటు వేయమని మెస్సు మమత అడిగారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఆళ్లపల్లి గ్రామానికి చెందిన ఎస్.కే. సాబీర్ పాషా మన ఊరుకి చేస్తున్నటువంటి సేవలను ప్రజలకు రేసు ఎల్లయ్య గుర్తు చేశారు. అదే విధంగా సబ్బండ వర్గాలకు న్యాయం జరగాలన్న, సమ సమాజాన్ని స్థాపించాలన్న, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలన్న సిపిఐ పార్టీ అధికారంలో ఉండాలని వారు ప్రజలకి తెలిపారు. వార్డు అభ్యర్థులు చింత సునీత, గౌరబోయిన సీత, గలిగ ప్రశాంతి, తాటి సంధ్యారాణి, కుంట సహదేవ్ వారి వార్డులలో ప్రజలను కలుస్తూ తమను గెలిపించాలమని కోరారు. ఆళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ గుంతోజు సదానంద చారి, మద్దెల వెంకటేశ్వర్లు, కుంట సహదేవ్, పరమ ఇమ్మానేయులు, శ్రీరామ్ హరీష్, నరెడ్ల బిక్షం, నరెడ్ల శివ, గుంతోజు శివ, నరెడ్ల రాంబాబు, సిపిఐ పార్టీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## అభివృద్ధి,సంక్షేమాన్ని ఆశీర్వదించండి

### మాజీ సర్పంచ్ కళ్లెం వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : గుండు శ్రావణిశ్రీనివాస్ ఉంగరం గుర్తుపై ఓటు వేసి అభివృద్ధిసంక్షేమాన్ని ఆశీర్వదించాలని, బిఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ కళ్లెం వెంకట్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడులోని ఊటవాగుతండలో సర్పంచ్ అభ్యర్థి గెలుపుపై ముమ్మర ప్రచారాన్ని నిర్వహించారు. సర్పంచ్‌గా శ్రావణిని ఆశీర్వదిస్తే, మీరు చెప్పిన సమస్యలన్ని పూర్తి చేపి ంచే భాద్యతనాదేనన్నారు. చెప్పుకుంటున్నని కాదు కానీ ఈ ప్రాంతంలో ఎటువంటి హామీలు ఇవ్వని, పనులతో పాటు అనేక అభివృద్ధి, సంక్షేమపథకాలను అమలు చేసినట్లు వివరించారు. ప్రజల తలలో నాలుకలా పిలిస్తే పలికే సర్పంచ్ అభ్యర్థినికి పట్టం కట్టాలన్నారు. ప్రధానంగా డ్రైనేజీలు, సీసీరోడ్డు, పొలాల, గ్రామాలలోకి వెళ్లే లింక్‌రోడ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అలాగే 10వ వార్డు మెంబర్ వెలుతూరి సతీష్ గ్యాస్ పోయి గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోళ్లపాడు గ్రామశాఖ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, వస్తువులు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, వస్తువులు పంపిణీ చేశారు. ఆదివారం మండల పరిధిలోని రఘునాథపాలెం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రానికి సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి వైస్ ప్రెసిడెంట్ ఏనుగు శివరాఘవ మాతృమూర్తి భవాని జ్ఞాపకార్థం అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు, చాపలు, కూలింగ్ వాటర్ క్యాన్, రైస్ కుక్కర్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బాధ్యులు మాట్లాడుతూ సన్‌రైజ్ సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ సేవా సంస్థ బాధ్యులకు అంగన్‌వాడీ టీచర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ మాలతి దాస్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్‌బాబు, ఏనుగు కిరణ్‌బాబు, అంగన్‌వాడీ టీచర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ కోడ్ పాటించాలి

### ఎన్నికల వ్యయ పరిశీలకులు లావణ్య

ప్రజాపక్షం/భద్రాచలం : గ్రామపంచాయితీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికల వ్యయ నియమావళిని కచ్చితంగా అనుసరించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు లావణ్య అన్నారు. స్థానిక ఎన్నికలను పురస్కరించుకుని దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో నోడల్ ఆఫీసర్ ఎన్‌వి రెడ్డితో కలిసి పర్యటించారు. ఆయా ఎంపిడిఓ కార్యాలయాలను సందర్శించి ప్రతీది కుణ్ణంగా పరిశీలించారు. పట్టిన ప్రతీ ఖర్చు పూర్తి లావాదేవీలతో తగిన ఆధారాలతో నమోదు చేయాలని, సమయానుసారంగా రిపోర్టులు సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. పారదర్శకత అత్యంత ముఖ్యమని, ఏమైనా లోపాలుంటే తక్షణమే సరిదిద్దాలన్నారు. ఎన్నికల వ్యయబృంధాలు, సంబంధిత విభాగాధికారులు పాల్గొన్నారు.

## 50 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక

### 1975 టిటిసి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

ప్రజాపక్షం/ ఖమ్మం : వారంతా 50 సంవత్సరాల క్రితం ఒకేచోట శిక్షణ పొందారు. అంతేకాదు టీచర్ ట్రైనింగ్ సర్టిఫికేట్ (టిటిసి)కు సంబంధించి ఖమ్మం జిల్లాలో వారిదే మొదటి బ్యాచ్. వీరంతా ఉపాధ్యాయులుగానే కాకుండా ప్రభుత్వ రంగంలో వివిధ విభాగాలలో సుదీర్ఘకాలం సేవలు అందించి పదవీ విరమణ చేసిన వారు.వివరాల్లోకి వెళితే 1975 1976లో మొదలైన టిటిసి శిక్షణ మొదలు కాగా తొలి బ్యాచ్ అపూర్వ కలయిక ఆదివారం ఖమ్మం నగరంలోని శుభవేళ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. హాజరైన మిత్రులందరికీ జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. ఇందులో కొందరు ఉపాధ్యాయ వృత్తితో ప్రారంభమై జాయింట్ కలెక్టర్ స్థాయికి ఎదిగిన వారు కూడా ఉండటం గమనార్హం. ఈ కార్యక్రమానికి అలపాటి అంకుప్రసాద్ అధ్యక్షత వహించగా నాటి టిటిసి బ్యాచ్ ప్రముఖులు బుర్లె లక్ష్మి నారాయణ, ఎస్. కామేశ్వరరావు, ఎ. రాఘవరావు, కనపర్తి వెంకటేశ్వర్లు, పి. కోటేశ్వరరావు, ఎ. రవీంద్రబాబు, ఫణీంద్రకుమారి, బద్రుద్దీన్, హెచ్‌విఎల్ ప్రసాద్‌బాబు, శ్రీరామశాస్త్రి పాల్గొన్నారు.



# మల్లవరంలో హోరెత్తిన కాంగ్రెస్, సిపిఐ ప్రచారం

### ప్రచారంలో పాల్గొన్న మల్లు నందిని, బాగం హేమంతరావు



ప్రజాపక్షం/ ఖమ్మం/ మధిర : మధిర మండలం మల్లవరం గ్రామంలో ఆదివారం సిపిఐ, కాంగ్రెస్ నేతలు ప్రచారాన్ని హోరెత్తించారు. కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మందడపు రాణి విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మల్లు నందిని, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మందడపు రాణిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ దశాబ్ద కాలంగా మల్లవరం గ్రామం అభివృద్ధిలో పూర్తిగా వెనకబడి పోయిందని ఆమె తెలిపారు. అధికార పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వం నుండి అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన అందరికీ అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. మల్లవరం గ్రామాభివృద్ధి బాధ్యతను, సంక్షేమ కార్యక్రమాల అమలును తాను స్వయంగా పర్యవేక్షిస్తానని సిపిఐ అభ్యర్థిని మంచి మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించి కానీ తమను నేరుగా కలవచ్చునని ఆమె తెలిపారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే మందడపు రాణిని సిపిఐ వార్డు సభ్యులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్, సిపిఐ ఐక్యంగా పని చేస్తూ ముందుకు సాగుతున్నాయని దాదాపు గెలుపు ఖాయమైందని మెజార్టీ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. అవిశ్రాంతంగా పని చేయాలని ఆయన కాంగ్రెస్, సిపిఐ కార్యకర్తలను కోరారు. కె.రాంబాబు, దుర్గాభవాని, సిపిఐ, కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం భారీ ర్యాలీ



ప్రజాపక్షం/కల్లూరుః కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పేరు వంచలో భారీ ర్యాలీ నిర్వహించారు.శాసన సభ్యురాలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని 17వ తేదీన జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ , వార్డు అభ్యర్థులను గెలిపించి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. గ్రామంలో కుక్కలు, కోతులు బెడద నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. పేరు వంచ గ్రామంలో సిసి రోడ్లు, వడ్డీ లేని రుణాలు ప్రమాద బీమా రేషన్ కార్డులు సన్న బియ్యం సన్నధాన్యానికి బోనస్ ఇందిరమ్మ ఇండ్లు అనేక రకాల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయని ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆ విధంగా రాబోయే రోజుల్లో ఇంకా పథకాలను అందజేస్తామని పేర్కొన్నారు. కనుక గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ బలపరిచిన వ్యక్తులను గెలిపించినట్లయితే గ్రామాలను అభివృద్ధి పథంలో ముందు ఉంచుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ తో పాటు నాయకులు పసుమర్తి చందర్‌రావు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏకగ్రీవ పంచాయతీ సర్పంచ్‌ల ప్రమాణస్వీకారం

### ఆజయతండాలో కోరం వాయిదా పడ్డ ఉప సర్పంచ్ ఎన్నిక

ప్రజాపక్షం/నేలకొండపల్లి : పంచాయతీ ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్లు ఆదివారం ప్రమాణాస్వీకారం చేయించారు. మండలంలోని ఆచార్లగూడెం పంచాయతీలో ఆదివారం ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. తొలుత ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.నాగేశ్వరరావు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. పంచాయతీ వార్డు స భ్యుడు ఆనం బస్విరెడ్డి నామినేషన్ వేశారు. 4వ వార్డు సభ్యుడు పులిమి వీరారెడ్డి ప్రతిపాధించారు. 7వ వార్డు సభ్యుడు గోళ్ల హనుమంత్ బలపరిచారు. దీంతో ఉప సర్పంచ్ గా ఎన్నికయ్యారు. సర్పంచ్ ఉప్పలమ్మతో పాటు, సభ్యులు కూడ ప్రమాణాస్వీకారం చేశారు.అమరబోయిన బిక్షం, మార్తి గురవయ్య, సైదులు, రామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఆజయతండాఉప సర్పంచ్ ఎన్నిక కు కోరం లేక వాయిదా ప డింది. సర్పంచ్ తేజావత్ శివాజీ ప్రమాణాస్వీకారం చేశారు. కట్టుకాచారం లో ఉప సర్పంచ్ గా నెల్లూరి మోహనరావు ను ఎన్నుకున్నారు. సర్పంచ్ బాణావత్ సైదులు ప్రమాణాస్వీకారం చేశారు.

# వెంకటాయపాలెంలో త్రిముఖ పోటీ...

### సిపిఐ నుంచి శాఖమూరి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో త్రిముఖ పోటీ నెలకొంది. సిపిఐ, కాంగ్రెస్ ల మధ్య హోరా హోరిగా పోరు కొనసాగుతుండగా బిఆర్ఎస్ కూడా పోటీనిస్తుంది. ఇది బిఆర్ఎస్ చివరి వరకు పోటీలో ఉంటుందా లేదా అన్న సందిగ్ధం ఓటర్ల మదిలో నెలకొంది. సర్పంచ్ స్థానానికి సిపిఐ, కాంగ్రెస్, బిఆర్ఎస్ తరుపున పోటీ పడుతున్నారు. సిపిఐ నుంచి శాఖమూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నుంచి కాపా ఆదినారాయణ, బిఆర్ఎస్ నుంచి కుతుంబాక నరేష్ లు పోటీ పడుతుండగా 12 వార్డులకు మూడు పార్టీల తరుపున అభ్యర్థులు పోటీ లో ఉన్నారు. ప్రధానంగా సిపిఐ కాంగ్రెస్ ల మ ధ్య పోటీ ఉండగా బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థి కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులు గ్రామంలో విస్తృతంగా ప్ర చారం నిర్వహిస్తున్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ గెలిపిస్తే చేపట్టనున్న పనులను వివరిస్తూ సుపరిపాలనకు ఓటేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అభివృద్ధిని వివరిస్తూ ఇప్పుడు గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి చేపడతానో ప్రచారంలో వివరిస్తూఓట్లు అభ్యర్థిస్తున్నారు. నరేష్ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి నివివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీ ల మధ్య హోరాహోరీ పోరు సాగుతుండగా సిపిఐకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది.

## డిజిటల్ ప్రచారంలో అభ్యర్థులు.. 'అన్నీ ఫోన్‌లోనే'!

ప్రజాపక్షం/ ఖమ్మం : కాలం మారింది శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని రంగాల్లోనూ వినియోగించుకున్నట్లే పల్లె పోరులోనూ డిజిటల్ ప్రచారమే ముందు వరుసలో నిలిచింది. బరిలో నిలిచిన అభ్యర్థులు వారి మద్దతుదారులు డిజిటల్ ప్రచారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. ఎన్నికలు మొదలైన తొలి నాళ్లలో ఇంటింటికి తిరిగి ఓటు అ డిగే వారు. పంచాయతీ ఎన్నికల్లోనైతే ఎంత మంది అభ్యర్థులు బరిలో ఉంటే అన్ని పోలింగ్ బాక్స్‌లను ఏర్పాటు చేసేవారు. ఎవరి మద్దతు దారులు ఆ యా అభ్యర్థుల బాక్స్‌ల్లో చిట్టిలు వేసే వారు. వా టిని లెక్కించి విజేతలను తే ల్చేవారు. ఆ తర్వాత గు ర్తులు వచ్చాయి. గుర్తులను తెలియజేస్తూ గోడల మీద రాసేవారు. తర్వాత కాలంలో గోడ పత్రాల తో గుర్తులు, వివరాలను తెలియజేస్తూ ఇంటింటికి తిరిగి అంటించే వారు. గత పంచాయతీ ఎన్నికల వరకు ఇదే తంతు నడిచిన ప్రస్తుతం మాత్రం డిజిటల్ ప్రచారంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారం సాగిస్తున్నారు. దశాబ్ద కాలంలో సెల్ ఫోన్ వినియోగం విపరీతంగా పెరిగింది. కుటుంబంలో ఎంత మంది సభ్యులుంటే దాదాపు మేజర్లందరికీ మనిషికో సెల్‌ఫోన్ ఉంది. వినియోగించే ఫోన్లలో 90 శాతానికి పైగా ఆండ్రాయిడ్ ఫోన్లను ఉపయోగించడంతో పాటు వాట్సాప్, ఫెస్‌బుక్‌లను వాడుతున్నారు. ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయతీల్లోని ఓటర్ల సెల్ ఫోన్ నెంబర్లను సేకరించి గ్రూపులుగా ఏర్పాటు చేసి గంటకో మారు సమాచారాన్ని పంపిస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థి వివరాలు, ఎన్నికల గుర్తును ఫోన్ ద్వారా ఓటర్లకు చేరవేయడంతో పాటు ఓటర్లను అభ్యర్థిస్తూ వా యిస్ మేసేజ్‌లను పంపుతున్నారు. గెలిపిస్తే గ్రా మంలో తాము చేపట్టబోయే పనుల వివరాలను సెల్‌ఫోన్‌లోనే ఏకరువు పెడుతున్నారు. వార్డు అభ్యర్థులుగా నిలిచిన వారు సైతం ఇదే పద్దతిని అనుసరిస్తున్నారు. ఎన్నికల గుర్తును ఓటరుకు చేరవేసేందుకు అతి సునాయాస మార్గంగా ఇప్పుడు డిజిటల్ ప్రచారం వెలుగులోకి వచ్చింది.పార్టీ నేతల సహచర్యం తదితర విషయాలతో పొందుపర్చిన వీడియోలకు అద్భుతమైన పాటలను సెట్ చేసి జనంలోకి వదులుతున్నారు. అన్నింటికి మించి ఎన్నికలంటే ఇప్పుడు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తులమో ఫలమో అప్పగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదివరకు క్వార్టర్ మందు మొ దలు నగదు అడగాలన్న బ రిలో నిలిచిన అభ్యర్థి ఇంటి ముందు పడాగాపు లు కాయాల్సి వచ్చేది. ఇ ప్పుడు ఆ అవసరం లే దు మద్యానికైనా లేదా నగ దు ఇచ్చేందుకైనా డిజిటల్ చెల్లింపులు జరిగిపోతు న్నాయి. ప్రచారం సులువైందని అభ్యర్థులు పేర్కొనడం విశేషం.

## అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గ్రామాల్లో అభివృద్ధి కోసం కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం రఘునాథపాలెం మండలంలోని కెవి బంజర, మూలగూడెం, రజబ్అలీ నగర్, ఎన్‌వి బంజర, పంగిడి, పాపటపల్లి, జికె బంజర, విఆర్ బంజర, చిమ్మపుడి, కోటపాడు, కోయచలక గ్రామాల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందని తెలిపారు. సుస్థిర పాలనకు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్దితో పని చేస్తుందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాధాకిషోర్, బోయనపల్లి లక్ష్మణ్ గౌడ్, ఊయ్యూరు వెంకటనారాయణ, బాతుల సుధాకర్, చెరుకూరి పూర్ణచందర్‌రావు, మాధంశెట్టి హన్మంతరావు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి బిఆర్ఎస్ అభ్యర్థులను బలపరచండి

### ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఆదివారం మండల పరిధిలోని కోటపాడు, కోయచలక గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో పదేళ్ల కాలంలో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి త్రాగునీటిని అందించినట్లు తెలిపారు. చెరువులను పునరుద్దరించి భూ గర్భ జలాలను పెంచినట్లు తెలిపారు. పింఛన్లను పెంచిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలోనే అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. మరల వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. కోటపాడు, కోయచలక గ్రామాల్లో బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా రవి, మాధంశెట్టి హరిప్రసాద్, కొంటెముక్కుల వెంకటేశ్వర్లు, వడ్డే ప్రసాద్, చెరుకూరి భిక్షమయ్య, వెంకటేశ్వర్లు, శివయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## డబ్బు దొంగలు వస్తారు జాగ్రత్త

### ఆదరించండి అభివృద్ధి చేస్తా : సర్పంచ్ అభ్యర్థి మానె

ప్రజాపక్షం/భద్రాచలం : గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో కొందరు డబ్బుతో ఓటర్లను కొనేందుకు వెంపర్లాడుతున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని బిఆర్ఎస్ సీనియర్ నేత రావులపల్లి రామ్ ప్రసాద్ అన్నారు. సిపిఎం, గోండ్వానా దండకారణ్య పార్టీ, ఆదివాసీ జేఏసి మద్దతిస్తున్న బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ, వార్డు అభ్యర్థులు విజయాన్ని కాంక్షిస్తూ భద్రాచలం పట్టణంలోని 17,18,19 వార్డుల్లో ఆదివారం ఆయన పర్యటించారు. రావులపల్లి ముఖ్యాతిథిగా హాజరై ప్రసంగించారు. భద్రాచలం పట్టణానికి రామకృష్ణ సర్పంచ్‌గా ఉంటేనే శ్రీరామ కృష్ణ అని పేర్కొన్నారు. ఇప్పటికే మానే విజయం ఖరారైందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు అంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి మానె రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా అయ్యే అవకాశాన్ని తనకు ప్రజలు కల్పించాలని, ఈ ఎన్నికల్లో ఓటేసి ఆశీర్వదించాలన్నారు భద్రాచలం ప్రాంత అభివృద్ధికి ఇప్పటికే మ్యానిఫెస్టో తయారు చేయడం జరిగిందని, తమ కూటమి ఎంతో ఆలోచించి ఈ నిర్ణయాన్ని తీసుకుందన్నారు. సర్పంచ్ గా గెలిపిస్తే అభివృద్ధి చేసి తీరుతామని అన్నారు.అదే విధంగా మానె గెలుపుని కాంక్షిస్తూ దళిత జేఏసి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

## 27వరకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల ఫీజు గడువు

ప్రజాపక్షం/పాల్వంచ : బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి సెమిస్టర్ పరీక్షల ఫీజు సకాలంలో చెల్లించాలని ఈ నెల 27 చివరి తేదీ అని పాల్వంచ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల లెర్నింగ్ సెంటర్ లో డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం మూడవ సెమిస్టర్, తృతీయ సంవత్సరం ఐదవ సెమిస్టర్ లకు గాను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, పరీక్ష ఫీజులను ఈ నెల 27వరకు చెల్లించాలని అన్నారు. లేదా 500 ఫైన్‌తో జనవరి రెండు వరకు, రూ. 1000/లతో జనవరి ఏడు వరకు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. పరీక్షలు ఫిబ్రవరి 7వ, తేదీ నుండి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

# ఊరుకో తీరు.. వార్డుకో రీతి!

- గెలుపే లక్ష్యంగా పొత్తులు, ఎత్తులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు

ప్రజాపక్షం/ ఖమ్మం : ఎన్నికలంటే సహజంగానే రాజకీయ పార్టీలు గుర్తుకొస్తాయి. రాజకీయ పార్టీలకు సంబంధించిన పార్టీల గుర్తులు ఉన్నా లేకపోయినా స్థానిక సంస్థల మొదలు ఏ ఎన్నికలైనా రాజకీయ పార్టీలే ఎన్నికలను నడిపిస్తుంటాయి. సహజంగానే భావసారూపత్యత కలిగిన పార్టీల మధ్య లేదా సైద్ధాంతిక అవగాహనతో పని చేసే పార్టీల మధ్య పొత్తులు కుదుర్చుకోవడం సహజమే. కానీ ఈ దఫా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏ పార్టీ ఏ పార్టీతో కలిసి పని చేస్తుందో అర్థం కాని గందరగోళ పరిస్థితి నెలకొన్నది. ఊరుకో తీరుగా పొత్తులు కుదుర్చుకున్నారు. విపక్షం, అధికార పక్షం అనే తేడా లేకుండా పొత్తులు కుదుర్చుకుని పంచాయతీ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. అధికార కాంగ్రెస్‌తో విపక్ష బిఆర్ఎస్ పలు పంచాయతీలలో జట్టు కట్టింది. ఇరువురు ఒప్పందం చేసుకుని నీకో పదవి నాకో పదవి అన్న రీతిలో పంచుకుంటున్నారు. అలాగే రాజకీయ పార్టీలకు అతీతంగా అభ్యర్థులను బరిలో దింపుతున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో అన్ని రాజకీయ పార్టీలు ఏకమై స్వతంత్ర అభ్యర్థుల మీద ఉమ్మడి అభ్యర్థిని పెట్టిన పరిస్థితులు కూడా నెలకొన్నాయి. కమ్యూనిస్టులంటే ఆమడ దూరంలో ఉండే బిజెపి కూడా పలు చోట్ల వామపక్షాల అభ్యర్థులకు మద్దతునిస్తుండటం గమనార్హం. కాంగ్రెస్‌తో టిడిపి, కాంగ్రెస్‌తో బిఆర్ఎస్, సిపిఐతో సిపిఎం, సిపిఐతో బిఆర్ఎస్, బిఆర్ఎస్‌తో టిడిపి, వామపక్షాలతో బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఇలా సిద్ధాంతాన్ని పక్కన పెట్టి పంచాయతీలలో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నాయి. అభ్యర్థుల ప్రచారంలో కొన్ని గ్రామాల్లో అన్ని పార్టీల జెండాలను ప్రదర్శిస్తూ ఆశ్చర్య చకితులను చేస్తున్నారు. ఎవరితో ఎవరు కలిసిన గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్న ఉమ్మడి లక్ష్యంతో గ్రామ పంచాయతీల్లో రాజకీయం వేడెక్కింది. ఇప్పటికే ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరుకు బరిలో నిలిచిన అభ్యర్థులు గుర్తులను చేరవేశారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పలు మార్గాలను అన్వేషిస్తున్నారు. ముఖ్యంగా మద్యం పంపిణీ జోరుగా సాగుతుంది. నామినేషన్ల పర్వం నుంచి ప్రారంభమైన మందు పంపిణీ ఎన్నికలు పూర్తయ్యే వరకు కొనసాగించక తప్పదని అభ్యర్థులు వాపోతున్నారు. శాసనసభ ఎన్నికల్లో నిలబడిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇంటింటికి తిరిగి నగదు పంపిణీ చేయడంతో ఇప్పుడు కూడా ఓటుకు ఖరీదు కడితేనే పోలింగ్‌కు వచ్చే పరిస్థితి ఏర్పడింది. దీనితో బరిలో నిలిచిన అభ్యర్థులు తల తాకట్టు పెట్టయినా ఖర్చు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది.

## ఉత్తమ సేవలందించి హోంగార్డు రాంబాబుకు ప్రశంసపత్రం

ప్రజాపక్షం/ఖానాపూర్: వరంగల్ 63 హోంగార్డు అవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు సత్కారం జరిగింది. విధుల్లో విశేష సేవలు అందించిన హోంగార్డు ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాంబాబును గుర్తించిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఏసిపి



నాగయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నేను నాయకురాలిని కాదు మీ ఇంటి ఆడబిడ్డను

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంకిడి శ్రీలత



ప్రజాపక్షం/గోవిందరావుపేట: తాడ్వాయి మండలం బందాల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మంకిడి శ్రీలత బరిలో నిలిచారు వివరాల్లోకి వెళ్తే నర్సాపూర్ గ్రామానికి చెందిన మంకిడి శ్రీలత స్థానిక పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల్లో నామినేషన్ల కౌంటర్లో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా అభ్యర్థి మంకిడి శ్రీలత మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నా కుటుంబ నేపథ్యం నుండి బరిలోకి దిగిన నేను గ్రామాభివృద్ధికి తోడ్పడుతానని గ్రామంలో అన్ని సామాజిక వర్గాలను సమన్వయంతో కలుపుకోని గ్రామాభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని గ్రామ ప్రజలు ఈసారి తమకు ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## పంచాయతీ పోరులో బిసి అభ్యర్థినే గెలిపించాలి :వేణుగోపాల్ గౌడ్



ప్రజాపక్షం/బీమదేవరపల్లి : ముల్కనూర్ గ్రామ సెంటర్‌లో ఆదివారం బహుజన ముఖ్య నాయకులు సమావేశం బిసి జెఎసి ముల్కనూర్ మండల అధ్యక్షులు మండల సురేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బిసి జెఎసి వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పి, బిసిల ఓట్లను దండుకొని, అధికారంలోకి వచ్చాక బిసిలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ, పార్టీ పరంగానైన 42 శాతం రిజర్వేషన్లను కల్పించకపోవడం, బిసి అభ్యర్థులు పోటీచేసిన చోట రెడ్డి అభ్యర్థులను నిలబెట్టి, రెడ్ల రాజ్యం కోసం ఆరాటపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలంటే 90 శాతం ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ, సమాజమంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, ముల్కనూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బిసిల ముద్దుబిడ్డ దార్న శ్రీనివాస్‌కు బహుజన సమాజమంతా మద్దతు తెలిపి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సోదరులను గెలిపించుకోవడం ద్వారా మన ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. బిసి విద్యావంతులు వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ ఏ పార్టీ నుండైన నిలబడిన బహుజన సోదరులను రాష్ట్రవ్యాప్తంగా గెలిపించుకొని బహుజన సమాజం సత్తా చాటాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. బిసి విద్యావంతులు వేదిక హన్మకొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చందా మల్లయ్య, మాజీ జెడ్‌పిటిసి వంగ రవీందర్ గౌడ్, బిసి జెఎసి జిల్లా నాయకులు కాసగాని అశోక్ గౌడ్, ఛాతిళ్ళ కమలాకర్, సంగ సంపత్ యాదవ్, మండల సురేందర్ , అప్పని పద్మ, నవాబ్ పాషా, శనిగరపు సదానందం, ధర్నా మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు

## రెండో విడత మండలాల్లో ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రజాపక్షం/హనుమకొండ: హనుమకొండ జిల్లాలో రెండో విడతలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగే ఐదు మండలాలకు ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. ఆదివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో రెండో విడత మండలాల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసిన అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో రెండో విడతలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే ఐదు మండలాలైన ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా రాండమైజేషన్లో పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. రెండో విడత ర్యాండమైజేషన్ లో పోలింగ్ అధికారులు(పీవో ప్రిసైడింగ్ ఆఫీసర్స్ ) 789, ఇతర పోలింగ్ అధికారులు (ఓపివో )1154లను ఆయా మండలాలకు కేటాయించినట్లు తెలిపారు. రెండో విడత మండలాలకు 1943మంది పీవో, ఓపివోలను కేటాయించగా, పోలింగ్ సిబ్బందికి భోజన వసతి కల్పించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జడ్పీ సీఈవో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గెలుపు బాటలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి కృష్ణ



ప్రజాపక్షం/గోవిందరావుపేట : తాడ్వాయి మండలం లింగాల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊకె కృష్ణ బరిలో నిలిచారు వివరాల్లోకి వెళ్తే లింగాల గ్రామానికి చెందిన లింగాల ఊకె కృష్ణ స్థానిక పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గ్రామ స ర్పం చ్ అభ్యర్థిగా ఎన్నికల్లో నామినేషన్ల కౌంటర్లో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నిగ్ అధికారికి సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా అభ్యర్థి ఊకె కృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నా కుటుంబ నేపథ్యం నుండి బరిలోకి దిగిన నేను గ్రామాభివృద్ధికి తోడ్పడుతామని గ్రామంలో అన్ని సామాజిక వర్గాలను స మన్వయం తో కలుపుకోని గ్రామాభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తామని గ్రామ ప్రజలు ఈసారి తమకు ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు గ్రామ ప్రజలు ఉంగరం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మోజారిటితో గెలిపించాలని కోరారు.

## గుడాల భూమయ్య ఫౌండేషన్ చాంఫియన్‌షిప్ పోటీలు



ప్రజాపక్షం / జనగామ :జనగామకు చెందిన గూడాల భూమయ్య జ్ఞాపకార్థం గుడాల ఫ్యామిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2025 చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఎన్ఎంఆర్ గార్డెన్‌లో నిర్వయించారు. ఈ పోటీలకు 20 పాఠశాలల నుండి 101 మంది విద్యార్థులు హాజరు కాగా పోటీల్లో అగ్రభాగాన నిలిచిన వారికి జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. అండర్9లో ఆర్ నిఖిల్ సేయింట్ మేరీస్ పాఠశాల, అండర్ 10లో పి అభినవ్ సేయింట్ ఆన్స్ మై స్కూల్, అండర్ 11లో కే సహస్ర నారాయణ హై స్కూల్, అండర్ 12లో బి మనిషా సెయింట్ మేరీస్ హై స్కూల్, అండర్ 13లో పి సంజయ్ గీతాంజలి హై స్కూల్, అండర్ 14లో కే సాక్షార నారాయణ హై హైస్కూల్‌కు బహుమతులు లభించాయి. ఈ కార్యక్రమంలో డిసిడిఓ గౌసియాబేగం, గుడాల ఫ్యామిటీ ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీనివాస్, కో ఛైర్మన్ వేణు, శ్రీధర్ పాల్గొన్నారు.

## ఏకగ్రీవ సర్పంచులకు

# మంత్రి సీతక్క సన్మానం



ప్రజాపక్షం / ములుగు : గోవిందరావుపేట మండల పస్రా గ్రామం నందు మ ల్లంపల్లి మండలంలోని కొడిశలకుంట, దేవనగర్, గుర్తురు తండా, ముదునూ రు తండా, వెంకటాపూర్ మండల బావుసింగ్ పల్లె గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సర్పంచ్‌గా పదవులు దక్కించుకున్న శుభ సందర్భంగా, అలాగే మల్లంపల్లి మండలం నుండి ఐదు గ్రామ పంచాయతీ అ భ్యర్థులను ఏకగ్రీవం చేయడంలో ములుగు జిల్లా బిసి సెల్ కాంగ్రెస్ పార్టీ అ ధ్యక్షులు వంగ రవి యాదవ్‌ది కీలకపాత్ర అని వారిని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, ము లుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ శాలువాతో సత్కరించారు. అలాగే నూతనంగా సర్పంచ్ పదవులు గెలుపొందిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మల్లంపల్లి మండల కొడిశలకుంట, దేవనగర్, గుర్తురుతండా, ముదునూరు తండా, వెంకటపూర్ మండల బావుసింగ్ పల్లె గ్రామ పంచాయతీల అభ్యర్థులు ఏకగ్రీవంగా నేడు సర్పంచ్‌లు అయ్యారంటే దానికి ముఖ్య కారణం ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ అధ్యక్షులు వంగ రవి యాదవ్ ప్రత్యేక చొరవ అని, అలాగే గ్రామ పంఆచయతీల సర్పంచ్ అభ్యర్థులుగా పలువురు నామినేషన్లు వేయగా అన్ని పార్టీల నేతలతో మాట్లాడి, గ్రామ ప్రజలందరి సమ్మతితో గ్రామాల అభివృద్ధి కోసం నామినేషన్ వేసిన అభ్యర్థులందరిని ఉపసంహరించుకునేలా మాట్లాడి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో వంగ రవి యాదవ్‌ది కీలకపాత్ర అన్నారు. నూతనంగా సర్పంచ్‌లుగా ఎన్నికైన వారందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు సహకార సంఘ అధ్యక్షులు బొక్క సత్తిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, మల్లంపల్లి, వెంకటాపూర్, మండలాల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, మహిళలు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏకగ్రీవాలు కాంగ్రెస్ విజయం వైపు తొలి అడుగు

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



ప్రజాపక్షం/హసన్ పర్తి : హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల పరిధిలోని అర్వపల్లి, కొత్తపల్లి గ్రామ పంచాయతీ స్థానాలకు అంబాల ప్రభాకర్ గౌడ్, దండ్రి సాంబయ్య ఏకగ్రీవం కావడంతో మండలంలో అన్ని గ్రామాల సర్పంచ్ స్థానాలకు నాంది పలికిందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం హన్మకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు ఏకగ్రీవంగా ఎన్నికైన అంబాల ప్రభాకర్, దండ్రె సాంబయ్య లను మర్యాదపూర్వకంగా కలువగా వారిని ఎమ్మెల్యే నాగరాజు వారిని శాలువాతో సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఓకే తాటిపై ఉండి సమిష్టిగా గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఇదే ఉత్సాహంతో కష్టపడి పని చేస్తే మండలంలో అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా అర్వపల్లి, కొత్తపల్లి గ్రామాలు బిఆర్ఎస్, బిజెపి పార్టీల నుంచి పలువురు నేడు ఎమ్మెల్యే నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎంసి వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, వార్డు సభ్యులకు

# సిపిఐ సంపూర్ణ మద్దతు



ప్రజాపక్షం / వేలేరు : రెండవవిడుత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు శనివారం సాయంత్రం ఎన్నికల గుర్తులు ప్రకటిండంతో ఆదివారం నువ్వానే నా అన్నట్టుగా ఒక్కసారే వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు డిజె సౌండ్స్‌తో గల్లీ గల్లీలలో ఓటర్లను ఓటువేయమని అభ్యర్థిస్తూ గ్రామాభివృద్ధి కోసం పలురకాల హామీలు ఇవ్వడంజరిగింది.ఈ సందర్భంగా సిపిఐ వేలేరు మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీకి సర్పంచ్, వార్డు సభ్యులకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అధికారంలోకి వస్తే గ్రామాలను మిత్రపక్షంతో అభివృద్ధి చేసుకోవచ్చునని ఆదివారం వేలేరు మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి విజయపురి మల్లికార్జున్ నిర్వహించిన ఎన్నికల ప్రచారం పాల్గొనడం జరిగింది. ఆదివారం ఎన్నికల ప్రచారంలో వివిధ పార్టీలకు చెం దిన అభ్యర్థులు బిల్ల యాదగిరి, ఎండి సద్దాం హుస్సేన్, ఇట్టబోయిన భూపతిరాజు, కూపాటి అశోక్, బొజ్జ రజిత, మౌనిక, మరిజె అనిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి : కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి నియోజక వర్గం కొత్తపల్లిగోరి, రేగొండ మండలాల్లోని జగ్గయ్యపేట, సుల్తాన్ పూర్, వెంకటేశ్వర్లపల్లి, రేగొండ, రామన్నగూడెం తండా, జూబ్లీనగర్ గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలని అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో గ్రామాలలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే చాలా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో నాయకులు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలే పాలకులని, ప్రజా సంక్షేమం కోసం ప్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రెండు మండలాల కాంగ్రెస్ ముఖ్యనేతలు, నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

## నియోజకవర్గ గ్రామాల అభివృద్ధే లక్ష్యం : జిఎస్ఆర్



ప్రజాపక్షం/రేగొండ :జయశంకర్ జిల్లా భూపాలపల్లి నియోజకవర్గం లోని గ్రామాల అభివృద్ధే లక్ష్యం గా చేసుకొని ముందుకు వెళుతున్నామని నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం రేగొండ ఉమ్మడి మండలం లోని రేగొండ, రామన్న గూడెం తండా జగ్గయ్య పేట, సుల్తాన్ పూర్, వెంటేశ్వర్ల పల్లి,కొత్త పల్లి గోరి, నిజాంపల్లి గ్రామాలలో స్థానిక సర్పంచ్ ల ఎన్నికల్లో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో 124 చెరువులు తెగినప్పటికి ఏడు నెలల కాలం ఉంది. ఈ 124 చెరువులు కనీసం ఇసుక బత్తా కానీ తట్టెడు మట్టి కూడ పోయలేదు దని రైతుల పొలం లో ఇసుక మెటల్ పెట్టి ఇబ్బందులు పడి ఆరుగురు మనుషులు కొట్టుకుపోయి 1100 మూగ జీవులు చనిపోయి ప్రజలు ఇబ్బధులకు గురైనప్పటికీ అప్పుడున్న ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని ఆవలంబిచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే మునిగిన, తెగిన చెరువులను మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడిగి 124 చెరువులకు శాశ్వత మరమ్మతులు కోసం రూ.39 కోట్లు తెచ్చి తేపోయిన చెరువుల ను బాగు చేశామని అన్నారు. వానకాలం పోయి ఇప్పుడు వానకాలం పంట పండించడం జరిగింది. అంతేకాదు దాంతో నిరంతరంగా ఈ నియోజకవర్గానికి రోజుకు 18, 20 గంటలు పని చేయాలని నిచ్చా ఇంచుకునని అన్నారు. వెంకటేశ్వర్ల పల్లె గ్రామంతో పాటు నియోజకవర్గంలో ఉన్న 122 గ్రామ పంచాయతీలో రూ.300 కోట్ల నిధులు తెచ్చి ఈ రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని మొదటి వరుసలో ఉంచాలని కంకణం కట్టున్నానని అన్నారు. మంత్రుల దగ్గరికి పోయి సెల్పూర్ నుంచి భూపాలపల్లి మొత్తం రాయించి టెండర్లు భూపాలపల్లి బైపాస్‌కి రూ.500 కోట్లు తీసుకొచ్చాం అది కూడా టెండర్లు పిలవడం జరిగింది. మీ గ్రామంలో కూడా వెంకటేశ్వర పల్లె నుంచి బుగులోని జాతర కూడా రూ.150 లక్షలు మంజూరు. రోడ్డు కూడా రూ.30 లక్షలు మంజూరు ఇన్‌చార్జి గ్రామపంచాయతీ భవనానికి కూడా రూ.20 లక్షలు ఇచ్చారు. ఈరోజు ఈ వెంకటేశ్వర్ల పల్లెలో కూడా అంతర్గత సిసి రోడ్లు కూడా రూ.30 లక్షలు ఇచ్చారు. ఒక నాలుగు బోర్లు వేయించాం నాలుగు మోటర్లు ఇప్పించారు. నేను చేసినటువంటి పనులు ఇదే కాకుండా సుల్తాన్పూర్ నుంచి వెంకటేశ్వరపల్లి ఊర్లో నుంచి కోనరావుపేటకు నిధులు వెచ్చించి పనులు చేస్తున్నామన్నారు అద్దూరు లక్ష్మణ్ దగ్గర కూర్చొని ముఖ్యమంత్రిని చెప్పే ఏడు కోట్ల రూపాయలతో సిసి రోడ్లు గాని డ్రైనేజీ గాని కొత్తపల్లి వరకు కూడా తీసుకొచ్చారు. సంబంధించినటువంటి నిధులు నేను తేవడం జరిగింది. అంతేకాదు మీ దగ్గర ఉన్నటువంటి ఏడుకొండలవాడు తిరుపతి గుట్ట మీద వెలిస్తే బుగులోని వెంకటేశ్వర స్వామి, పాండవుల గుట్ట మీద వెలిశాడు. ఇలా చెప్పుకుంటూ పోతే నేను గెలిచినా రెండు సవత్సరాల లో నియోజకవర్గం లో అనేక అభివృద్ధి పనులు చేశాని అన్నారు. మీ గ్రామల్లో సర్పంచ్ లను గెలిపించండి పనులను అడగండి ఏ పని అయినా చేస్తానని బుగులోని సాక్షిగా ప్రజలకు హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాభివృద్ధి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ప్రజాపక్షం/రాయపర్తి: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని కోలన్‌పల్లి, ఆరెగూడెం, కేశపురం, ఎర్రకుంట తండ, జింకురాం తండా, కొండూరు, గన్నారం, తెట్టేకుంట తండ, తిర్మలాయపల్లి, జేతురాం తండ, రాగన్న గూడెం, గణేష్ కుంట తండ, మహబూబ్‌నగర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ యశస్వినిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కావొచ్చిందని రెండు సంవత్సరాలలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యానాయక్, సిరికొండ కృష్ణారెడ్డి, కృష్ణమాచార్యులు, కుందూరు రాంబాబు రెడ్డి, కుందూరు రత్నాకర్‌రెడ్డి, వివిధ గ్రామాల అభ్యర్థులు వంగాల ఎల్లమ్మ, రాజేశ్వరరావు, గుజే సుధాకర్, గుగులోత్ సునీత, జి సునీత, నాయిని యాకన్న, జనగాం జ్యోత్స్న, బానోత్ న వీన్, వశపాక ఎల్లయ్య, గుగులోత్ స్వప్న, ఆకుల శోభ, మునావత్ రఘు, పెండ్లి మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# స్టేషన్‌ఘనపూర్‌లో కాంగ్రెస్ హవా

ప్రజాపక్షం /జనగామ





స్థానిక సమరం మొదలైంది. ప్రచార జోరు కొనసాగుతోంది. ఒకొక గ్రామంలో పది మందికి పైగా పోటీ పడుతున్నారు. లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు ముందంజలో ఉండగా జనగామ, పాలకుర్తిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు బలపరిచిన అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్లుంది. నామినేషన్ల పర్వం ముగుస్తుండగా పోలింగ్‌కు గడువు దగ్గర పడుతోంది. మొదటి విడత ఎన్నిక స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 11న జరగనుండి. రెండో విడత జనగామ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 14న జరగనుంది. మూడో విడత పోలింగ్ పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో ఈ నెల 17న జరగనుంది. కాగా జిల్లాలో ఇప్పటికే ఏకగ్రీవ పంచాయతీలు పదికి పైగానే ఉన్నాయి. జనగామ జిల్లాలో 280 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 2వేల 534 వార్డులకు ఎన్నికలు జరగుతున్నాయి. పది పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగతా పంచాయతీలకు ఎన్నకలు జరగనున్నాయి. మొదటి విడతలో 110 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా ఏడు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రెండో విడతలో 79 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా మూడు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మూడో విడతలో 91 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా నామినేషన్ల పర్వం ముగిసింది. ఇలా గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి దశ ముగిసి రెండో దశకు చేరుకుంది.

**స్టేషన్‌ఘనపూర్‌లో కాంగ్రెస్ హవా**

గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరగాలి. గుర్తులు సైతం పార్టీలకు సంబంధించి ఉండవు. అయితే పార్టీలు బలపరిచిన అభ్యర్థులే ఎక్కువగా ఉంటారు. స్టేషన్‌ఘనూర్ నియోజకవర్గంలో మొదటి విడత 110 పంచాయతీలకు ఎన్నికలు ఈ నెల 11న జరగనున్నాయి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ హవా కనిపిస్తుంది. ఈ నియోజకవర్గ పరిధిలో ధర్మసాగర్, వీసర మండలాలతో కలిపితే పది పంచాయతీలు ఏకగ్రీవమై కాంగ్రెస్ ఖాతాలో కలిశాయి. ఆ పార్టీ అభ్యర్థుల తరుపున కడియం శ్రీహరి ప్రతి రోజు పది నుండి ఇరవై పంచాయతీల్లో ప్రచారం చేస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులను ఎన్నుకుంటేనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని బాహాటంగా చెబుతున్నారు. శనివారం జఫర్‌గడ్‌లో ప్రచారం నిర్వయించగా ఆదివారం రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి, గోవర్ధనగిరి, కోమల్ల, కంచనపల్లి, గబ్బెట, బానాజీపేట, రఘునాథపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వయిస్తున్నారు. బలమైన అభ్యర్థుల్ని రంగంలోకి దింపడంతో పాటు వారికి అదే స్థాయిలో సహకారాన్ని అందిస్తున్నారు.

**జనగామ, పాలకుర్తిలో నువ్వా..నేనా**

జనగామ జిల్లాలోని పాలకుర్తి, జనగామ నియోజకవర్గాల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అన్నట్లుంది. పాలకుర్తిలో కాంగ్రెస్ నుండి అధిక సంఖ్యలో మాజీ మంత్రి దయాకర్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్నారు. కొన్ని పంచాయతీలు ఏకగ్రీవం అవుతున్న పరిస్థితి కూడా ఉంది. జనగామ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్యనే పోటీ ఉంది. బిఆర్ఎస్ బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపింది. గతంలో జడ్‌పిటిసి, ఎంపిపిలుగా పనిచేసిన వారిని సైతం సర్పంచ్‌గా బరిలో నిలిపింది. కాంగ్రెస్ సైతం తామేమి తక్కువ కాదన్నట్లు బలమైన నాయకులనే రంగంలోకి దిగి పోటీ పడుతుంది. జనగామలో రెండో విడత ప్రచారం ఆదివారం నుండే మొదలైంది. పాలకుర్తిలో విత్ డ్రాలకు సమయం ఉండడంతో ఇంకా ప్రచారం ఊపందుకోలేదు.

**లక్షల్లో ఖర్చు..అభ్యర్థుల్లో హైరానా**

సర్పంచ్ పదవి కోసం పోటీ పడుతున్న వారు లక్షల్లో ఖర్చు పెడుతున్న పరిస్థితి. మేజర్ పంచాయతీల్లో 50లక్షల నుండి కోటీ రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నట్లు కనిపిస్తుంది. జనగామ మండలంలోని పెంబర్తిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ మద్య గట్టి పోటీ ఉంది. బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి గతంలో జడ్‌పిటిసిగా పోటీ చేశారు. సర్పంచ్ పదవి కోసం ఎంత డబ్బు అయినా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. బచ్చన్నపేట పంచాయతీతో పాటు రఘునాథపల్లి పంచాయతీలోనూ కోటీ ఖర్చు చేసే పరిస్థితి కనిపిస్తుంది. కంచనపల్లి ఎస్సీ జనరల్ కాగా ఆరుగురు పోటీ చేస్తున్నారు. ఇలా ప్రచారం సందర్భంగా తమతో తిరిగే వారికి ఖర్చు పెట్టడంతో పాటు వారి బాగోగులు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనితో పోటీదారులు ఖర్చులు చూసి జంకుతున్నారు.

# క్రీడ

## టీమిండియా మాజీ కోచ్‌కు కీలక బాధ్యతలు..



టి–20 ప్రపంచకప్ షెడ్యూల్ ఖరారు కావడంతో అన్ని జట్లు సన్నాహక మ్యాచ్‌లతో బిజీగా ఉన్నాయి. మెగా టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శనే లక్ష్యంగా కోచింగ్ సిబ్బందిని బలోపేతం చేసుకుంటున్నాయి. ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ నమీబియా క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. దిగ్గజ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్‌ను తమ జట్టుకు 'కన్సల్టెంట్'గా నియమించింది. టీమిండియాకు 2011లో వన్డే వరల్డ్ కప్ కట్టబెట్టిన కిర్‌స్టెన్ నమీబియాను విజయాల బాట పట్టిస్తాడని ఆ దేశ బోర్డు భావిస్తోంది. పొట్టి క్రికెట్‌లో సంచలన విజయాలతో దూసుకొచ్చిన నమీబియా 2026 ప్రపంచకప్ పోటీలకు అర్హత సాధించింది. ఈ మెగా టోర్నీలో ఈ ఆఫ్రికా జట్టు ఆడడం ఇది మూడోసారి. 2021, 2022, 2024 ఎడిషన్లలో పాల్గొన్న నమీబియా ఈసారి మెరుగైన ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉంది. సో.. అంతర్జాతీయ క్రికెట్‌లో కోచ్‌గా సుదీర్ఘ అనుభవమున్న గ్యారీ కిర్‌స్టెన్‌ను కన్సల్టెంట్‌గా తీసుకుంది నమీబియా క్రికెట్. తనను నమీబియా జట్టుకు కన్సల్టెంట్‌గా నియమించడం పట్ల కిర్‌స్టెన్ సంతోషం వ్యక్తం చేశాడు. 'నమీబియా క్రికెట్‌తో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను. క్రికెటర్ల ప్రదర్శన మెరుగవ్వడం కోస అంకితభావం, పట్టుదలగా నమీబియా బోర్డు పనిచేయడం చూసి చాలా ఇంప్రెస్ అయ్యాను. కొత్తగా నిర్మించిన స్టేడియం వారికి క్రికెట్ మీదున్న ఆసక్తికి నిదర్శనం. నమీబియా పురుషుల సీనియర్ సెలెక్టర్ల పనితీరు గొప్పగా ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగబోయే టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న నమీబియాకు నా వంతు సహకారం అందిస్తాను' అని కిర్‌స్టెన్ వెల్లడించాడు. ప్రస్తుతం నమీబియా హెడ్‌కోచ్‌గా సేవలందిస్తున్న క్రెగ్ విలియమ్స్‌తో కలిసి కిర్‌స్టెన్ నమీబియా క్రికెట్ బలోపేతానికి కృషి చేయనున్నాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు కోచ్‌గా వ్యవహరించిన ఈ దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్.. అనంతరం పాకిస్థాన్ కోచ్‌గానూ నియమితులయ్యాడు. కానీ, క్షమశిక్షణలేని పాక్ సీనియర్లు, బోర్డు రాజకీయాలను భరించలేక ఆరు నెలలకే రాజీనామా చేశాడు.

## ఒకే ఏడాదిలో వంద సిక్సర్లు..

### టి–20ల్లో చరిత్ర సృష్టించిన అభిషేక్!



భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ టీ20ల్లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. పొట్టి ఫార్మాట్‌లో చెలరేగి ఆడుతున్న అభి.. ఒకే ఏడాది అత్యధిక సిక్సర్లతో రికార్డు నెలకొల్పాడు. కోహ్లీ, రోహిత్ వంటి దిగ్గజ భారత క్రికెటర్లకు సాధ్యమవ్వని రికార్డును తన పేరిట రాసుకున్నాడీ చిచ్చరపిడుగు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆకాశమే హద్దుగా ఆడుతున్న ఈ పంజాబీ లెఫ్ట్ హ్యాండర్ సర్వీసెస్‌పై 3 సిక్సర్లతో ఒకే ఏడాది వంద సిక్సర్ల ఫీట్ నమోదు చేశాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జెర్సీతో చితక్కొట్టిన అభిషేక్ శర్మ.. టి–20ల్లోనూ తన తడాఖా చూపిస్తున్నాడు. దొరికిన బంతిని దొరికినట్టే స్టాండ్స్‌లోకి పంపే అభి.. ఒక క్యాలండర్ ఇయర్‌లో వంద సిక్సర్లతో అరుదైన ఘనత సాధించాడు. ఈ ఏడాది జింబాబ్వే, శ్రీలంకపై, ఆసియా కప్‌లో మోత మోగించిన ఈ హిట్టర్ .. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ అదరగొట్టి సెంచరీ కొట్టేశాడు. టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 2022లో 68 సిక్సర్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. 2023లో శివాలెత్తిపోయిన హిట్‌మ్యాన్ 67 సిక్సర్లతో మూడో ప్లేస్‌లో.. యువకెరటం యశస్వీ జైస్వాల్ నిరుడు 36 సిక్సర్లతో నాలుగో స్థానంలో నిలిచారు.

### 28 ఇన్నింగ్స్‌ల్లో థౌజండ్‌వాలా

ఇటీవలే ఆస్ట్రేలియా పర్యటనలో దంచికొట్టిన అభిషేక్ పొట్టి క్రికెట్‌లో వెయ్యి పరుగుల మైలురాయిని అధిగమించాడు. తక్కువ ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్‌గా ఈ లెఫ్ట్ హ్యాండర్ రికార్డు సృష్టించాడు. టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ 27 ఇన్నింగ్స్‌ల్లో 1,000 రన్స్ పూర్తి చేసుకోగా.. అభిషేక్ 28 ఇన్నింగ్స్‌ల్లోనే థౌజండ్‌వాలా క్లబ్‌లో చేరాడు. కేఎల్ రాహుల్ (29 ఇన్నింగ్స్‌లు), సూర్యకుమార్ యాదవ్(31 ఇన్నింగ్స్‌లు), మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ(40 ఇన్నింగ్స్‌లు)లు టాప్5లో ఉన్నారు. అయితే.. బంతుల పరంగా చూస్తే అభిషేక్ శర్మదే అగ్రస్థానం. 528 బంతుల్లో అభిషేక్ టీ20ల్లో వెయ్యి పరుగులు అందుకున్నాడు. సూర్యకుమార్ 573 బంతుల్లో, ఇంగ్లాండ్ చిచ్చరపిడుగు ఫిల్ సాల్ట్ 599 బంతుల్లో ఈ ఫీట్ సాధించారు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ 604 బంతుల్లో, ఆండ్రూ రస్సెల్(వెస్టిండీస్), ఫిన్ అలెన్(న్యూజిలాండ్)లు 609 బంతుల్లో వెయ్యి క్లబ్‌లో చేరారు.

## విజృంభించిన స్టార్క్..

### పింక్ బాల్ టెస్టులో చిత్తైన ఇంగ్లాండ్!

సొంత గడ్డపై ఆస్ట్రేలియా చెలరేగి ఆడుతోంది. యాషెస్ సిరీస్‌లో మొదటిదైన పెర్త్‌లో ఇంగ్లాండ్‌ను చిత్తుగా ఓడించిన ఆతిథ్య జట్టు పింక్ బాల్ టెస్టులోనూ విజయఢంకా మోగించింది. ఈసారి కూడా పర్యాటక జట్టును మిచెల్ స్టార్క్ (6–75, 77, 2–64) దెబ్బతీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో అర్ధ శతకంతో ఆసీస్‌కు భారీ స్కోర్ అందించిన ఈ స్పీడ్‌స్టర్.. వికెట్ల వేటతో ఇంగ్లాండ్ నడ్డివిరిచాడు. స్వల్ప ఛేదనను 2 వికెట్లు కోల్పోయి ఛేదించిన ఆసీస్ సిరీస్‌లో 2–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. బ్యాటుతో బంతితో చెలరేగిన స్టార్క్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఆస్ట్రేలియా గడ్డపై యాషెస్ సిరీస్ గెలవాలనే ఇంగ్లాండ్ కల కల్లలయ్యేలా ఉంది. తొలి టెస్టులో చావుదెబ్బ తిన్న బెన్ స్టోక్స్ సేన.. గబ్బాలోనూ చేతులెత్తేసింది. మిచెల్ స్టార్క్ ఆల్‌రౌండ్ షోతో



అదరగొట్టగా.. మీడియం పేసర్ మైఖేల్ నెసర్ (5–42) తొలి ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆసీస్ విజయంలో భాగమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో జో రూట్ (138 నాటౌట్) అజేయ శతకంతో ఆసీస్‌కు సవాల్ విసిరిన ఇంగ్లాండ్. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నెసెర్, స్టార్క్ విజృంభణతో పర్యాటక జట్టు 241కే ఆలౌటయ్యింది. ఓపెనర్ జాక్ క్రాలే (44), కెప్టెన్ బెన్ స్టోక్స్(50) మాత్రమే రాణించారు. 65 పరుగుల స్వల్ప ఛేదనలో ట్రావిస్ హెడ్(22) ధనాధన్ ఆడగా.. కెప్టెన్ స్టీవ్ స్మిత్(23 నాటౌట్) సిక్సర్‌తో ఆసీస్‌ను గెలిపించాడు.

### జో రూట్ ఒక్కడే..

పెర్త్‌లో మిచెల్ స్టార్క్ సూపర్ స్పెల్, ట్రావిస్‌హెడ్ మెరుపు సెంచరీతో దారుణ ఓటమి చవిచూసిన ఇంగ్లాండ్ గబ్బాలోనూ మ్యాచ్ అప్పగించేసింది. డేనైట్‌లో జరిగిన పింక్ బాల్ టెస్టులో జో రూట్ (138 నాటౌట్) అజేయ శతకంతో పటిష్ఠంగా కనిపించిన ఇంగ్లాండ్‌పై ఆస్ట్రేలియా పైచేయి సాధించింది. ఇంగ్లిష్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న ఓపెనర్ వెథర్‌లాండ్ (72), లబూసేన్(65), మిచెల్ స్టార్క్(77), స్టీవెన్ స్మిత్(61), అలెక్స్ క్యారీ(63)ల అర్ధ శతకాలతో ఆసీస్‌కు భారీ స్కోర్ అందించారు. 416కే ఎనిమిది వికెట్లు పడిన ఆతిథ్య జట్టు స్టార్క్ హాఫ్ సెంచరీతో తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగులకు ఆలౌటయ్యింది.

# ఫోకస్

# ఆరోగ్యం

## మెరుగైన నిద్ర కోసం 'కాగ్నిటివ్ షఫ్లింగ్ హ్యాక్'



రాత్రిళ్లు ఆలోచనలు ఆగకుండా తిప్పికొడుతున్నాయా? మీ మెదడును ప్రశాంతం చేయడానికి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కాగ్నిటివ్ షఫ్లింగ్ అనే పద్ధతి ఉపయోగపడవచ్చు. ఇది త్వరగా నిద్రపోవడానికి సహాయపడే సులభమైన మానసిక వ్యాయామం. దీనిని మొదట కెనడియన్ కాగ్నిటివ్ శాస్త్రవేత్త డాక్టర్ లూక్ పి.బోదువిన్ అభివృద్ధి చేశారు. దీని సూత్రం చాలా సాధారణం... సంబంధం లేని, యాదృచ్ఛిక చిత్రాలు లేదా దృశ్యాలను మనసులో ఊహించుకోవడం. ఉదాహరణకు జాతరలో పంచదార కమ్మని పట్టుకుని ఉండటం, క్యాంపింగ్‌కు వెళ్లి స్లీపింగ్ బ్యాగ్‌లో పడుకోవడం, పార్క్‌లో ఫ్రిస్బీ విసరడం వంటి ఏవైనా యాదృచ్ఛిక దృశ్యాలు. 2016లో 154 మంది విద్యార్థులతో నిర్వహించిన ఒక చిన్న అధ్యయనం ద్వారా పద్ధతి నిద్ర నాణ్యతను మెరుగుపరిచిందని, నిద్రకు ముందు వచ్చే మానసిక ఆందోళన తగ్గిందని తెలిసింది. ఇది ఎలా పనిచేస్తుంది? అదేది ప్రశ్న. శాస్త్రవేత్తలు చెప్పున్న దాని ప్రకారం, మన మెదడు అర్థవంతమైన ఆలోచనలు నుంచి యాదృచ్ఛిక ఆలోచనలు వైపు మారితే నిద్రకు వెళ్ళడం సులభమవుతుంది. కాగ్నిటివ్ షఫ్లింగ్, సిబిటి (కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ), యోగా నిద్ర వంటి పద్ధతులకు దగ్గరగా ఉంటుంది. ఇవి శరీరాన్ని రిలాక్స్ చేసి, మనసును తేలిక చేయడంలో సహాయపడతాయి. యాదృచ్ఛిక, నిర్దోషకరమైన దృశ్యాలు మనసుకు సమస్య లేదనే సంకేతం ఇస్తాయి. దీని వల్ల ఆందోళనాత్మక ఆలోచనలు తగ్గుతాయి.

**కాగ్నిటివ్ షఫ్లింగ్‌ను ఎలా ప్రయత్నించాలి?**

ఒక అక్షరంతో మొదలు పెట్టండి: ఉదాహరణకు 'ప' అక్షరంతో మొదలయ్యే పదాలను యాదృచ్ఛికంగా ఆలోచించండి.. అంటే పాప, పాలు, పాట.. ఇలా ఆలోచిస్తూ, తర్వాత క్రమంలో మరో అక్షరానికి మారండి. అక్కడ పదాన్ని కాకుండా దానికి సంబంధించిన దృశ్యాన్ని ఊహించండి. ఉదాహరణకు కుక్క అనే పదం కాకుండా మీ కుక్కతో ఆడుతున్న దృశ్యాన్ని ఊహించుకోవాలి. మీరు ఆ దృశ్యంలో భాగమై ఉండాలి. ఉదా: పాప్‌కార్న్ తినడం కాకుండా థియేటర్‌లో మీరు పాప్‌కార్న్ తీస్తున్న దృశ్యం. ఈ పద్ధతి హానికరం కాదు. అయితే మీరు తరచుగా నిద్రలేమితో బాధపడుతుంటే, ఇది ఒక నిద్రా సమస్యకు సంకేతం కావచ్చు. రోజు పనుల్లో ఆటంకం, దృష్టి సమస్యలు, చిరాకు, డ్రైవింగ్ సమస్యలు ఉన్నప్పుడు నిద్ర నిపుణుడిని సంప్రదించడం అవసరం.

## మీకు తెలుసా?



నిత్యం మనం తినే కూరగాయలు, ఆకు కూరల్లో అనేక పోషకాలు ఉంటాయి. అవన్నీ మన శరీరానికి ఉపయోగకరమైనవే. కానీ వాటి గురించి చాలా మందికి తెలియదు. కూరగాయలు, ఆకుకూరల్లో మన శరీరాన్ని అన్ని విధాలుగా సమతుల్యం చేసే పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ ఉంటాయి.

* కాలిఫ్లవర్లో కోలిన్ అనబడే పదార్థం సమృద్ధిగా ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తిని అమాంతం పెంచుతుంది. అందువల్ల దీన్ని చిన్నారులకు ఇస్తే మంచిది. దీని వల్ల వారి మెదడు ఎదుగుదల సరిగ్గా ఉంటుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. చదువుల్లో రాణిస్తారు.
* ఒక నారింజ పండులో ఉండే విటమిన్ సికి రెట్టింపు స్థాయిలో విటమిన్ సి ఒక క్యాప్సికంలో ఉంటుంది. అందువల్ల దీంతో శరీరో నిరోధక శక్తి పెరగడమే కాదు, కొవ్వు కూడా కరుగుతుంది.
* రోజూ అల్పాహారం అనంతరం ఒక కప్పు టమాటా జ్యూస్‌ను తీసుకుంటే, బిపి, గుండెపోటు, సుగర్ వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు.
* దగ్గు, ఆయాసం, తుమ్ములకు గోంగూర (పుంటి కూర) చక్కని ఔషధం!
* పుదీనాలో రోజ్మరినిక్ యాసిడ్, మెథనాల్ అనే సమ్మేళనాలు ఉంటాయి. అందువల్ల డిప్రెషన్, అలర్జీలు తగ్గుతాయి.
* పాలకూరలో ఐరన్ కన్నా ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల గర్భిణులకు ఇది చాలా మేలు చేస్తుంది. వారికి ఫోలిక్ యాసిడ్ చాలా అవసరం ఉంటుంది. కనుక వారు పాలకూరను నిత్యం తినాలి.
* పచ్చి బఠానీల్లో ఎల్‌అర్జైనైన్ అనబడే సమ్మేళనం ఉంటుంది. ఇది వెజిటేరియన్ ఆహారాలను మాత్రమే తినేవారికి ఉత్తమమైన ప్రోటీన్‌గా పనిచేస్తుంది. ప్రోటీన్లు కావాలనుకునే శాకాహారులు పచ్చి బఠానీలను తినవచ్చు. దీంతో శరీరానికి శక్తి కూడా లభిస్తుంది.

## ఒత్తిడి తగ్గాలంటే..



తీవ్రమైన మానసిక ఒత్తిడిని తగ్గాలంటే, చూసిన టీవీ సీరియల్స్‌ను లేదా సినిమాలనే మళ్లీమళ్లీ చూడమంటున్నారు పరిశోధకులు. చాలా మంది ఒకసారి చూసిన కార్యక్రమాన్ని లేదా సినిమాను మళ్లీ చూడడానికి ఇష్టపడరు. ఆ విధంగా చూసే వారిని మందలిస్తారు కూడా. అయితే, వివిధ పరిశోధనలను అనుసరించి, ఒకే టీవీ లేదా సినిమాలు మళ్లీ మళ్లీ చూడటం కేవలం వినోదం మాత్రమే అనుకుంటే పొరపాటే. ఇది నాడీవ్యవస్థను సరిచేసుకునేందుకు సహాయపడే శక్తివంతమైన పద్ధతి. అప్పటికే సదరు కార్యక్రమాన్ని లేదా సినిమాను చూసి ఉంటాం కాబట్టి, ఏం జరుగుతుందోనన్న ఆతృత ఉండదు. కథ లేదా సన్నివేశం ఎలాంటి మలుపులు తిరుగుతుందోనన్న తీవ్ర ఉత్కంఠ అసలే ఉండదు. అంతేకాదు, ఒక విషయాన్ని ముందుగానే అంచనా వేయగలిగలిగామనే అనుభూతిని కలిగిస్తుంది. ఈ అనుభూతి మెదడును శాంతపరుస్తుంది. ఒత్తిడి ప్రతిస్పందనలను తగ్గించడంలో సహాయపడుతుంది. అప్పటికే తెలిసిన కథా ప్రక్రియలు, పాత్రలు తిరిగి కనిపించడం వల్ల నాడీవ్యవస్థ ఎలాంటి ఒత్తిడి లేకుండా పని చేస్తుంది. ఫలితంగా కార్టిసాల్ స్థాయులు తగ్గుతాయి. ఫలితంగా భావోద్వేగాల నియంత్రణ మెరుగవుతుంది. ఆందోళన తగ్గుతుంది. అలాగే, ఊహించలేని ప్రపంచంలో ఒక రకమైన నియంత్రణ భావనను కల్పిస్తుంది. ఈ విధంగా ఉద్దేశ్యపూర్వకంగా మళ్లీ చూడడాన్ని స్వీయ సంరక్షణలో భాగం చేయడం వల్ల ఒత్తిడిని నియంత్రించవచ్చు. భావోద్వేగాలను శాంతపరచవచ్చు. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. కాబట్టి, ఒత్తిడి తగ్గడానికి అందుబాటులో ఉన్న, అత్యంత సులభమైన ఈ మార్గాన్ని అనుసరించడం మంచిది. దీని వల్ల లాభం మాటల ఎలావున్నా, నష్టం మాత్రం ఉండదు.

## పార్టీలకు అతీతంగా పేదలకు అభివృద్ధి ఫలాలు

### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### సిపిఐ గూటికి చేరిన పలువురు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పార్టీలకు అతీతంగా పేదలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు గత రెండేళ్లుగా అహర్నిశలు కృషి చేస్తున్నామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ, హమాలీ కాలనీ, ప్రశాంత్ నగర్, లక్ష్మీ దేవిపల్లి, లోతువాగు, సంజయ్ నగర్, సాటివారిగూడెం గ్రామాల్లో సిపిఐ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులను గెలిపించాలని ఆయా గ్రామాల్లో ముఖ్యనేతలకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కష్టకాలంలో ప్రజలు సిపిఐని ఆదరించారని, అలాంటి సందర్భంలో కొందరు చేస్తున్న అవకాశవాద రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, నియోజకవర్గాభివృద్ధే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా పేదలకు, అండగా రెండేళ్లుగా చేస్తున్న పనులు గమనించి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎన్నుకోవాలని పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి సిపిఐ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, అభివృద్ధికి పట్టం కట్టడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, మండల ముఖ్యనాయకులు, పంచాయితీ బరిలో ఉన్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మద్ధతుదారులు, అభిమానులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాటం : తమ్మెర

### సిపిఐలో భారీగా చేరికలు



**ప్రజాపక్షం/తొర్రూరు :** సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాడుతుందని పార్టీ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఓమ భిక్షపతి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని కంఠాయపాలెం గ్రామంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి ఆవుల శ్యామలత ఉపేందర్‌కు మద్ధతు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం చేసిందన్నారు. ఈ నిర్ణయం మేరకు గ్రామంలో పలువురు సిపిఐలో భారీగా చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. ఐదవ వార్డు మెంబర్‌గా పోటీ చేస్తున్న ఆవుల చేరాలు అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మందపురి శ్యామ్, మండల నాయకులు పేరబోయిన కిరణ్, ఐలయ్య, సాయిరెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ధ్యేయం

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజాసమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ధ్యేయమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం లోని మోటాపురంలో కూటమి అభ్యర్థి ఏలూరి రామారావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పాటుపడే కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. గ్రామాభివృద్ధి కావాలంటే మాయమాటలు నమ్మవద్దని సూచించారు. స్థానిక సంస్థల బలోపేతం కావాలంటే కూటమి నాయకులకు అధికారం కావాలని సూచించారు. ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేసేందుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు చావా కిరణ్, నున్నా రవికుమార్, బండి రమేష్, ప్రావెళ్ల కృష్ణారావు, బెల్లం పుల్లయ్య, బెల్లం వాసు, తాళ్లూరి నాగేశ్వరరావు, భాగం మురళీ, ఇంటూరి ఆశోక్, రంగారావు, గుగులోత్ వీరు, చావా రామయ్య, ఏలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాసేవకులను గెలిపించాలి : జ్యోతి

**ఎల్కతుర్తి:** ప్రజల కోసం నిస్వార్థంగా, నిజాయితీగా, నిష్పక్షపాతంగా గ్రామ పరిపాలనను అందించే వారిని గ్రామ సర్పంచ్‌గా ఎన్నుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామంలో జరిగిన ప్రచారంలో సర్పంచ్ అభ్యర్థి కర్రే లక్ష్మి బిక్షపతి కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మహిళా, దళిత బహుజన ముద్దుబిడ్డ,రైతు కార్మిక కర్షక విద్యార్థి యువజన మహిళల హక్కుల కొరకు బరిలో నిలిచి పోరాడుతున్న కుటుంబం నుండి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లక్ష్మి బిక్షపతి కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గోపాలపురం గ్రామంలో ప్రతి ఓటరును కలిసి మహిళా సభ్యులతో పాటు ఇంటి ఇంటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. డబ్బుతో ఓట్లను కొనే సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజాసేవకు అంకితమై పనిచేస్తున్న కర్రే లక్ష్మి బిక్షపతి కత్తెర గుర్తుపై అధిక సంఖ్యలో ఓట్లు వేసి గెలిపించాలని నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపాల్‌పూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి కర్రే లక్ష్మి, సంధ్య ధన, సౌందర్య, సారమ్మ, శిరీష, లక్ష్మి, స్వీటీ, బుచ్చమ్మ, ఉష, ఉమా, వాణి తదితరులు పాల్గొన్నారు.



### పనిచేసే వారికే పట్టం : రాజ్‌కుమార్

**భూపాలపల్లి :** గ్రామాల్లో పని చేసే వారికి పట్టం కట్టం కట్టాలని సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ బలపరిచిన కవిత శ్రీహరి ఎన్నికల ప్రచారంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములుతో కలిసి రాజ్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సిపిఐ నుండి పిడిసిల్ల గ్రామంలో ఎర్రజెండా పక్షాన సర్పంచ్, ఎంపిటిసిగా గ్రామానికి సేవ చేయడం జరిగిందని గుర్తు చేశారు. గ్రామంలో బిసి బిడ్డగా సేవ చేయడానికి వస్తున్న తాటిపాముల కవితా శ్రీహరిని భారీ మెజారిటీని ఇచ్చి గెలిపించాలని రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ ఓటు వేసే ముందు ఆలోచించి గ్రామానికి సేవ చేసే వ్యక్తిని ఎన్నుకోవాలని సూచించారు. పిడిసిల్ల గ్రామానికి బీసీ బిడ్డగా సిపిఐ బలపరిచిన తాటిపాముల కవిత శ్రీహరి పోటీ చేసే ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్, కొరిమి సుగుణ, జిల్లా సమితి సభ్యులు ఎండి నబి పరమాండ్ల రాజయ్య, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ అభివృద్ధే లక్ష్యం

భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండలం పిడిసిల్ల సిపిఐ బలపరిచిన అభ్యర్థి తాటిపాముల కవిత శ్రీహరి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సెంటర్లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ గ్రామంలో కోతుల బెడద తీరుస్తానని, ఇంటింటికి మినరల్ వాటర్ ఐదు సంవత్సరాలు ఉచితంగా అందజేస్తానని గ్రామంలో ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు.







గ్రామ అభివృద్ధి ప్రజలకు సేవ చేయడమే నా ప్రధాన లక్ష్యం అన్నారు. 11న జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో పిడిసిల్ల గ్రామ సర్పంచ్‌గా ఉంగరం గుర్తుకు ఓటు వేసి మీరు ఆశీర్వదించి ఓటు వేస్తే అభివృద్ధి చేస్తానని ఓటర్లను కవిత శ్రీహరి అభ్యర్థించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## బత్తినేని చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/బోనకల్ :** బత్తినేని చారిటబుల్ ట్రస్టు వైద్య సేవలు అభినందనీయమని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశ్‌రావు జ్ఞాపకార్థం బిపి, షుగర్, కంటి ప్రత్యేక వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు బత్తినేని చారిటబుల్ ట్రస్టు వైద్య సేవలు వరమన్నారు. మండల ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు సిలివేరు సదానందం మాట్లాడుతూ రక్తపోటు అధికంగా ఉన్న వారు బరువు పెరుగుదలను నియంత్రించుకుంటూ కొవ్వు పదార్థాలు, వేపుళ్లు, కేకులు, జంక్ ఫుడ్స్‌కి చాలా వరకు దూరంగా ఉండాలన్నారు. ఉప్పు వాడకాన్ని తగ్గించాలని, వైద్యులు సూచించిన విధంగా ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. ఈ క్యాంపు వైద్యులు సదానందం వైద్య సేవలు అందించగా బత్తినేని ట్రస్టు సభ్యులు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, ఆర్‌ఎంపి డబ్ల్యూ ఎటిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు చేతుల మీదుగా పేషెంట్లకు మందులు పంపిణీ చేశారు.



కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఏలూరి పూర్ణచందు, మాతంగి శ్రీనివాసరావు, కొంగర కృష్ణయ్య, బోళ్ల ప్రసాద్‌రావు, సహాయకులు యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## భారీగా మద్యం పట్టివేత

ప్రజాపక్షం/రామాయంపేట:ఎన్నికల వేల ఏరులై పారుతున్న మద్యం... కోడ్ అమలులో ఉన్నా బెల్ట్ తీయని ఎక్సైజ్ అనే శీర్షికన ప్రజాపక్షం పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పత్రికలో వచ్చిన కథనా న్ని సీరియస్‌గా పరిగణించిన స్థానిక పోలీసులు వెంటనే రంగంలోకి దిగి అక్రమ మద్యం స్థావరాలపై ఉక్కుపాదం మోపారు. శని, ఆదివారాల్లో పోలీస్ లు అక్రమ మద్యంపై గట్టి నిఘా పెట్టి సంకాపూర్, అక్కన్నపేట గ్రామాల్లో సుమారు 5లక్షల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ బా ల్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల నియమావలి చట్టం ప్రకారం ఓటర్లను ప్ర లోభం చేసేందుకు మద్యం, డబ్బు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## ఉపాధ్యాయుల ఇబ్బందులు పరిష్కరించండి
### టిఆర్‌పిఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :తెలంగాణ రాష్ట్రంలో ఈనెలలో మూడు దఫాలుగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి.ఆర్.టి.ఎఫ్)డిమాండ్ చేసింది.ఈ మేరకు టి.ఆర్.టి.ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దర్శనం దేవేందర్,గడ్డం భూమన్నలు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి తమ విజ్ఞప్తిని తెలియజేశారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ ఉపాధ్యాయులు వినియోగించుకునే పోస్టల్ బ్యాలెట్‌ను,వాటి లెక్కింపు సందర్భంలో,వారి ఓటు గోప్యతకు భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.అదేవిధంగా,పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారు,దివ్యాంగులు,గర్భిణీ స్త్రీలు,పాలిచ్చే తల్లులు,దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులకు ఎన్నికల విధులనుండి ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.నిర్మల్ జిల్లాలో ఎన్నికల విధులను కేటాయించేటప్పుడు ఉద్యోగ,ఉపాధ్యాయుల సీనియార్టీని పరిగణలోకి తీసుకోకుండా,సీనియర్లను కాదని జూనియర్లను రిటర్నింగ్ ఆఫీసర్లుగా,ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా నియమించడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కావున,ఇకనైనా తదనంతరం జరిపే రెండో విడత,మూడో విడత ఎన్నికల విధుల నియమాకం సందర్భంగా సీనియార్టీని పరిగణలోకి తీసుకొని కేటాయింపులు చేయాలని వారు జిల్లా అధికారులను కోరారు,చివరగా,సిబ్బందికి విధులు కేటాయించే సందర్భంలో వారి సమీప మండలాలను కాకుండా సుదూర మండలాలకు కేటాయించడం వల్ల వారు ఇబ్బందులకు గురి కాకుండా,వీలైనంత వరకు వారి సమీప చుట్టపక్కల మండలాలకే విధులు కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,టి.ఆర్.టి.ఎఫ్ విజ్ఞప్తి చేసింది.

## గ్రామాలలో హోరాహోరీగా సర్పంచ్ అభ్యర్థుల ప్రచారం




ప్రజాపక్షం/అల్లాదుర్గం:మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం సాగుతుంది. అల్లాదుర్గం గ్రామ సర్పంచ్ అభ్యర్థి మద్దూరి సౌమ్య సురేష్ గౌడ్ ప్రజల మద్దతుతో ప్రచారం జోరుగా కొనసాగుతుంది. ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి ఒక సారి అవకాశం ఇచ్చి గెలిపించండి ఐదు సంవత్సరాలు ఎల్లవేళలా ప్రజల వద్దనే ఉండి గ్రామ అభివృద్ధికి సాయి శక్తుల కృషి చేస్తానని ప్రచారం జోరుగా కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## విధులపట్ల నిర్లక్ష్యం చేస్తున్న ఎంపిడిఒపై చర్యలు తీసుకోవాలి
### బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోపి..



ప్రజాపక్షం/శివ్వంపేట : విత్‌డ్రాలకు ఇంకా టైం ఉంది పో.. విత్‌డ్రాలకు ఇప్పుడే ఏమొచ్చిందని, 9వ తారీఖున రాపొండని దురుసు సమాధాలను ఎంపిడిఒచెప్పడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగాయపల్లి గోపి అన్నారు. ఎన్నికల నియమావళిని పాటించకుండా గ్రామాలలో ఎన్నికల వాతావరణాన్ని చెడగొడుతూ ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్య దోరణి ప్రదర్శిస్తున్న ఎంపిడిఒ వెంకటలక్ష్మమ్మ 6, 9 కౌంటర్ల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులపై రాష్ట్ర ఎన్నికల కమీషన్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కల్లూరి ముత్యాలు, నల్ల రవి గౌడ్, హరిగౌడ్, బాలకుంద ఇంద్రేశ్, మణిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టాపర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గుండాజి శ్రీనివాస్



ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :నిజామాబాద్ స్టాపర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా గుండాజి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిజామాబాద్ స్టాపర్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశాన్ని ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు. గత రెండు సంవత్సరాలుగా అసోసియేషన్ అధ్యక్షునిగా కొనసాగుతున్న కర్క రమేష్ ప్రస్తుతం వాడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేస్తున్నాడు. దీంతో నూతన కమిటిని ఎన్నిక చేయాలని సమావేశంలో నిర్ణయించారు. మెజార్టీ సభ్యుల నిర్ణయం మేరకు అసోసియేషన్ అధ్యక్షులుగా గుండాజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా హైమద్, కోశాధికారిగా కిషోర్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా సదానంద్, కొక్కు రవికుమార్, జాయింట్ సెక్రెటరీగా కొట్టురి ప్రమోద్, గౌరవ అధ్యక్షులుగా కొట్టురు శ్రీనివాస్, సలహాదారులుగా మల్లెపూల నరసయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటి ఏడాది కాలం పాటు కొనసాగించేలా కమిటి నిర్ణయం తీసుకుంది. అనంతరం నూతన కమిటిని అసోసియేషన్ సభ్యులు శాలువాలు, పూలదండలతో సన్మానం చేసి అభినందించారు. ఈ సమావేశంలో బ్యాగరి శ్రీనివాస్, తంగేళ్ల ప్రకాష్, రొండ్ల శ్రీనివాస్ రెడ్డి, మల్లెపూల నవీన్ పాల్గొన్నారు.

# సర్పంచ్‌లకు మద్దతు ఇస్తారా,దెబ్బ తీస్తారా?
### నిర్మల్ జిల్లా రాజకీయాల మధ్య కార్యకర్తల గందరగోళం..

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :నిర్మల్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ,ప్రధాన పార్టీల అంతర్గత నిర్మాణాలు,స్థానిక వర్గ సమీకరణాల మధ్య పెరిగిన సంక్లిష్టమైన వైరుధ్యాలకు దర్పణం పడుతోంది.జిల్లాలో రెండు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్,బిజెపిల అధ్యక్ష పీఠాలు ఒకే నియోజకవర్గానికి పరిమితం కావడం అనేది ఈ రాజకీయ క్షేత్రాన్ని తలకిందులు చేసింది.ఈ అసాధారణ పరిస్థితి,స్థానిక సర్పంచ్ ఆశావహులకు దైన్యంమిగులుస్తోంది.పోలింగ్ తేదీలు ఆసన్నమవుతున్న కొద్దీ,ఎ న్నికల బరిలో నిలబడిన అభ్యర్థులలో భయం,వ్యూహాత్మ క అభద్రతా భావంపతాక స్థాయికి చేరాయి.కాంగ్రెస్‌బిఆర్ఎస్ ,బిజెపిఈ మూడు పార్టీలలోని జిల్లా,నియోజకవర్గ స్థాయి కీలక నేతలు,తమ అంతర్గత విభేదాల పర్యవసానంగా ''ఎవరికి వారే యమునా తీరే''అనే వ్యూహాన్ని అనుసరించడం,కింది స్థాయిలో నామినేషన్లు దాఖలు చేసిన కార్యకర్తలను సంపూర్ణ ఆయోమయంలోకి నెట్టింది.ఒకే స్థానానికి పలువురు పోటీ పడుతుండటం వలన,ఏ పార్టీ తమ నామినేషన్‌ను అధికారికంగా ఆమోదిస్తుంది అనే విషయంలో స్పష్టత లేక,అభ్యర్థులు ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.




**నిర్మల్ రాజకీయ చిత్రం..వర్గ విభేదాల లోతైన విశ్లేషణ..**

నిర్మల్ జిల్లాలో మొత్తం 18 మండలాలు,400 గ్రామపంచాయతీలు,3,368 వార్డు సభ్యులకు ఎన్నికలు మూడు విడతల్లో (ఈ నెల 11,14,17) జరగనున్నాయి.జిల్లాలో నిర్మల్,ఖానాపూర్,ముధోల్ నియోజకవర్గాలు ఉండగా, ఈ మూడు పార్టీల స్థానిక శక్తులు రెండు లేదా ముడు వర్గాలుగా చీలిపోయి,సర్పంచ్ ఎన్నికల్లో పరస్పర పోటీకి సిద్ధమవుతున్నాయి.అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మక రాజకీయ పరీక్షగా భావిస్తోంది.పార్టీ రహిత ఎన్నికలు అయినప్పటికీ,మద్దతుదారులను గెలింపించే బాధ్యతను అధిష్టానం కింది స్థాయి కమిటీలపై మోపింది.


**నియోజకవర్గాల వారీగా పార్టీల అంతర్గత ఘర్షణ..**

కాంగ్రెస్ పార్టీలో నిర్మల్ నియోజకవర్గంలో మాజీ డిసిసి అధ్యక్షుడు శ్రీహరి రావు వర్గానికి,మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అనుచరుల వర్గానికి మధ్య తీవ్ర వర్గ సంఘర్షణ నడుస్తోంది.ముధోల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి,ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలాచారి అనుచరుల మధ్య ఆధిపత్య పోరు కనిపిస్తోంది.ఖానాపూర్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యాం నాయక్ అనుచరులు తమకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ రాజకీయ ఒత్తిడిని పెంచుతున్నారు.ప్రతిపక్షాలైన బిఆర్ఎస్,బిజెపిలోనూ ఈ అంతర్గత సంఘర్షణ తప్పడం లేదు.బిజెపిలో పాత,కొత్త తరం నాయకుల మధ్య వైరం ఏర్పడి,గ్రామాల్లో రెండు గ్రూపుల మద్దతుదారులు నామినేషన్లు దాఖలు చేశారు .ముఖ్యంగాబిజెపిలో కొన్ని గ్రామాల్లో హిందుత్వ వాదం ఆధారంగా మద్దతు కోసం పట్టుబట్టడం సమన్వయ ప్రయత్నాలకు మరింత సవాలు విసురుతోంది.

**సమన్వయ వైఫల్యం,భవిష్యత్ పరిణామాలు**

గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అన్ని పార్టీలలో ఒక పెద్ద రాజకీయ పంచాయతీగా మారింది.పార్టీ కార్యకర్తలు,నాయకులు పార్టీ గుర్తు రహిత ఎన్నికలను తమ వ్యక్తిగత రాజకీయ బలాన్ని నిరూపించుకునే వేదికగా చూస్తున్నారు.అన్ని పార్టీలలో ఒకే పదవికి ఇద్దరు లేదా ముగ్గురు పోటీ చేయడంతో ,నేతలు బుజ్జగింపులు,రాజీ కుదిర్చే ప్రయత్నాలు చేస్తున్నారు.సిట్టింగ్ ఎమ్మెల్యేలు,మాజీ ఎమ్మెల్యేలు,నియోజకవర్గ ఇన్‌చార్జీలు రాజకీయ సమీకరణాలను బేరీజు వేసుకొని రాజీ కుదిర్చే మార్గాన్ని చేపడుతున్నప్పటికీ,అనేక ప్రాంతాల్లో ఈ ప్రయత్నాలు వ్యతిరేక ఫలితాలను ఇస్తున్నాయి.బిఆర్ఎస్‌లో ఇద్దరు అభ్యర్థులు ఉంటే,సర్పంచ్‌గా ఒకరు,ఎంపిటిసిగా మరొకరు పోటీ చేయాలనే రాజీ మార్గాన్ని అమలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఈ ఎన్నికలలోని వర్గ రాజకీయాలు,భవిష్యత్తులో ఆయా పార్టీల అంతగత నిర్మాణం,నాయకత్వ స్థిరత్వం, నియోజకవర్గాలలో పట్టుపై తీవ్రమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.

## కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించండి
### ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ప్రజాపక్షం/ఎడపల్లి:గ్రామం అభివృద్ధి చెందాలి అంటే గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాన్ని అభివృద్ధి దిశగా పయనించే విధంగా చేయాలని ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎడపల్లి మండలంలోని నెహ్రూనగర్, జాన్కంపేట్ గ్రామాలలో ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన వ్యక్తులను ఎన్నుకుంటే గ్రామ సమస్యలన్నీ పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని ఏ సమస్య ఉన్న ఎన్నుకున్న సర్పంచ్‌ల ద్వారా తనకు తెలియచేయాలని అన్నారు. గత ప్రభుత్వాల వల్ల గ్రామాలు అభివృద్ధి చెందలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నెహ్రూనగర్‌లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి అజ్మేరి బేగం ని, జాన్కంపేట్‌లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి సుంచనకోట అనురాధను అత్యధిక మేజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేశ వేణు, గడుగు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు తదితరులు ఉన్నారు.

## ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేరోహిత్



ప్రజాపక్షం/పాపన్న-పేట:స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కోరా రు. ఆదివారం మ ండల పరిధి లోని ఎల్లాపూర్, శానాయిపల్లి, పొడిచన్ పల్లి తండా, నాగసాన్ పల్లి, శేరిపల్లి, కొడపాక, గాజుల గూడెం, ఎనికేపల్లి, బాచారం, రాజ్యా తండా, అర్కెల్, నార్సింగ్, సీతానగరం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులతో ప్రచారం నిర్వహించారు. అనంతరం బాచారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులైన వెంకట్ తల్లి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ.. పార్టీ బలపరిచిన అభ్యర్థులకు పూర్తి మద్దతు ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. ఆయన వెంట మండల నాయకులు, ప్రభాకర్ రెడ్డి. ప్రశాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు



ప్రజాపక్షం/నేరడిగొండ: నేరడిగొండ మండలంలో ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుప్తాల గ్రామానికి చెందిన బిజెపి,బి .ఆర్.ఎస్ నాయకులు ఆదివారం ఆడే గజేందర్,ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలనకు ఆకర్షితులమై అభివృద్ధి పట్ల చూపుతున్న చొరవను ప్రతి పేదలకు ఇందిరమ్మ ఇల్లు వంటి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై స్వచ్ఛందంగా ఆయా పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ కండువాను కప్పుకోవడం జరిగిందని అన్నారు.వారిని సాధారణంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధికై కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పనిచేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మాజీ సర్పంచ్ వడ్డేపల్లి నరేందర్ భీమ్రావు పటేల్ ,బిజెపి మండల దళితమొర్చా నాయకులు లింగంపల్లి సురేష్,గస్కంటి కిష్టయ్య,ఇతర నాయకులు,గ్రామాల్లోని పటేళ్లు తదితరులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

## రైతు పోరాటం నుండి ఎదిగిన ఉపాధ్యాయ నాయకుడు
### టిపిటిఎఫ్ నేత కె.నారాయణ సంతాప సభ..



ప్రజాపక్షం/కలెక్టరేట్:నిర్మల్‌లోని టిఎస్‌జిఒ భవన్‌లో టిపిటిఎఫ్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు రెడ్డిమల్ల ప్రకాశం మాట్లాడుతూ,రైతు పోరాటం నుండి ఎదిగివచ్చిన ఉపాధ్యాయ నాయకులు కామ్రేడ్ కె.నారాయణ మృతి తీరని లోటని పేర్కొన్నారు.కామ్రేడ్ కె. నారాయణ ఎల్లప్పుడూ అలసట లేకుండా తాను ఎంచుకున్న రాజకియాల కొరకు,ఉపాధ్యాయ సమస్యల కొరకు,సమాజంలో అందరికీ సమాన అవకాశాలు అందాలని చివరి వరకు పనిచేశారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల హక్కుల కొరకు పిఆర్‌టియు సంఘం స్థాపనలో క్రియాశీలక భూమికను పోషించి,ఆ సంఘానికి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు.తదుపరి,సమాజంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా కృషి చేయాలనే ఆలోచనతో ఎపిటిఎఫ్ తెలంగాణ ప్రాంతానికి విస్తరింపజేయడంలో కూడా క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు.ఉపాధ్యాయులను అభ్యుదయ భావాలు గలవారిగా,నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించే వారుగా మార్చడంలో కె.నారాయణ ముందున్నారు.ఆయన ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి,ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపకల్పనలో క్రియాశీలకంగా పనిచేశారని,విద్యారంగంలో ఏర్పడిన అనేక సమస్యల పరిష్కారానికి ముందున్నారని అభిప్రాయపడ్డారు.నారాయణ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఫెడరేషన్ కు సహాయం అందించేవారని,అడ్వకేట్‌గా ఉపాధ్యాయుల సమస్యలను న్యాయస్థానంలో పరిష్కరించటంలో ఎంతో చేయూత ఇచ్చారని,నారాయ ణ లేని లోటు ఫెడరేషన్‌తో పాటు ఉపాధ్యాయ లో కానికి,సమాజానికి తీరని నష్టం అని రెడ్డిమల్ల ప్ర కాశం అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు ఆకుల సుదర్శన్,బొడ్డు లక్ష్మ ణ్,పరమేశ్వర్,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కా ర్యదర్శి నంది రామయ్య,నిర్మల్ జిల్లా కార్యదర్శి జే. రాజు,పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కే.లక్ష్మి, ఎం. హరిత,బక్కన్న,రామ్ లక్ష్మ ణ్,గంగన్న, ఎస్. ఎన్. రెడ్డి,రగోతంత్తమ్‌రెడ్డి,రఘు,కిరణ్‌పాల్గొన్నా రు.

## ఆరోగ్య,మానసిక అవగాహన కార్యక్రమం



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ పట్టణంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా),నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు.ప్రముఖ న్యూరో సర్జన్ మనోజ్ భరత్'బ్రెయిన్ స్ట్రోక్' గురించి వివరించగా,డాక్టర్ అల్లాడి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో 'మానసిక వ్యాధుల' గురించి పూర్తి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లీడ్ ఇండియా వ్యవస్థాపకులు డాక్టర్ సుదర్శన్ ఆచార్య,ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ ఎన్ రెడ్డి హాజరయ్యారు.వారు ముఖ్యంగా విశ్వగురు భారత్ సాధనలో ఉపాధ్యాయుల పాత్ర గురించి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు,సెక్రెటరీ పద్మనాభ గౌడ్,నిర్మల్ పట్టణ అధ్యక్షుడు చంద్ర గౌడ్,మంచిర్యాల నాగభూషణ్,కె.గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల అధికారులు ఎక్కడో ?



ప్రజాపక్షం/శివ్వంపేట : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు 24గంటలు మండల ఎన్నికల అధికారులు అందుబాటులో ఉండాలని నిబంధనలు ఉన్నా గానీ మండల అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. మండల ఎన్నికల అధికారి ఎంపిడిఒ వెంకటలక్ష్మ మ్మ మధ్యాహ్నం 12 గంటలైనా మండల కార్యాలయానికి రాకపోవడంతో ఎన్నికల నుంచి తమ నామినేషన్ ఉపసంహరించుకునే అభ్యర్థులు అధికారుల రాకకోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎన్నికల అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఫోన్ ద్వారా ఎంపిడిఒ వెంకటలక్ష్మ మ్మ సమాచారం అందించగా అభ్యర్థులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటర్‌లలో చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్, గూడురు, టిక్యదేవమ్మగూడ పంచాయతీల కోసం ఏర్పాటు చేసిన 6వ కౌంటర్‌లో రిటర్నింగ్ అధికారి సునందరెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్ అందుబాటులో లేకపోవడంతో అభ్యర్థులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఎన్నికల అధికారులు అభ్యర్థులకు అందుబాటులో లేని విషయం తెలుసుకున్న బిఆర్ఎ స్ రాష్ట్ర నాయకులు సింగాయపల్లి గోపి ఎంపిపి కార్యాలయానికి చేరుకొని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు క లెక్టర్ నగేశ్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

## స్థానిక ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:ఎస్ఐ

ప్రజాపక్షం/అల్లాదుర్గం: ఎన్నికలు శాంతియుతంగా జరగాలి. ఎవ్వరూ గొడవలకు పాల్పడరాదు. ఓటు కొనడం, అమ్మడం చట్టపరంగా పెద్ద నేరం. ఎక్కడైనా ఇటువంటి ప్రయత్నాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. రాత్రివేళ గుంపులుగా తిరగడం, మద్యం సేవించి గొడవలు చేయడం పూర్తిగా నిషేధం. రాజకీయ ఒత్తిడి, బెదిరింపులు, బలవంతపు చర్యలు ఎవరూ చేయరాదు. జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. సోషల్ మీడియాలో పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు వార్తలువీడియోలు పంచితే చట్టపరంగా చర్యలు తప్పవు. పోలీసులు చేసే పహారా మీ భద్రత కోసం. ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే , 100 లేదా 87126 57883 కు సమాచారం ఇవ్వాలి అని ఎస్ఐ తెలిపారు. యువత శాంతిభద్రత పరిరక్షణలో ముందుండాలి. ప్రలోభాలు, రెచ్చగొట్టే సందేశాలు చూసి ఆవేశా పడరాదు కూడళ్ల వద్ద గుంపులుగా నిలబడడం, గొడవలకు దిగడం నేరం. కేసులు పడితే భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్ట్, విదేశీ అవకాశాలపై ప్రభావం ఉంటుంది. బైండ్ ఓవర్ పడినవారికి భవిష్యత్తులో చిన్నగొడవ జరిగినా పెద్ద కేసుగా మారే అవకాశం ఉంటుంది . జాగ్రత్తగా ఉండాలి సూచించారు.




**అభ్యర్థులు ప్రచార కార్యకర్తల కోసం సూచనలు**

ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీలు తీయడానికి గానీ మైకులు పెట్టడానికి గానీ MRO గారి అనుమతి అవసరం లేని యెడల చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఎన్నికల ప్రచారం, సమావేశాలు, ర్యాలీలు అనుమతుల్లో పేర్కొన్న పరిమితులలో మాత్రమే చేయాలి. కులం, మతం, వర్గాల ఆధారంగా ప్రచారం చేయడం, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం నిషేధం. రాత్రి అర్ధరాత్రి తర్వాత సౌండ్‌తో ప్రచారం చేయరాదు. మీటింగ్‌లకు ముందుగా అనుమతి తప్పనిసరి, ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతులు ఇవ్వడం పెద్ద నేరం అభ్యర్థిత్వం రద్దు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రచార వాహనాలు, సౌండ్ బాక్స్‌లను అనుమతులకు అనుగుణంగా తనిఖీకి సిద్ధంగా ఉంచాలి.

**ప్రత్యర్థులను రెచ్చగొట్టే చర్యలు పూర్తిగా నిషేధం**

ఇళ్లకు వెళ్లి ఓటర్లను బెదిరించడం, ఒత్తిడి చేయడం, మానసిక ఒత్తిడి పెట్టడం చట్టపరంగా నేరం. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు ఏర్పరచి వాతావరణాన్ని దెబ్బతీయరాదు. ఓటర్లను తరలించడం, నియంత్రించడం, వారి ఓటు స్వేచ్ఛపై ప్రభావం చూపడం నేరం. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే అభ్యర్థులపై విచారణ, కేసులు, అభ్యర్థిత్వ రద్దు వంటి చర్యలు జరుగుతాయి. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే వీడియోలు పెడితే ఐటీ చట్టం కింద కఠిన చర్యలు తప్పవు.

**అత్యవసర సూచన – నగదు రవాణా**

ఎవరైనా 50,000 రూపాయలకు మించి నగదు తీసుకెళుతున్నప్పుడు తప్పనిసరిగా ఆ నగదుకు సంబంధించిన ఆధారాలు వెంట పెట్టుకోలి. లేకపోతే ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు ఆ నగదును సీజ్ చేస్తారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని ఆయన తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం /మల్లాపూర్ : మండల కేంద్రంలోని అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో ఈనెల తొమ్మిదో తారీఖున విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సిజిఆర్ఎఫ్ చైర్పర్సన్ ఎరుకల నారాయణ తెలిపారు.
ఈ సందర్భంగా ఆదివారం ప్రకటన ద్వారా మాట్లాడుతూ మంగళవారం రోజున ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సంబంధిత సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, మల్లాపూర్ సబ్ డివిజన్ పరిధిలోని మల్లాపూర్ రాఘవపేట ఇబ్రహీంపట్నం మేడిపల్లి వెస్ట్ సెక్షన్ ఆఫీస్ పరిధిలోని విద్యుత్ వినియో గదారులు హాజరై పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా జిల్లా విద్యుత్ శాఖ అధికారులు కూడా పాల్గొంటారని పేర్కొన్నారు.

## ముగిసిన రామగుండం 'బి' థర్మల్ కేంద్రం ప్రస్థానం!

ఐదు దశాబ్ధాలకుపైగా దేశానికి, రాష్ట్రానికి సేవలు
'ఓల్డ్ ఈజ్ గోల్డ్'గా చరిత్రలో ఎన్నో రికార్డులు
విద్యుత్తు ప్లాంటు మూసివేతను ప్రకటించిన ప్రభుత్వం



ప్రజాపక్షం/గోదావరిఖని : నిజాం ప్రభుత్వంలో అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా పేరిటా దేశంలోనే రెండొ థర్మల్ విద్యుత్తు కేంద్రమైన అజామాబాద్ థర్మల్ పవర్ స్టేషన్(ఎస్టేషన్) ఇప్పటికే రామగుండంలో మూతపడింది. తాజాగా రామగుండంలో ఉన్న మరొ విద్యుత్తు ప్లాంటును మూసివేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వు జారీ చేసింది. దీంతో పట్టణంలో రెండొ ప్లాంటుగా ఏర్పాటైన బిథర్మల్ విద్యుత్తు కేంద్రం ప్రస్థానం ఇక ముగిసింది. రూ.14.8 కోట్లతో 62.5 మెగావాట్ల సామర్థ్యంతో 1971 అక్టోబర్ 17న స్థాపించారు. అనంతరం 1972 జూన్ 16న బిథర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు ప్రారంభించారు. 25 ఏళ్ల జీవిత కాలంతో ఏర్పడిన ఈ ప్లాంటు దీర్ఘకాలికంగా 52 సంవత్సరాల 7 నెలల కాలంపాటు విద్యుత్తు ఉత్పత్తి చేపట్టి రికార్డు నెలకొల్పింది. ఈ ప్లాంటు విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభమైనప్పటి నుంచి 18743.4 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసి, 3,68,611 రన్నింగ్ గంటలు పనిచేసింది. యంత్రాలు, పరికరాలు సక్రమంగా పనిచేయక చివరికి గత ఏడాది జూన్ 4న విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేశారు. ఈ యేడాది జనవరి 27న జరిగిన జెన్కో 69వ బోర్డు సమావేశంలో సాంకేతిక కమిటి సమర్పించిన నివేదిక ఆధారంగా బిస్టేషన్ను దశలవారీగా తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రిన్సిపల్ సెక్రటరి నవీన్ మిట్టల్ ఉత్తర్వులో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపడంతో జెన్కో సిఅండ్ఎండిని ఆదేశిస్తూ శనివారం ఆయన ఉత్తర్వు జారీ చేశారు.

## దరఖాస్తుదారులపై పెద్దపల్లి ఆర్టిఒ (ఆర్టిఏ) అధికారుల దురుసు ప్రవర్తన

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి ఆర్టీవో అధికారులు తమ కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులపై దురుసుగా ప్రవర్తిస్తూ ఇష్టం వచ్చినట్లుగా నానా బూతులు తిడుతున్న అధికారుల తీరుపై దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని బాధితుడు గట్టయ్య ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వివరల్లోకివేతే ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన నాగుల గట్టయ్య డ్రైవింగ్ లైసెన్స్ సంబంధిత విషయంపై గత శుక్రవారం పెద్దపల్లి ఆర్టీవో ఆఫీస్ కి వెళ్ళాక సర్వర్ డౌన్ ఉండడం వల్ల మూడు గంటల తర్వాత లైసెన్స్ సంబంధించిన ఫోటో దిగి ఫైల్ కౌంటర్ వద్ద ఇచ్చిన తర్వాత అధికారుల సూచన మేరకు వెయిటింగ్ చేయమనగా ఆఫీస్ కార్యాలయం ప్రాంగణంలో కూర్చొని ఉన్న నాగుల గట్టయ్యపై సతీష్ అనే కానిస్టేబుల్ ఇష్టం వచ్చినట్లుగా బూతులు తిడుతూ ఇక్కడ ఎందుకు ఉన్నావురా అంటూ ఇక్కడి నుండి వెళ్ళిపో అని ఇష్టం వచ్చినట్టు తిట్టారని బాధితుడు వాపోయాడు. అధికారులే ఇక్కడ వెయిటింగ్ చేయమని చెప్పడంతో ఉన్నారని తమను ఇలా తిట్టడం సరికాదని తనను ఇష్టం వచ్చినట్టు తిట్టిన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గట్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

## కవితా కిషన్రెడ్డికి జననీరాజనం పలుకుతున్న గ్రామస్తులు



ప్రజాపక్షం/ముత్తారం: బిఆర్ఎస్ పార్టీ పక్షానసర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి కె తమ అమూల్యమైన ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపిస్తామని ఓడేడు గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు ముక్తకంఠంతో జననీరాజనం పలుకుతున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామంలోని పలు వీధుల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధులకు చెందిన గ్రామస్తులు పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డికి తమ మద్దతు ఉంటుందని భరోసానిస్తూ ప్రతి ఇంటింటికి తిరుగుతూ బొట్టు పెడుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## రాజన్నపేట సర్పంచ్ బరిలో నమిలికొండ

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేట గ్రామసర్పంచ్ అభ్యర్థిగా నమిలికొండ శ్రీనివాస్ను బీఆర్ఎస్ పార్టీ బలపరిచింది.ఆయనకు మద్దతుగా గ్రామప్రజలు అశేషంగా అభిమానిస్తారు.యువకులు గ్రామప్రజలతో మమేకమవుతారు.గతంలో ఎంపీటీసీగా చేసిన అనుభవం ఉందని ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామఅభివృద్ధి కి తోడ్పడతానని ప్రజాపక్షంతో మాట్లాడారు.కేటీఆర్ దత్తత గ్రామంగా పేరు ఉందని నియోజకవర్గంలో తనకు మంచిపట్టు ఉందని సర్పంచ్గా ఎన్నుకోవాలని ప్రజలను కోరారు.

## రాగట్లపల్లి సర్పంచ్ ఏకగ్రీవం

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాగట్లపల్లి గ్రామసర్పంచ్ ఏకగ్రీవం అయ్యింది.ఆరు వార్డులతో పాటుగా ఏకగ్రీవంతో విశేషంగా మారింది.గ్రామస్థుల ఐకమత్యంతో నెత్తెట్ల లక్ష్మ య్యను సర్పంచ్గా ఎన్నుకున్నారు. గ్రామస్థుల సమక్షంలో పార్టీ కార్యాలయంలో సర్పంచ్గా ఎన్నికకాబడిన లక్ష్మ య్యను కాంగ్రెస్ సిరిసిల్లా నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహెందర్రెడ్డి ఆదివారం శాలువాతో కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం మాట్లాడారు.పేదలకు కాంగ్రెస్ రిక్రూట్మెంట్ ప్రభుత్వమని కొనియాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అధికారం కోసం కాదు సేవ చేయడమే సంకల్పం

ప్రజాపక్షం /మల్లాపూర్ : అధికారం కోసం కాకుండా గ్రామ ప్రజలకు సేవ చేయడమే ప్రధాన సంకల్పంగా ముందుకు వస్తున్నానని గొర్రెపల్లి గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని బి ఆర్ ఎస్ సర్పంచ్ అభ్యర్థి కదుర్క నరసయ్య అన్నారు. కాగా ఆదివారం మద్దతు దారులతో కలిసి గ్రామంలోని పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అనుభవమున్న సేవకుడిగా ప్రజలందరికీ సేవ చేస్తానని, గెలిపించాలని ఓటర్లను కోరారు. వీరి వెంటగ్రామస్తులు, మద్దతుదారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్కు పతనం ఆరంభం

తప్పుడు ప్రచారం చేస్తున్న హరీష్రావు, కెటిఆర్లకు భంగపాటు తప్పదు
మహిళ శక్తిని ప్రోత్సహించేందుకు సీఎం కృషి
మంత్రి వివేక్వెంకటస్వామి



ప్రజాపక్షం/ సిద్దిపేట : బిఆర్ఎస్ పార్టీకి పతనం ఆరంభమైందని.. జూబ్లిహిల్స్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ ఓడిపోతుందని మాజీ మంత్రులు కెటిఆర్,హరీష్రావులు తప్పుడు ప్రచారం చేసారని.. కాని విజయం కాంగ్రెస్ను వరించిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కాంగ్రెస్కు అభ్యర్థులు కరువైనారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటారని మంత్రి వివేక్వెంకటస్వామి జోస్యం చెప్పారు. ఆదివారం సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి వివేక్వెంకటస్వామి మాట్లాడారు. కాంగ్రెస్కు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు స్వీప్ చేస్తారన్నారు. గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందలేదని, కాంగ్రెస్ ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తుందన్నారు. రాష్ట్రంలవో 17 లక్షల ఇందిరమ్మ ఇండ్లు చేపడుతున్నట్లు తెలిపారు. సిద్ధిపేట జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్కార్డు ఇవ్వలేదని, కాని మాజీ మంత్రి హరీష్రావు ఇచ్చినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తాము 5లక్షల కొత్త రేషన్కార్డులు ఇచ్చామని, పేదలకు సన్న బియ్యం అందచేస్తున్నట్లు తెలిపారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ఉద్యోగాలు ఇవ్వలేదని కాంగ్రెస్ సర్కార్ 60 వేల ఉద్యోగాలు భర్తి చేశారని, త్వరలో మరో 40 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సిఎం రేవంత్రెడ్డి హుస్నాబాద్లో జరిగిన ప్రజాపరిపాలన సభలో ప్రకటించిన విషయం గుర్తుచేశారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చామని, మహిళ శక్తిని ప్రోత్సహించేందుకు సిఎం రేవంత్రెడ్డి అనేక పథకాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రం 8 లక్షల అప్పులతో దివాళా తీసిందని, కెసిఆర్ అప్పులకు సిఎం రేవంత్రెడ్డి వడ్డీలు కడుతున్నారన్నారు. కెసిఆర్ కుటుంబంలో ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయని, కెసిఆర్ కూతురు కవితనే అవినీతి సంపాదన గురించి చెపుతుందన్నారు. ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు తాము అండగా ఉంటామన్నారు. ఆనంతరం కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను మంత్రి వివేక్వెంకటస్వామి సన్మానించారు. అలాగే మంత్రి సమక్షంలో కాంగ్రెస్ చేరిన నాయకులకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈసమావేశంలో నియోజక వర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు బొమ్మలయాదగిరి, మార్క సతీష్, కలీమ్. ఎల్లం, ముద్దం లక్ష్మి, సంతోషి, రాజబహదూర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం పట్టివేత



ప్రజాపక్షం/ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామంలో నారాయణపురం చంద్రం అనే వ్యక్తి తన ఇంట్లో మద్యం అమ్ముతున్నాడు అనే సమాచారం తో ఆదివారం అతని ఇంట్లో సోదాలు చేయగా 10.440 లీటర్ల మద్యం దొరికిందని మద్యం సీజ్ చేసి ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సిహెచ్ గణేష్ తెలిపారు. మండలంలో అక్రమంగా మద్యం రవాణా మద్యం విక్రయాలు చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## నిప్పంటుకొని వృద్ధురాలు మృతి

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన మందల కమలమ్మ (75) ఆదివారం నిప్పంటుకొని మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 5గంటలకు చలిమంట కాగుతుండగా, ప్రమాదవశాత్తు చీర కొంగుకు నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ వృద్ధులు అరుపులు, కేకలు పెట్టగా ఇంట్లో పడుకొని ఉన్న కుటుంబ సభ్యులు ఒక్కసారిగా బయటకు వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే కమలమ్మకు తీవ్రంగా కాలిన గాయాలు అయ్యాయి. హుటాహుటిన ఆమెను గోదావరిఖనిలోని ఆసుపత్రి, అక్కడి నుంచి వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

## ఎల్లారెడ్డిపేటలో వేర్వేరు కేసులు నమోదు

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలో గుడుంబా అమ్ముతున్నవ్యక్తిపై, అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒకరిని, ద్విచక్రవాహనం డీకొని మరణానికి కారకుడైన మరోకరిపై ఎల్లారెడ్డిపేట ఠాణాలో కేసులు నమోదు అయ్యాయి, ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కిష్టునాయక్ తండాకు చెందిన బానోతుశ్రీరాం తన ఇంట్లో తనిఖీ చేయగా రెండు లీటర్ల గుడుంబా లభ్యమైందన్నారు. గొల్లపల్లి గ్రామశివారులో కిరాణాషాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్నడనే సమాచారం మేరకు అక్కడ మూడులీటర్ల మద్యం దొరికిందని పోలీసులు పేర్కొన్నారు.రాజన్నపేట గ్రామంలో గుగులోతు విజయ్ ద్విచక్రవాహనంతో నమిలికొండ సత్తయ్యను డీకొనగా ప్రైవేటు అసుపత్రిలో చేర్పించారు.ఆదివారం తెల్లవారుజామున మరణించడంతో మృతుని కుమారుడు పిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట ఎస్సై రాహుల్రెడ్డి పలు కేసులలో నిందితులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని మీడియా తో తెలిపారు.

# పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి: కలెక్టర్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది విధులు, ఎన్నికల సామగ్రి పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు తదితర అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, ఎంపీడీఓలు, అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో మూడో ఫేజ్ ఎన్నికలు ముగిసే వరకూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. మొదటి, రెండో, మూడో ఫేజ్ లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసేందుకు తమ మండలాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి, బ్యాలెట్ బాక్స్ లు, పేపర్లు, ఇతర సామగ్రి పక్కాగా పంపిణీ చేయాలని సూచించారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది అధికారిక వాహనాల్లోనే వెళ్లి తిరిగి రావాలని స్పష్టం చేశారు. విధుల్లో పాల్గొనే వారికి భోజన సదుపాయం కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీరు తదితర వసతులు కల్పించాలని ఎంపీడీఓలకు సూచించారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచార సమయంలో వాహనాల వినియోగానికి, సభలు, ర్యాలీల నిర్వహణకు తహసీల్దార్, పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. పోటీలో అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలు, అనుమతులు తీసుకోవడం, ప్రచార వ్యయం వివరాలు తెలుపడంపై సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించామని, ఆయా మండలాల్లోని కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్లకు ఓటర్ స్లిప్ లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక తదితర అంశాలపై వివరించారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఎలాంటి ప్రచారం చేయవద్దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీపీఓ షరీఫుద్దీన్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, అన్ని మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలి

సర్పంచ్,వార్డు అభ్యర్థులకు అవగాహన కార్యక్రమంలో
జిల్లా అబ్జర్వర్ నిషాంతి, త్రీటౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్



ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్,వార్డు మెంబర్లు విధిగా ఎన్నికల నియమావళిని పాటించాలని సిద్దిపేట త్రీటౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్,జిల్లా అబ్జర్వర్ నిషాంతిలు సూచించారు. ఆదివారం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని గ్రామాలలో సర్పంచ్,వార్డులలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు పట్టణంలోని ఇందిరానగర్ పాఠశాలలో అధికారులు అవగాహన కల్పించారు. పంచాయతీ ఎన్నికల వేళ మోడల్ కోడ్ ఆఫ్ ఆక్ట్ అమల్లో ఉందని, అభ్యర్థులు రోజువారి ఖర్చులను ఫారమ్2, ఫారమ్3లో వివరాలను పొందుపర్చాలని, అక్రమాలకు, డబ్బు పంపిణీ, మద్యం పంపిణీ చేయరాదని, బెదిరింపులకు పాల్పడవద్దని, ఎక్కువ మంది గుమికూడరాదని, తప్పనిసరిగా శాంతియుత వాతావరణాన్ని పాటించాలని సూచించారు. ర్యాలీలకు విధిగా పర్మిషన్ తీసుకోవాలని, వాల్పోస్టర్లు, ఫ్లెక్సీలు ఎన్నికల నిబంధనలకు లోబడి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎక్కడైనా అవాంచనీయ సంఘటనలు లేదా నియమావళి ఉల్లంఘనలు దృష్టికి వస్తే వెంటనే పోలీస్ వారికి లేదా ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ హరికిరణ్,ఎంపిఒ శోభ, ఎంఇఒ రాజ ప్రభాకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాయి ఈశ్వరచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : సాయి ఈశ్వరావ్ చారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని బిసి సంఘాల నాయకులు పంతం రవి, బొజ్జ కనకయ్య, బుర్ర మల్లేశం లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా అంబేద్కర్ చౌక్ లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో చారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆత్మహత్యలు సరైన విధానం కాదనీ పోరాడి సాధించుకోవాలని విజ్ఞప్తి చేశారు.సాయి ఈశ్వర చారి ఆత్మ హత్యతో నైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో 42 శాతం బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో శ్రీకాంత్ చారి ఇప్పుడు బీసీల హక్కుల సాధన కొరకు సాయి ఈశ్వర చారి అమరత్వం పొందడం చాలా బాధాకరమని ఏది ఏమైనా పోరాటాల ద్వారానే మన సమస్యలు పరిష్కరించుకోవాలని, ఆత్మ హత్యలు చేసుకోవడం సరియైన విధానం కాదని అన్నారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శించడం చాలా దుర్మార్గమని ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయమై స్పష్టమైన వైఖరి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణు, సోమ నాగరాజు, రజని, సాగర్, శ్రావణపల్లి రాకేష్, గుండ్రేటి రాజు, సబ్బని రాకేష్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను అందరికీ అందేలా కృషి



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: రెండవ విడుత పంచాయతీ ఎన్నికల్లో వార్డు మెంబర్ అభ్యర్థి ఎల్లవ్వ తన స్వంత మేనిఫేస్టోను రూపొందించుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన ఏడె ఎల్లవ్వ పంచాయతీ ఎన్నికల్లో 7వార్డులో వార్డు అభ్యర్థిగా బరిలో నిలిచి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలను,వార్డులోని ప్రతి లబ్ధి దారునికి అందిస్తానని,సిఎంఆర్ఎఫ్,కాళ్యాణలక్ష్మి ,పెన్షన్లు తదితర పథకాలను అప్లై చేస్తానని,ధరణి,భూభారతి సమస్యల పరిష్కారం కోసం కృషి,ఇందిరమ్మ ఇళ్లు,రేషన్కార్డులు అందిస్తాననని హామీ ఇస్తూ కరపత్రాన్ని రూపోందించి ప్రచారం నిర్వహిస్తున్నారు.

# ఇబ్రహీంపట్నంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని బండలింగాపూర్ వర్ష కొండ ఎర్దండి గ్రామాలలో ఆదివారము పోలీసులు ఫ్లాగ్ మార్చ్ ని ర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ వద్ద నుండి పోలీస్ స్టేషన్ వరకు పోలీసులు ఫ్లాగ్ మార్చు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మెట్పల్లి సిఐ అనిల్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల మధ్య గొడవలు వ్యక్తిగత దూషణలు లేకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని సిఐ అనిల్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అనిల్ కుమార్, కిరణ్ కుమార్, రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# యువతతోనే 'అంతర్గాం' అభివృద్ధి



ప్రజాపక్షం/గోదావరిఖని: మండల కేంద్రంగా ఏర్పాటైన అప్పటి ఉమ్మడి రాష్ట్రం, ఇప్పటి తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధికి నోచుకొని గ్రామం ఎదైన ఉందంటే అది పెద్దపల్లి జిల్లా టిటిఎస్ అంతర్గాం గ్రామమని, ప్రజలను అన్ని కష్టాల నుంచి గట్టెక్కిస్తామంటూ చెప్పిన పాత తరం నాయకులు ఒక్కరూ తమ మాటను నిలబెట్టుకోలేకపోయారని, ఇకనైన ప్రజలు మేల్కొని యువతకు అవకాశం ఇస్తేనే అంతర్గాం గ్రామంలో అభివృద్ధి జరుగుతుందని ఆ గ్రామ సర్పంచి అభ్యర్థి అంగోతు రవికుమార్ తెలిపారు. ఆదివారం గ్రామంలో ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రధానంగా ఇక్కడ మూతపడిన వీవింగు, స్పిన్నింగు మిల్లుల్లో పనిచేసిన బర్మా, శ్రీలంక కాందిశీకులకు 10 గుంటలు, స్థానిక కార్మికులకు 5 గుంటల నివాస స్థలాల కేటాయింపు, వీరికి చెల్లించాల్సిన వేతన బకాయిలకై నేటికి పోరాటం చేస్తున్నారన్నారు. నాయకుల మాటలను మరొమారు నమ్మి మోసపోకూడదని, యువతరానికి ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్నారు. ప్రధానంగా ఏలాంటి ఉపాధి లేక మహిళలు, యువతీ, యువకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ఏకైక లక్ష్యమని రవికుమార్ తెలిపారు.

# రీల్

## 'అన్నగారు వస్తారు' ట్రైలర్ విడుదల



స్టార్ హీరో కార్తి నటిస్తున్న 'అన్నగారు వస్తారు' ఈ నెల 12న వరల్డ్ వైడ్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమార స్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. డైరెక్టర్ హరీశ్ శంకర్ సోషల్ మీడియా ద్వారా 'అన్నగారు వస్తారు' సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్ కంప్లీట్ ఎంగేజింగ్‌గా ఉందని, థియేటర్స్‌లో సినిమా చూడాలనే క్యూరియాసిటీ క్రియేట్ చేసిందని హరీశ్ శంకర్ అప్రిషియేట్ చేస్తూ..'అన్నగారు వస్తారు' సినిమా టీమ్‌కు తన బెస్ట్ విశెస్ అందించారు.


## 'కామాఖ్య' ఫస్ట్ లుక్



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న థ్రిల్లర్ సినిమా 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ ప్రయివేటు లిమిటెడ్ బ్యానర్‌పై వడ్డేపల్లి శ్రీవాణీ నాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ మంత్రి సీతక్క 'కామాఖ్య' ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశారు. ఈ చిత్రంలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తున్నారు. రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తున్నారు. భూపతి యాదగిరి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు




## పోస్ట్ ప్రొడక్షన్‌లో ది రైజ్ ఆఫ్ అశోక



'లూసియా' ఫేమ్ సతీష్ నినాసం హీరోగా, నిర్మాతగా భారీ ఎత్తున రూపొందిస్తున్న చిత్రం 'ది రైజ్ ఆఫ్ అశోక'. ఈ మూవీని వృద్ధి క్రియేషన్, సతీష్ పిక్చర్ హౌస్ బ్యానర్ల మీద వర్ధన్ హరి, జైష్ణవి, సతీష్ నినాసం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాకు వినోద్ వి ధోండలే దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సతీష్ నినాసంకి జోడిగా 'కాంతార', 'తమ్ముడు' ఫేమ్ సప్తమి గౌడ నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన అన్ని పనుల్ని పూర్తి చేసుకుని ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి.

## 25న 'శంబాలా' రిలీజ్



హీరో ఆది సాయి కుమార్ తాజా సినిమా శంబాలా. ఈ సినిమాకు ఎ మిస్టికల్ వరల్ అనేది ట్యాగ్ లైన్. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి కలిసి షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి పోస్టర్స్, వీడియోస్ వదిలి హైప్ పెంచేసిన టీమ్.. ఈ క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి ఈ చిత్రానికి సంబంధించిన నైజాం హక్కులను భారీ మొత్తం చెల్లించి సొంతం చేసుకుంది. నైజంలో ఈ సినిమాను మైత్రి మూవీస్ విడుదల చేయనుంది. ఇక శంబాలా శాటిలైట్, డిజిటల్ హక్కుల విషయానికి వస్తే.. ప్రముఖ ఓటీటీ సంస్థ ఆహా ఈ చిత్రానికి స్ట్రీమింగ్ హక్కులను పొందగా, జీ నెట్వర్క్ శాటిలైట్ ప్రసార హక్కులను సొంతం చేసుకుంది.




## 9న 'ఉస్తాద్ భగత్ సింగ్' ఫస్ట్ సింగిల్ రిలీజ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకు సంబంధించి ఫస్ట్ సింగిల్ సాంగ్ ఈనెల 9న విడుదల చేయనున్నారు. పవన్ కళ్యాణ్‌తో గబ్బర్ సింగ్ బ్లాక్ బస్టర్ తీసిన హరీష్ శంకర్ ఈసినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్న హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీత అందిస్తున్నారు. విశాల్ దద్లాని పాడిన పాటను విడుదల చెయ్యనున్నారు. ఆనంద్ సాయి ఈ సినిమాకు ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.మైత్రీ మూవీ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది.

## ఘంటసాల బయోపిక్ మరో శంకరాభరణం కావాలి

– తనికెళ్ళ భరణి



టాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు, తన విలక్షణమైన బాణీలతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఘంటసాల వేంకటేశ్వరరావు (ఘంటసాల) బయోపిక్ ఎంతో గ్రాండ్‌గా తెరకెక్కింది. సి.హెచ్. రామారావు దర్శకత్వంలో 'ఘంటసాల ది గ్రేట్' అనే టైటిల్‌తో 12న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రంలో ఘంటసాల జీవితాన్ని ఆధారంగా చేసుకుని, ఆయన లైఫ్ లోని విభిన్న ఘట్టాలను కళ్ళకు కట్టినట్లు చూపించబోతున్నారు. అన్యక్త్ రామ్ పిక్చర్స్ సమర్పణలో సి.హెచ్.ఫణి నిర్మాణ సారథ్యంలో సి.హెచ్. రామారావు రచన, దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కించారు. ఈ సినిమాలో కృష్ణ చైతన్య ఘంటసాలగా, మృదుల ఘంటసాల సావిత్రమ్మగా, చిన్న ఘంటసాలగా తులసి మూవీ ఫేమ్ అతులిత నటించగా.. సుమన్ ముఖ్యపాత్రను పోషించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఘంటసాల బయోపిక్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన నటుడు, రచయిత తనికెళ్ళ భరణి మాట్లాడుతూ.. ఒక మహానుభావుడి సినిమా ఇది. దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం మామూలు విషయం కాదు. చదలవాడ శ్రీనివాస్ చెప్పినట్లు ఇది మరో శంకరాభరణం అవుతుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. రేలంగి నరసింహారావు మాట్లాడుతూ ఘంటసాల ఓ లెజెండ్. ఆయన బయోపిక్ తీయాలనే ఆలోచన మీకు రావడం నిజంగా గొప్ప విషయం. ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందని నమ్ముతున్నామన్నారు. ఘంటసాల పాత్ర పోషించిన నటుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ నేను సింగర్ని, యాక్టర్ని కాదు. ఘంటసాల పాటలు వింటూ పెరిగిన నాకు ఈ సినిమాలో నటించే అదృష్టం దక్కడం ఒక వరం. పాటలు పాడుకునే నన్ను రామారావు పట్టుబట్టి ఈ రోల్ చేయించారు. ఇప్పటికే సినిమా చూసిన వాళ్ళు ఈ సినిమా చాలా బాగుందని చెబుతున్నారు. తెలుగు సినిమా సంగీతానికి రెండు కళ్ళలో ఒకటి గంటసాల అయితే రెండోది బాలసుబ్రమణ్యం. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కూడా మూడేళ్ళ క్రితం ఆయన చేతుల మీదుగానే జరిగింది. దర్శకుడు సి.హెచ్. రామారావు మాట్లాడుతూ.. మహాగాయకుడు ఘంటసాల గురించి ఇప్పటి తరానికి తెలియాలనే తపనతో ఎంతో కష్టపడి ఈ సినిమా తీసాం. ఇంత గొప్ప సినిమా తీశాను అని సంతృప్తిగా ఉంది. ఈ సినిమా ప్రివ్యూ చూసి సినీ ప్రముఖులు అభినందిస్తుంటే ఎంతో ఆనందంగా అనిపించింది. భారతదేశ చరిత్రలోనే ఒక గాయకుడి బయోపిక్ రావడం ఇదే ప్రథమం. ఆ ఖ్యాతి ఘంటసాలకె దక్కింది. అది తీసే అదృష్టం నాకు దక్కింది అని అన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. ఘంటసాల గురించి ఎంత చెప్పినా తక్కువే. స్నేహంలో గాని, ఆప్యాయతలో గాని ఆయన్ను మించిన వారు లేరు. ఆయన పోయిన రోజు ఎంతో బాధపడ్డాం. సి.హెచ్. రామారావు ఈ సినిమా తీయడం నిజంగా ఓ దైర్యం. ఓ సదుద్దేశంతో సినిమా తీశారు కాబట్టి మీరు ఈ సినిమా కష్టాలు అధిగమించి విజయం సాధిస్తారు అని భావిస్తున్నా అన్నారు. ఈ సినిమాకు మొదటి టికెట్ ఒక లక్ష రూపాయలు కేటాయించి చదలవాడ శ్రీనివాస్ కొనడం విశేషం. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్, నిర్మాత శోభారాణి, పాటల రచయిత అనంత శ్రీరామ్, రచయిత జేకే భారవి, నిర్మాత చదలవాడ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## శశిరేఖా పాట రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా, నాయన తార హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా వచ్చే జనవరి సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ కేవలం నెలరోజుల సమయం మాత్రమే ఉండటంతో ఈ సినిమా ప్రమోషన్ ఈవెంట్స్‌ను పెంచారని చెప్పవచ్చు. ఇంతకు ముందు మీసాలా పిల్ల అనే పాటను విడుదల చేసిన నిర్మాతలు ఇప్పుడు మరోపాటను రిలీజ్ చేశారు. 'శశిరేఖా ఓ మాట చెప్పాలి చెప్పక ఫీలుకాక.. ఓ ప్రసాదు మోమాటం లేకుండా చెప్పేసేయ్ ఏమి కాదు' అనే పాటను రిలీజ్ చేశారు. ఈ పాటను గేయరచయిత అనంత్ శ్రీరామ్ రాయగా, సంగీత దర్శకుడు భీమ్స్, గాయని మధుప్రియా ఈ పాటను ఆలపించారు.

## ఈనెల 25న ఛాంపియన్




80వ దశకంలో తన నటనతో ప్రేక్షకులను అలరించిన నందమూరి కల్యాణ్ చక్రవర్తి సుమారు ముప్పై అయిదేళ్ల తరువాత తిరిగి తెరపై కనిపించారు. చిరంజీవి నటించిన లంకేశ్వరుడు సినిమాలో ప్రత్యేక పాత్రను పోషించిన కళ్యాణ్ చక్రవర్తి ఆ తరువాత సినిమాల జోలికి వెళ్ళలేదు. కాని ఇప్పుడు మ్పు అయిదేళ్ల తరువాత ఛాంపియన్ అనే సినిమాలో నటించారు. ఈ కథలోని పాత్ర నచ్చడంతో ఈ సినిమా చేసినట్టు స్వప్న సినిమా యాజమాన్యం ప్రకటించింది. స్వప్న సినిమాస్ ఎల్లప్పుడూ కొత్తదనం ఉన్న కథలకు ప్రాధాన్యమిస్తూ, విభిన్నమైన కథాంశాలు, అద్భుతమైన క్రియేటివ్, కాస్టింగ్ సెలెక్షన్స్‌తో ముందుకు సాగుతోంది. వారి తాజా చిత్రం 'ఛాంపియన్' జీ స్టూడియోస్ సమర్పణలో రూపొందుతున్న పీరియడ్ స్పోర్ట్స్ డ్రామా. అనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలిమ్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో కూడా స్వప్న సినిమాస్ తమ ప్రత్యేకతని కొనసాగిస్తోంది. ఛాంపియన్ ఈ క్రిస్మస్‌కి విడుదల కానుంది.

## కష్టాలు ఉంటేనే నిలదొక్కుకొని..

# నిచ్చెన మెట్లు ఎక్కగలుగుతాం

### తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : కష్టాలు ఉంటేనే నిలదొక్కుకొని, నిచ్చెన మెట్లు ఎక్కగలుగుతామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి అన్నారు. హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యాక్షుడు ములుగు రాజేశ్వర్ రావు రచించిన 'నేను బహువచనం', (ఆత్మకథ), 'అధినాయక జయహే' (కవితాసంకలనం) పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా (ఉమ్మడి ఎపి) రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రావు రచించిన పుస్తకాలను మోహన్ కందా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షులు దాసు కేశవరావు అధ్యతక్ష వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిజంపై ఆత్మకథలు రాస్తున్నారని, చదువుతున్నారని అన్నారు. వినయ్ కుమార్, రాజేశ్వర్ రావులు తనకు 40 ఏళ్లుగా తెలుసని, వారు కష్టాలు ఎదుర్కొని నిలదొక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుత జర్నలిజంలో కొంత పరిస్థితి మెరుగైందని, గతంలో కంటే భిన్నంగా ఉందని అన్నారు. రాజేశ్వర్ రావు ఇన్ని కష్టాలు ఎదుర్కున్నారని తెలియదన్నారు. రాజేశ్వర్ రావు రాసిన ఆత్మకథ నవల మాదిరిగానే ఉందన్నారు. పుస్తకంలో 74వ పేజీ తనకు బాగా నచ్చిందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉన్నత కుటుంబం నుంచే వచ్చిన రాజేశ్వర్ రావు కష్టాల పాలయ్యారన్నారు. రాజేశ్వర్ రావు ఆత్మకథ చదివితే నూతన తరం తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. జర్నలిజం సామాజిక దృక్పథం, జర్నలిజం సామాజిక ఉన్నతికి పాటు పడాల్సి ఉంటుందన్నారు. పత్రిక రంగాన్ని ఫోర్త్ ఎస్టేట్‌గా రాజ్యాంగంలో పొందుపర్చాలని అనేక మంది పట్టు బట్టారని, కానీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాత్రం అందుకు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ప్రజల తరపున పనిచేయడానికి పత్రిక రంగం ఉండాలని పట్టుబట్టారన్నారు. ముందుగానే ఊహించి అంబేద్కర్ పత్రిక రంగాన్ని రాజ్యాంగంలో బంధించకుండా అడ్డుకున్నారని ఆయన చెప్పారు. తెలంగాణ మీడియా అకాడమీ తరపున 12 మంది ప్రముఖ జర్నలిస్టుల పుస్తకాలు ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. పత్రికలకు సంబంధించిన సుమారు ఐదు లక్షల పేజీలను ఆన్‌లైన్‌లో చూసేందుకు అకాడమీ ఏర్పాట్లు చేస్తుందని శ్రీనివాస రెడ్డి చెప్పారు. రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా మాట్లాడుతూ సమాజంలో మీడియాది కీలక పాత్ర అని, అలాంటి మీడియా పరిపక్వత, వివేకం, గౌరవం, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే మరింత విలువ పెరుగుతుందని అన్నారు. సోషల్ మీడియి వచ్చిన తర్వాత మరింత ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకంలో 'ఉన్నది ఉన్నట్టుగా, లేనిది లేనట్టుగా' పొందుపర్చినట్టు వివరించారని తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ వినయ్ కుమార్ మాట్లాడుతూ రాజేశ్వర్ రావు ఆత్మకథ పుస్తకం చదివితే ఆకలిరాజ్యం, సాగరసాగమం సినీమాలు చూసినట్టుగా ఉందన్నారు. రాజేశ్వర్ రావు జీవితం సినిమా అవుతుందన్నారు. రాజేశ్వర్ రావు రాసిన పుస్తకం చదివితే యువ జర్నలిస్టులు నెర్చుకోవచ్చని అన్నారు. కేంద్ర మాజీ సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ రాజేశ్వర్ రావు రాసిన పుస్తకం అందరు చదువుకోవాల్సిన పుస్తకమని సూచించారు. ఆయన అన్ని రకాల రచనలు చేశారని అన్నారు. పుస్తక పరిచయాన్ని వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యాక్షులు టి.ఉదయవర్లు చేయగా, ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు జి.వల్లీశ్వర్, ఎమ్మెస్కో సంపాదకులు డి.చంద్రశేఖర్ రెడ్డి, సంఘం కార్యదర్శి కె.లక్ష్మ ణ రావు పాల్గొన్నారు.

## పిటిఓ పెట్రోల్ బంక్, నూతన భవనానికి డిజిపి శంకుస్థాపన



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లోని పోలీస్ రవాణా సంస్థ (పిటిఒ) ప్రాంగణంలో అత్యాధునిక రిటైల్ పెట్రోల్ బంకును, సిపిఎల్ అంబర్‌పేట్ గ్రౌండ్స్‌లో నూతన పిటిఒ భవన నిర్మాణానికి డిజిపి బి.శివధర్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. 21 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఈ అధునాతన భవనంలో వర్క్‌షాప్‌లు, డయాగ్నస్టిక్ సిస్టమ్స్, మెయింటెనెన్స్ బ్లాక్‌లు, ఆపరేషన్ జోన్‌లు, ప్రత్యేక శిక్షణా మౌలిక సదుపాయాలు ఉంటాయి. అలాగే జాతీయ రహదారి 44 ఆనుకుని 2025 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రిటైల్ పెట్రోల్ బంక్ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ రెండు కార్యక్రమాలలో పోలీస్ రవాణా సంస్థ ఐజిపిలు, టిజిపిహెచ్‌సి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రమేష్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సిఎం అబద్ధాలు చెప్పటం మానుకోవాలి

### మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : కాళేశ్వరం కూలిందని కెసిఆర్, హరీష్‌రావులను బండకేసి కొట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని.. రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు రా.. రంగనాయక్‌సాగర్‌లో బండ కట్టి నిన్ను ఎత్తేస్తా.. నీవు మునుగుతావో.. తెలుతావో చూస్తామని.. రంగనాయక్‌సాగర్‌లో నీళ్లుండి నీవు మునిగితే కాళేశ్వరం ఉన్నట్లు.. నువ్వు తేలితే కాళేశ్వరం కూలినట్లు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఫైర్ అయ్యారు. సిఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు, చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం మాజీమంత్రి హరీష్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి మాది రైతుప్రభుత్వం అంటున్నారని కాని చిన్నకోడురులో 450 రైతులకు ధాన్యం డబ్బులు 59 రోజుల నుండి రూ.45 కోట్లు రావాలని చెపుతున్నారన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండురోజుల్లో డబ్బులు వేస్తామని చెప్పారని.. కానీ 50 రోజులైన డబ్బులు రావటంలేదన్నారు. యాసంగి పెట్టుబడి కోసం రైతులు మద్దతు ధర తుక్కువ ధరకు అమ్ముతున్నారన్నారు. కాంగ్రెస్ సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్నకు బకాయిపడిన రూ.450 కోట్లు విడుదల చేయాలన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు కాముని శ్రీనివాస్, పోచపోయిన శ్రీహరి. కీసర పాపయ్య, జంగిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఇండిగో' రీఫండ్

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం నాటికి పూర్తి చేయాలని, లగేజీని రెండు రోజుల్లో డెలివరీ అయ్యేలా చూడాలని కేంద్రం శనివారం ఇండిగోను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు జరిగేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఇండిగో ఇప్పటికే ప్రకటించింది. సంక్షోభం నుంచి బయటపడటంతో పాటు సర్వీసుల పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకునేందుకు.. సిఇఒ, బోర్డు సభ్యులు కలిసి క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ (సిఎంజి)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. విమాన కార్యకలాపాల పునరుద్ధరణ విషయంలో దశలవారీగా పుంజుకుంటున్నట్లు ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ఆదివారం పరిస్థితి మరింత మెరుగుపడిందని, 1650 విమానాలు నడుపుతున్నట్లు వెల్లడించారు. సంస్థ ఆన్ టైమ్ పెర్ఫార్మెన్స్ నేడు 75 శాతంగా ఉండే అవకాశం ఉందని సిబ్బందికి పంపిన వీడియో సందేశంలో చెప్పారు. 138 విమానాశ్రయాల్లో 137 చోట్ల సేవలందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. పరిస్థితులను చక్కదిద్దేందుకు వేగవంతమైన చర్యలు తీసుకున్నట్లు పౌరవిమానయానశాఖ సైతం స్పష్టం చేసింది.

## డ్రోన్‌దాడి (మొదటి పేజీ తరువాయి)

బలి చేయవద్దని, వారు ఎప్పటికీ ఈ అంత్యుద్ధాలకు బాధ్యులు కాదని, వారిని పణంగా పెట్టి హింస సృష్టించవద్దని హెచ్చరించింది. తక్షణం అందరూ ఈ అంతర్యుద్ధ వ్యవహారంలో జోక్యం చేసుకుని యుద్ధాన్ని నివారించాలని కోరింది. కోర్డోఫాన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వ సైన్యాలతో ఆర్ఎస్ఎఫ్ తీవ్ర పోరాటం చేస్తోంది. రాజధాని ఖార్టూమ్, డార్ఫర్ మధ్యలో ఈ కోర్డోఫాన్ ప్రాంతం ఉంది. ఉత్తర కోర్డోఫాన్, దక్షిణ కోర్డోఫాన్,పశ్చిమ కోర్డోఫాన్ ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడానికి సైన్యం–ఆర్ఎస్ఎఫ్ మధ్య తీవ్ర యుద్ధం జరుగుతోంది. కోర్డోఫాన్‌లో 80 లక్షలమంది ప్రజలు జీవిస్తున్నారు. ఈ దుర్ఘటనపై ఆర్ఎస్ఎఫ్ నుండి ఎలాంటి తక్షణ ప్రతిస్పందన రాలేదు. గడచిన శుక్రవారంనాడు డార్ఫర్‌లో ఒక మార్కెట్‌పై సైన్యం దాడులు చేసిందని ఆర్ఎస్ఎఫ్ విమర్శించింది. 2023 ఏప్రిల్ నుండి సూడాన్‌లో రెండు సైనిక గ్రూపులమధ్య అంతర్యుద్ధం జరుగుతోంది. ఈ రెండు గ్రూపుల నాయకులు గతంలో ఒకే గ్రూపుగా ఉంటూ సూడాన్ పాలన చేశారు. తర్వాత విభేదాలవల్ల అంతర్యుద్ధం మొదలైంది

## ప్రత్యేక చర్చ

(మొదటి పేజీ తరువాయి)

చేయనున్నారు. ఈ ప్రత్యేక చర్చను ముగించే ప్రసంగాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేస్తారు. వందేమాతరంపై లోక్‌సభలో చర్చ కోసం మొత్తం 10 గంటల సమయాన్ని కేటాయించారు. ఇందులో 3 గంటల సమయాన్ని అధికార ఎన్‌డిఎ కూటమికి కేటాయించడం గమనార్హం. లోక్‌సభలో ప్రత్యేక చర్చ సందర్భంగా వందేమాతరంతో ముడిపడిన కీలకమైన చారిత్రక విశేషాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. వందేమాతరంపై లోక్‌సభలో జరిగే ప్రత్యేక చర్చలో కాంగ్రెస్ తరఫున 8 మంది ఎంపిలు ప్రసంగించనున్నారు. ఈ జాబితాలో గౌరవ్ గొగోయ్ (విపక్ష ఉపనేత), ప్రియాంకాగాంధీ, దీపేందర్ హుడా, బిమల్ అకోయిజం, ప్రణితి షిండే, ప్రశాంత్ పదోల్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, జ్యోత్స్న మహంత్ ఉన్నారు.

### రాజ్యసభలోనూ వందేమాతరంపై చర్చ

వందేమాతరంపై మంగళవారం రాజ్యసభలోనూ ప్రత్యేక చర్చ జరగనుంది. ఈ చర్చను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ఆయన తర్వాత కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, రాజ్యసభ అధికార పక్షం నేత జెపి నడ్డా ప్రసంగిస్తారు. డిసెంబరు 1న మొదలైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు 19 వరకు కొనసాగుతాయి. వందేమాతరం 150 వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆ జాతీయ గేయం స్మారకోత్సవాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ నవంబరు 7న ఢిల్లీలో ప్రారంభించారు. బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతర గేయం తొలిసారిగా 1875 సంవత్సరం నవంబరు 7న 'బంగ దర్శన్' అనే సాహిత్య పత్రికలో ప్రచురితమైంది. అనంతరం ఆ గేయాన్ని తన నవల 'ఆనంద్ మఠ్'లో బంకిమ్ చంద్ర ఛటర్జీ చేర్చారు. ఈ నవల 1882లో ప్రచురితమైంది. వందేమాతరం గేయాన్ని సంగీతపరంగా స్వరపర్చిన వ్యక్తి జాదూనాథ్ భట్టాచార్య. 1896లో కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం వేదికగా తొలిసారిగా వందేమాతర గేయాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారు. దీంతో ఆ గేయానికి ప్రజల్లో క్రేజ్ పెరిగింది. తదుపరిగా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం కీలక భాగంగా మారింది. దేశ ప్రజల్లో దేశభక్తిని రగిల్చే మహత్తర అస్త్రంగా అవతరించింది.

### మంగళ, బుధవారాల్లో చర్చించే కీలక అంశాలు ఇవే!

మంగళ, బుధవారాల్లో లోక్‌సభలో పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది. ఈ జాబితాలో ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వంటి టాపిక్స్ ఉన్నాయి. ఎన్నికల సంస్కరణలపై బుధ, గురువారాల్లో రాజ్యసభలో చర్చ జరగనుంది. బిహార్‌లో సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించిన ఎస్ఐఆర్‌పై విపక్ష ఇండియా కూటమిలోని పార్టీలు ప్రధానంగా మాట్లాడే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రక్రియలో తాము గుర్తించిన లోపాలను లోక్‌సభలో ప్రస్తావించే ఛాన్స్ ఉంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com